అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 18-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 | సంచిక : 149 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

వీధి కుక్కలపై అధ్యయనానికి నిపుణుల కమిటీ

- బాలుడి మృతి కలిచివేసింది
- జవహర్‌నగర్ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ జవహర్‌నగర్‌లో వీధి కుక్కల దాడిలో రెండేండ్ల బాలుడు మృతి చెందడం తనను కలిచి వేసిందని సీఎం ఏ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. వీధి కుక్కల బెడద ఉన్న ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కాల్ సెంటర్ లేదా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పసికందులు, చిన్నారులపై ప్రతి ఏటా వీధి కుక్కల దాడులకు వాతావరణ పరిస్థితులా లేక సీజనల్ అంశాలు కారణమా అనే అంశంపై అధ్యయనానికి పశు వైద్యులు, బ్లూ క్రాస్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీధి కుక్కలకు టీకాలు వేయటంతో పాటు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో కుక్క కాటుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్య శాఖను సీఎం ఆదేశించారు. ఇలాంటి ఘటనలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, అన్ని బస్తీలు, కాలనీలు, సంబంధిత వార్డు కమిటీల సహకారం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా, రైతన్నకు ఇచ్చిన మాట ప్రకారం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తమ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు ముందుకొచ్చామని తెలిపారు. గురువారం సాయంత్రానికి 11.5 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ కానున్నట్టు పేర్కొన్నారు. ఆగష్టు 15లోగా రైతు రుణాలను మాఫీ చేస్తామని గతంలో ముఖ్యమంత్రి ప్రకటించారనీ, అందుకు నెలరోజుల ముందుగానే హామీని నిలబెట్టుకుని తమ నిబద్ధతను చాటుకున్నామని అన్నారు. పదహారేండ్ల క్రితం కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి రూ. 72 వేల కోట్ల వ్యవసాయ రుణాలు, వడ్డీలను మాఫీ చేసిందని గుర్తు చేశారు. తెలంగాణలో వ్యవసాయం మరింత లాభసాటిగా మారి, రైతులు ఆర్థికంగా బలపడడానికి వీలుగా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.. వ్యవసాయం దండుగ కాదు, పండుగ అనే విధంగా పరిస్థితిని మారుస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 60 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారనీ, రైతును రాజు చేయాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకెళుతున్నదని పేర్కొన్నారు.

అసమానతలను చట్టబద్ధం చేసిన అధర్మ శాస్త్రాలు



దేశ అభివృద్ధికి ఆటంకంగా కులం

- సామజిక పీడన, ఆర్థిక దోపిడీ అంతం కావాలి
- కులవివక్షను సమర్థించే బీజేపీని నిరోధించాలి : దళిత శోషన్ ముక్తి మంచ్ జాతీయ ఉపాధ్యక్షులు బీవీ.రాఘవులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో అసమానతలను చట్టబద్ధం చేసిన అమానవీయ అధర్మ శాస్త్రాలను ప్రతి ఒక్కరూ తిరస్కరించాలని, సామాజిక పీడన, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ఏకకాలంలో ప్రతిఘటన ఉద్యమాలు నిర్మించాలని దళిత్ సోషల్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ ఉపాధ్యక్షులు బీవీ.రాఘవులు పిలుపునిచ్చారు. హనుమ కొండ దీపా విద్యుత్ భవన్‌లో నిర్వహిస్తున్న కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణా తరగతుల ముగింపులో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దేశంలో కులం పేరుతో మనుషుల్ని ముక్కలు చేసి.. వంశపారంపర్యంగా అసమాన తల్ని చట్టబద్ధం చేసిన దుర్మార్గ శాస్త్రాలను తిరస్కరించాలని రాఘవులు అన్నారు. భూమి, చదువు, ప్రకృతి వనరులను మెజారిటీ ప్రజలకు దక్కనీయకుండా చేసిన ఆ తప్పుడు శాస్త్రాల వల్లే దేశం నేటికీ వెనుకబడి ఉందన్నారు. దేశ అభివృద్ధికి ఆటంకంగా కులం నిలిచిందన్నారు. కుల వివక్ష అంటరానితనాన్ని సంపూర్ణంగా సమర్థించే రాజకీయ పార్టీ బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంద న్నారు. ఆ పార్టీ విధానాలను బలపరడం అంటే.. కులవ్యవస్థను, అసమానతల్ని అంగీకరించడం, సమర్థించడమేనని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలపై పెరుగుతున్న దాడులు దౌర్జన్యాలను బీజేపీ ఏనాడూ ఖండించిన పాపాన పోలేదన్నారు. బీజేపీ అధికారంలోకొచ్చాక రాజ్యాంగం, రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేయడానికి ఒక పథకం ప్రకారం కుట్ర చేస్తోందని విమర్శించారు. దేశంలో కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడం, కార్పొరేట్ శక్తులకు అమ్మడం ద్వారా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బీజేపీ పని చేస్తోందన్నారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించకుండా సామాజిక న్యాయం ఎలా సిద్ధిస్తుందని ప్రశ్నించారు. బీజేపీ పదేండ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై రెట్టింపు స్థాయిలో దౌర్జన్యాలు పెరిగాయన్నారు. దేశవ్యాప్తంగా 20 శాతం ఉన్న దళితులకు బడ్జెట్లో జనాభా దామాషా ప్రకారం ఎందుకు నిధులు కేటాయించలేదో బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని ఎందుకు నీరుగార్చారో జవాబు చెప్పాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా దళితులు అమానుష కులవివక్ష అనుభవించ డానికి పాలకుల వివక్షే కారణమని విమర్శించారు.

మనువాద విధానాలను ప్రతిఘటించాలి

బీజేపీ మనువాద విధానాలను సామాజిక, ప్రజాస్వామిక, అభ్యుదయ శక్తులు సమైక్యంగా ప్రతిఘటించాలని రాఘవులు కోరారు. దేశ ప్రజల రక్షణ కవచంగా ఉన్న రాజ్యాంగం ప్రమా దంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ మతం ప్రమా దంలో ఉన్నదని బీజేపీ నేతలు పదే పదే వల్లిస్తున్నారు కానీ ఆ పార్టీ విధానాల వల్లే దేశ ప్రజలు ప్రమాదంలో ఉన్నారని అన్నారు. కులవివక్ష, అణచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కలిసి వచ్చే అన్ని శక్తులు కలిసి రాజ్యాంగ పరిరక్షణ కోసం విశాల ఐక్యవేదిక ఏర్పాటు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ క్లాస్‌కు కేవీ పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున ప్రిన్సిపాల్‌గా వ్యవ హరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు మంద సంపత్, పల్లేర్ల లలిత, నందిపాటి మనో హర్, ఆరూరి కుమార్, డి.రాధా కృష్ణ, డి.రామ్మూర్తి, కోట గోపి, టి.సురేష్, దుర్గం దినకర్, ఎం.ప్రకాష్ కరత్, హనుమకొండ జిల్లా నాయకులు ఓరు గంటి సాంబయ్య దూడేపాక రాజేందర్ కనకం కావ్య పాల్గొన్నారు.

కాలికి పుండ్లయ్యాయని ఆస్పత్రికి వెళ్లి...

- పరిస్థితి విషమించి వ్యక్తి మృతి
- ఇంజక్షన్ వికటించడమే కారణమంటూ బంధువుల ఆరోపణ
- న్యాయం చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన



నవతెలంగాణ-కారేపల్లి

కాలికి పుండ్లు అయ్యాయని ఆస్పత్రికి వెళ్లిన ఓ వ్యక్తికి మూడు ఇంజక్షన్లు వేయగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో బుధవారం జరిగింది. ఇంజక్షన్ వికటించడం వల్లే చనిపోయినట్టు బంధువులు ఆరోపించారు. న్యాయం చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. కారేపల్లి మండలం మాణిక్యారం చెందిన రేపాకుల లాలయ్య(55), వీరమ్మ దంపతులు వ్యవసాయం కలిసిరాక ఖమ్మం నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా చేరారు. లాలయ్య కాలికి పుండ్లై మానకపోవడంతో బుధవారం కారేపల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన డాక్టర్ మూడు ఇంజక్షన్లు వేశారు. మొదటి ఇంజక్షన్ వేసిన తర్వాత తల తిరుగుతోందని, నరాలు గుంజుతున్నాయని, శ్వాస తీసుకోవటం కష్టంగా ఉందని చెప్పడంతో.. మరో రెండు ఇంజెక్షన్లు వేశారు. చివరకు పరిస్థితి విషమించి ఆస్పత్రిలోనే లాలయ్య మృతి చెందాడు. అయితే, వైద్యం వికటించటంతోనే చనిపోయాడని అతని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. రేపాకుల లాలయ్య సీపీఐ(ఎం) మాణిక్యారం శాఖ సభ్యులు. అతని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) నాయకులు, మాణిక్యారం గ్రామస్తులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడే మృతదేహాన్ని ఉంచి శాంతియుతంగా ఆందోళన చేశారు. మృతునికి భార్య వీరమ్మ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కుమార్తె ఉంది. అనంతరం ఆస్పత్రి వైద్యుడితో చర్చలు జరిపారు. కుటుంబానికి ఆర్థికసాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేంద్ర, నాయకులు తలారి దేవప్రకాశ్, కరపటి సీతారాములు, మోత్కూరి బుచ్చయ్య, కాంగ్రెస్ నాయకులు జవ్వాజి శ్రీనివాసరావు, దారావత్ బద్దులాల్, భూక్యా వాచ్యా, భూక్యా రంగారావు, బీఆర్ఎస్ నాయకులు అడపా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం ఓసీపీ-2లో ప్రమాదం

విరిగిపడిన మట్టిపెళ్లలు.. ఇద్దరు కార్మికులు మృతి

మరో ఇద్దరికి గాయాలు



వెంకటేశ్వర్లు (ఫైల్)



విద్యాసాగర్

నవతెలంగాణ- కోల్‌సిటీ



పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో బుధవారం సాయంత్రం ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

క్వారీలోని సౌత్ కోల్ ఏరియాలో సైడ్ వాల్ లోపల పైప్ లీకేజీని అరికట్టే పనులు చేపడుతుండగా కార్మికులపై ఒక్కసారిగా మట్టి కూలింది. దాంతో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు, జనరల్ మజూర్ విద్యాసాగర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమ్మయ్య, వీఎస్ఎన్ రాజు గాయపడ్డారు. మృతదేహాలను గోదావరిఖని సింగరేణి ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓసీపీ-2లో కక్షసాధింపు చర్యల్లో భాగంగా జరిగిన షిఫ్ట్ చేంజ్‌లో ఉప్పు వెంకటేశ్వర్లును సెక్షన్ మార్చడంతో ఆయన ఇటీవల పంప్ సెక్షన్‌కు వెళ్లినట్టు తెలిపారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 18-07-2024

సంపుటి : 10 | సంచిక : 149 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



నేటి నుంచి రుణమాఫీ

సాయంత్రం కల్లా రైతుల ఖాతాల్లో డబ్బులు

మూడు దశల్లో ... ఆగస్టు 15లోపు పూర్తి

- గ్రామ, మండల, అసెంబ్లీ కేంద్రాల్లో నేడు సంబురాలు
- ప్రజాభవన్ వేదికగా ప్రారంభించనున్న సీఎం
- కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో రేవంత్ ,భట్టి భేటీ

వరంగల్ రైతు డిక్లరేషన్ వాగ్దానం సాకారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లుగా రైతు మెడపై వేలాడుతున్న రుణ కత్తిని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందని చెప్పారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో వాగ్దానం చేసిన కాంగ్రెస్...దాన్ని సాకారం చేస్తోందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు 'రైతు రుణమాఫీ' ప్రక్రియను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. అప్పటి నుంచే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఇదే అంశంపై చర్చించేందుకు బుధవారం ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలతో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు సమావేశమయ్యారు. రుణమాఫీ మార్గదర్శకాలు, ...10లో



నీటిపారుదల ప్రాజెక్టులకు

రూట్‌మ్యాప్

మంత్రి ఉత్తమ్

వివరాలు 10లో



నాలుగు నెలల్లో 'నైనీ' బొగ్గు ఉత్పత్తి

అధికారులకు భట్టి దిశానిర్దేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి సంస్థకు ఒడిశా రాష్ట్రంలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ నుంచి నాలుగు నెలల్లో ఉత్పత్తిని ప్రారంభించాలని ...11లో

మేడిపండు చందంగా ఆర్థిక వ్యవస్థ

పడిపోతున్న ప్రజల వినియోగ వ్యయం

- జీఎస్టీ వసూళ్లు గోప్యం
- బడ్జెట్‌లో దృష్టి సారించాలంటున్న నిపుణులు

మోడీ ప్రభుత్వం మూడోసారి కూడా అధికారంలోకి వచ్చింది. కానీ దేశ ఆర్థికవ్యవస్థ మాత్రం గాడిలో పడటం లేదు. ప్రజలు పీకల్లోతు అప్పుల్లో, కష్టాల్లో కూరుకుపోతున్నా.. సర్కారు కార్పొరేట్లకే జై కొడుతోంది. ఆర్థిక వృద్ధి అంటే సెన్సెక్స్ పరుగులు పెట్టడం కాదన్న విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోతోంది. ఫలితంగా దేశ ఆర్థికవ్యవస్థ రోజురోజుకూ దిగజారుతూనే ఉంది. ప్రజల వినియోగ వ్యయం గణనీయంగా పడిపోతోంది. వాస్తవాలకు మసిపూసి మారేడు కాయలు చేయడం కాకుండా.. ఈ సారైనా పేదలకు మేలు చేసేలా బడ్జెట్‌పై దృష్టిపెడితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూఢిల్లీ : మధ్య ముంబయి నగరంలోని జౌళి మిల్లులు గత కొన్ని సంవత్సరాలుగా క్రమేపీ కనుమరుగవుతున్నాయి. వీటి స్థానంలో బహుళ అంతస్తుల భవనాలు దర్శనమిస్తున్నాయి. ఈ భవనాల ఎత్తు దాదాపు ఆకాశాన్ని తాకుతోంది. వీటిలో ఉండే వ్యక్తులు ఇతరుల సొమ్ముతో వ్యాపారాలు చేస్తుంటారు. ఎత్తయిన భవనాలు దూరం నుండి చూస్తే కంటికి ఎంతో అందంగా కన్పిస్తాయి. ముఖ్యంగా వర్షం కురిసేటప్పుడు ఆ దృశ్యాలను చూసి తీరాల్సిందే. ఇవన్నీ చూస్తుంటే ముంబయి మహా నగరం ఏ ఇతర అంతర్జాతీయ నగరానికీ తీసిపోదని అనిపిస్తుంది.

అయితే ఇది నాణానికి ఒక వైపు మాత్రమే. ఆ భవనాల నుండి బయటికి వచ్చి వర్షంలో గొడుగు వేసుకొని నడుస్తుంటే గుంతల రోడ్లు, ఎక్కడ చూసినా వర్షపు నీరు కన్పిస్తుంది. ఫుట్‌పాత్‌పై నడుద్దామని అనుకుంటే దానిపై చిరు వ్యాపారులు ఏదో ఒకటి అమ్ముతూ కన్పిస్తారు. గొడుగుల నుండి పూల దండల వరకు, మొబైల్ ఫోన్ కవర్ల నుండి పండ్లు, కూరగాయల వరకూ అక్కడ దొరకనిదంటూ ఉండదు. స్థానిక రైల్వే స్టేషన్‌కు పరుగులు తీసే జనం మిమ్మల్ని నెట్టుకుంటూ ముందుకు కదులుతుంటారు. ఓ వైపు విపరీతమైన వర్షం, మరోవైపు ట్రాఫిక్ రద్దీ ఇవన్నీ చూసి కూడా ముంబయి నగరం అందంగా ఉందని అనుకోగలమా?



మంది సొమ్ముతో జల్సాలు

ఇతరుల సొమ్ముతో వ్యాపారాలు చేసే వారు మాత్రం భవనాల నుండి బయట కాలు పెట్టరు. వారు ఫ్యాన్సీ కార్లలో ప్రయాణిస్తూ, డోర్ గ్లాసులు ఎక్కించేసి ఏసీ వేసుకొని ఎంజాయ్ చేస్తుంటారు. వారు ముంబయి వీధుల్లో ఎప్పుడూ కనబడరు. గబ్బు వాసనలు పీల్చరు. ఉక్కపోత అనేదే వారికి తెలీదు. అయితే వారి వ్యాపారాల కారణంగా బీఎస్‌ఈ సెన్సెక్స్ వచ్చే ఏడాది లక్ష పాయింట్లను, 2029కి 1.60 లక్షల పాయింట్లను, 2047 నాటికి పది లక్షల పాయింట్లను దాటేస్తుంది. స్టాక్ మార్కెట్ ఇలా నిక్షేపంగా ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థ కూడా అద్భుతంగా ఉన్నట్టా!

జీడీపీ పెరిగినా...

దూరపు కొండలు ఎప్పుడూ నునుపే. దూరం నుండి చూస్తే అంతా అందంగా, అత్యద్భుతంగా ఉన్నట్లు కన్పిస్తుంది. 'మేడి పండు చూడ మేలిమై ఉండును...పొట్ట విప్పి చూడ పురుగులుండు' అని అప్పుడెప్పుడో చిన్నప్పుడు చదువుకున్న ...11లో

ఈ చర్యలు తప్పనిసరి

ఈ నెల 23న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. దేశంలో వినియోగ వ్యయం ఎందుకు తగ్గుతోందో ఆర్థిక మంత్రి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రజల చేతిలో మరింత సొమ్మును ఉంచడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. ఇందుకోసం ప్రభుత్వం పలు చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. 'పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై పన్నులు తగ్గించాలి. ద్విచక్ర వాహనాలపై జీఎస్టీని 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాల అమ్మకాలు పెరిగితే దాని ప్రభావం రబ్బర్, ప్లాస్టిక్, స్టీల్ వంటి అనేక పరిశ్రమలపై పడుతుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం స్పష్టమైన కేటాయింపులు జరపాలి. వినియోగం పెరగాలంటే పట్టణ పేద మహిళలకు నగదు బదిలీ పథకాన్ని వర్తింపజేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. అది జరిగితే కార్పొరేట్ శక్తులు దేశ ఆర్థిక వ్యవస్థలో మరిన్ని పెట్టుబడులు పెడతాయి. తద్వారా ఉద్యోగాల కల్పన జరుగుతుంది. వినియోగ వ్యయం పెరుగుతుంది. ఆర్థిక వృద్ధి అంటే సెన్సెక్స్ పరుగులు పెట్టడం కాదన్న విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.



మాట్లాడుతున్న రాఘవులు

రుణమాఫీ మార్గదర్శకాలు సవరించాలి

చిన్న సన్నకారు, కౌలుదార్లకు మాఫీ వర్తింపజేయాలి

- పహాణీలో పేరున్న పోడు రైతులకూ ఇవ్వాలి
- త్వరితగతిన కులగణన చేయాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రుణమాఫీ మార్గదర్శక సూత్రాలను సవరించి చిన్న, సన్నకారు రైతులు, కౌలుదార్లకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు కోరారు. హన్మకొండ రాంనగర్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలుకు పూనుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే, అందుకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలు తీవ్ర లోపభూయిష్టంగా వున్నాయన్నారు. వాటి ప్రకారం కౌలుదార్లకు రుణమాఫీ వర్తించదని, పోడు వ్యవసాయం చేసే వారికి, రైతుమిత్ర గ్రూపులకు ...11లో

ఆ ఎమ్మెల్యేలు మాజీలయ్యే వరకు నిద్రపోం



- సుప్రీంకోర్టులో పోరాడుతాం
- రుణమాఫీకి పీఎం కిసాన్ నిబంధనలు ఎందుకు?
- పాస్‌బుక్కు సరిపోతుందని జీవోలో మార్చండి : మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-రామచంద్రాపురం

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఇతర పార్టీలకు వెళ్తున్న ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోమని, సుప్రీంకోర్టులో పోరాడుతామని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం ...11లో

12 మంది మావోయిస్టులు హతం

గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్

- మృతుల్లో తిపాగడ్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం
- భద్రతా బలగాలు వెల్లడి



గడ్చిరోలి : మహారాష్ట్రలోని గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని వండోలి గ్రామం సమీపంలో బుధవారం 12 నుంచి 15 మంది మావోయిస్టులు ఉన్నారని సమాచారం అందడంతో డిప్యూటీ ఎస్పీ సారథ్యంలో పోలీసులు ఆపరేషన్ నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య మధ్యాహ్నం మొదలైన భీకర కాల్పులు సాయంత్రం వరకు కొనసాగాయని పోలీసు అధికారులు తెలిపారు. దాదాపు ఆరు గంటల పాటు కాల్పులు జరగ్గా.. ఇప్పటివరకు 12మంది మృతదేహాలను గుర్తించినట్టు పేర్కొన్నారు. అలాగే, మూడు ఏకే 47 తుపాకీలతో పాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో తిపాగడ్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం అలియాస్ విశాల్ ఆత్రం ఉన్నట్టు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. మిగతా మృతదేహాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు, ఈ కాల్పుల్లో ఒక జవాన్‌కు బుల్లెట్ గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం నాగ్‌పూర్‌కు తరలించినట్టు భద్రతా అధికారులు తెలిపారు.



కర్నాటకలో

స్థానికులకే ఉద్యోగాలు

- మంత్రివర్గం ఆమోదం

వివరాలు 11లో

ఒమెన్ తీరంలో

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

19 మంది సిబ్బంది గల్లంతు

వివరాలు 11లో

రెండు వేల ఉద్యోగాలు 25 వేల మంది హాజరు



ముంబయి ఎయిర్‌పోర్టులో తొక్కిసలాట

ముంబయి : దేశంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో మరోసారి వెల్లడైంది. ముంబయిలోని కలినా ప్రాంతంలో ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిన వాక్-ఇన్-ఇంటర్వ్యూలకు భారీగా అభ్యర్థులు తరలిరావడంతో అక్కడ తొక్కిసలాట చోటుచేసుకుంది. వారిని నియంత్రించలేక అధికారులు, పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 2,216 హ్యాండీమాన్ ఖాళీలను భర్తీ చేసేందుకు ముంబయి ఎయిర్‌పోర్టులో మంగళవారం ఎయిర్ ఇండియా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. కౌంటర్ల వద్ద తమ పత్రాలు సమర్పించేందుకు భారీగా వచ్చిన అభ్యర్థులు ఒకరినొకరు తోసుకోవడం కనిపించింది. ఆహారం, నీరు అందక పలువురు ఇబ్బంది పడ్డారు. కొందరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆ ఉద్యోగంలో చేరినవారు విమానం నుంచి లగేజీ దించడం, ఎక్కించడంతోపాటు బ్యాగేజీ బెల్టులను చూసుకోవాలి. ఒక్కో ఎయిర్‌క్రాఫ్ట్‌లో లగేజీ, కార్గోను చూసుకునేందుకు ఐదుగురు ...11లో

మోడీజీ.. ఇప్పటికైనా అసత్యాలు ఆపండి : ప్రియాంక గాంధీ

నిరుద్యోగ సమస్యపై ప్రధానమంత్రి మోడీ అసత్యాలు ఆపాలని కాంగ్రెస్ నాయకులు ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పించామని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.



ఇదంతా ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న ప్రయత్నమన్నారు. ముంబయి ఎయిర్‌పోర్టులో నిరుద్యోగుల వెల్లువ ఘటనను ప్రస్తావిస్తూ.. 'ఎక్స్' వేదికగా మోడీ సర్కార్‌పై ప్రియాంక విమర్శలు గుప్పించారు. "ఇప్పటివరకు ఎన్‌డీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 8 కోట్ల ఉద్యోగాలు కల్పించి రికార్డు సృష్టించిందని ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మోడీ చెప్పారు. అవన్నీ అసత్య ప్రచారాలే. తాజాగా ముంబయి ఎయిర్‌పోర్టులో ఉపాధి కోసం నిరుద్యోగులు భారీగా తరలివెళ్లారు. ఈ పరిస్థితి దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది." అని విమర్శించారు. "బూటకపు వాగ్దానాల ద్వారా ప్రజల దృష్టిని మళ్లించకండి. దయచేసి యువతకు కొత్త అవకాశాలు కల్పించండి" అని కేంద్రాన్ని ఆమె కోరారు.





వెంకటేశ్వర్లు (ఫైల్)



విద్యాసాగర్

రామగుండం ఓసీపీ-2లో ప్రమాదం

విరిగిపడిన మట్టిపెళ్లలు.. ఇద్దరు కార్మికులు మృతి

మరో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ- కోల్‌సిటీ


పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో బుధవారం సాయంత్రం ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

క్వారీలోని సౌత్ కోల్ ఏరియాలో సైడ్ వాల్ లోపల పైప్ లీకేజీని అరికట్టే పనులు చేపడుతుండగా కార్మికులపై ఒక్కసారిగా మట్టి కూలింది. దాంతో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమ్మయ్య, వీఎస్ఎన్ రాజు గాయపడ్డారు. మృతదేహాలను గోదావరిఖని సింగరేణి ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓసీపీ-2లో కక్షసాధింపు చర్యల్లో భాగంగా జరిగిన షిఫ్ట్ చేంజ్‌లో ఉప్పు వెంకటేశ్వర్లును సెక్షన్ మార్చడంతో ఆయన ఇటీవల పంప్ సెక్షన్‌కు వెళ్లినట్టు తెలిపారు.

నవతెలంగాణ
మనిషికి విజ్ఞతను మించిన మిత్రుడు లేడు..
అజ్ఞానాన్ని మించిన శత్రువు లేడు - గురజాడ
గురువారం 18 జులై 2024
www.navatelangana.com

సంపాదకీయం

కరెంట్ కత సశేషమే



సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి విద్యుత్ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలిగారు. భారత ప్రధాన న్యాయమూర్తి అన్నట్టు "న్యాయం జరిగినట్టు కనపడటానికి" ఇది కూడా తప్పనిసరై యుండవచ్చు. రేవంత్ సర్కార్ 'తిక్క కుదిరింద'ని గులాబీ శ్రేణులు సంబరపడటం ఆశ్చర్యమే. అది కరెంటైనా, కాళేశ్వరమైనా కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటపడతాడన్న నమ్మకం వారికున్నట్టుంది.

సుప్రీంకోర్టు విద్యుత్ కమిషన్ విచారణ విషయాల్లో జోక్యం చేసుకోలేదు. కమిషన్ ఆఫ్ ఇంక్వైరీ వద్దని, అది రాజకీయ కక్షపూరితమైందని కేసీఆర్ వాదన. ప్రస్తుతానికి దానికి సంబంధించి ఆయనకు ఊరటేమీ లభించలేదు. జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ అంశాల మంచి చెడ్డల గురించి ముందే మీడియాతో ప్రస్తావించటాన్ని సుప్రీం తప్పుపట్టింది. దానితో ఆయన పదవి నుండి తప్పుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు నివేదించారు. ఆయన స్థానంలో మరో జడ్జీని నియమించుకోండని రేవంత్ సర్కార్‌కు సుప్రీంకోర్టు సూచించింది. ప్రస్తుతం ఆ పనిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కేసీఆర్ వాదనేమంటే ఈఆర్‌సీ ఫైనలైజ్ చేసిన విషయాలపై అవసరమైతే అప్పీలేట్స్‌లో సవాలు చేయాలి గాని, దానిపై విచారణ కమిషన్లు వేయడమేమిటనేది కీలక వాదన. ఈ అంశం జోలికి సుప్రీంకోర్టు వెళ్లలేదు.

ఏనుగుల్ని వదిలేసి దోమల్ని పట్టుకున్నట్టుంది మన పాలకుల పని. 2003 విద్యుత్ చట్టం ప్రకారమే తమ సర్కారు నడిచిందన్నది కేసీఆర్ వాదన. ఆ చట్టం గురించిగాని, దాని సవరణ బిల్లు (2021) గురించి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సైలెంట్‌గా ఉన్నాయి. విద్యుత్ పంపిణీ వ్యవస్థ ప్రయివేటీకరణ వేగం పెరిగింది. ఇప్పటికే హైదరాబాద్ పాతబస్తీ బిల్లుల కలెక్షన్ అదానీకిస్తున్నట్లు వార్తలొచ్చాయి. యూనియన్లు ధర్నాలు చేస్తున్నాయి. పాలకుల నుంచిగాని అధికార యంత్రాంగం నుంచిగాని ఎటువంటి స్పందనా లేదు. కార్మికులను కొందరు అదానీ తమతోనే పని చేయించుకుంటాడని, లేకుంటే తమని వేరే సర్కిల్స్‌కి బదిలీ చేస్తారన్న భ్రమల్లో ఉన్నారు.

ఈలోపు రెండు డిస్కాంలలో స్తంభాల నుండి సబ్ స్టేషన్ల లైన్ల పొడవు (సర్క్యూట్ కి.మీ.), డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు వంటివన్నీ సంఖ్యలతో సహా లెక్కలు సేకరించి రీ సర్వే చేస్తున్నారు. 90శాతం పూర్తయింది. దీనిపై ప్రభుత్వం నోరిప్పట్లేదు.

ప్రజలు, ఉద్యోగులు దీని భావమేమి తిరుమలేశా? అని కనుబొమ్మలు చిట్లించి చూస్తున్నారు. తెలంగాణలో విద్యుత్‌రంగ అభివృద్ధి జరిగింది తన పాలనలోనే అంటూ కేసీఆర్ రొమ్ము విరుచుకోవడాన్ని పూర్తిగా కొట్టేయలేం. కాని తాను చేసినదంతా కరెక్టని బింకాలు పోవడం సత్యదూరమైన విషయం.

నీటి సౌకర్యమున్న చోటే థర్మల్ స్టేషన్లు కడతారనేది నిజమే ఐనా, అన్నీ గోదావరి మీదే ఉన్నాయి కాబట్టి 'వెనకబడ్డ' నల్లగొండ జిల్లా దామరచర్లలో కృష్ణా నదిపై యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించామని చెప్పడం, దానికి సమీపంలో బందరు పోర్టుంది.. క్రిష్ణపట్నం పోర్టుంది అనడం విచిత్రం. బందర్లో ఇంకా పోర్టే నిర్మితం కాలేదు. మూడు జిల్లాలు దాటిపోతే క్రిష్ణపట్నం పోర్టు అందుతుంది. జనం నవ్వుకుంటారనే స్పృహ లేకుండా ఇటువంటి వ్యాఖ్యలు జస్టిస్ నర్సింహారెడ్డికి రాసిన 12 పేజీల సుదీర్ఘ లేఖలో మాజీ సీఎం రాయడం ఆశ్చర్యమేమరి.

> నీటి సౌకర్యమున్న చోటే థర్మల్ స్టేషన్లు కడతారనేది నిజమే ఐనా, అన్నీ గోదావరి మీదే ఉన్నాయి కాబట్టి 'వెనకబడ్డ' నల్లగొండ జిల్లా దామరచర్లలో కృష్ణా నదిపై యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించామని చెప్పడం, దానికి సమీపంలో బందరు పోర్టుంది.. క్రిష్ణపట్నం పోర్టుంది అనడం విచిత్రం. బందర్లో ఇంకా పోర్టే నిర్మితం కాలేదు. మూడు జిల్లాలు దాటిపోతే క్రిష్ణపట్నం పోర్టు అందుతుంది. జనం నవ్వుకుంటారనే స్పృహ లేకుండా ఇటువంటి వ్యాఖ్యలు జస్టిస్ నర్సింహారెడ్డికి రాసిన 12 పేజీల సుదీర్ఘ లేఖలో మాజీ సీఎం రాయడం ఆశ్చర్యమేమరి.

ఒకపక్క సింగరేణిని ముక్కలు ముక్కలుగా తన్నుకుపోయేందుకు ప్రయివేటు గద్దలు కాచుక్కూచున్నాయి. విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరించేందుకు ప్రస్తుత బీజేపీ, కాంగ్రెస్, గత బీఆర్ఎస్ వంటి ప్రభుత్వాలు చేస్తున్న 'కృషి' కోసం నోటకరుచుకుపోవటానికి చెట్టుకింద నిరీక్షించే నక్కబావల్లా 'కార్పొరేట్లు' సిద్ధంగా ఉన్నాయి.

కాంట్రాక్టీకరణ, కాషాయీకరణల 'అగ్నిపథ్'

- రాంభూపాల్

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం 'అగ్నిపథ్' పేరుతో మోడీ ప్రభుత్వం సైనిక నియామకాల్లో కాంట్రాక్టీకరణ విధానాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి భుజం కాస్తూ, మూడోసారి మోడీ ప్రధాని కావడానికి కారణమైన నితీశ్ కుమార్ ఈ అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకం గురించి పున:సమీక్షిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం కూడా ఇటీవల లీకేజీ వార్తలు ఇస్తున్నది. పార్లమెంట్‌లో చర్చ లేకుండా, నిపుణులతో సంప్రదించకుండా, ఏకపక్షంగా, ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు, లాక్‌డౌన్ లాగే ఈ అగ్నిపథ్ పథకం కూడా బెడిసికొట్టిందా?ఆఫీసర్ ర్యాంకుకు కింది స్థాయిలో వున్న సైనిక నియామకాల కోసం కేంద్రం 2022 జూన్ 14న 'అగ్ని పథ్' పథకాన్ని ప్రవేశ పెట్టి, సెప్టెంబర్ నుండి నియామకాలు చేపట్టింది. ఈ పథకం ద్వారా నియమించబడే సైనికులను కొత్త సైనిక ర్యాంకు కింద 'అగ్ని వీర్'లని పిలుస్తున్నారు. మెడికల్ బ్రాంచీల్లోని టెక్నికల్ కేడర్ మినహా అన్ని రంగాల్లో సైనికులు ఈ పథకం కింద సేవలకు యువత నియమితులవుతున్నారు. గతంలో సైనిక ఉద్యోగమంటే దేశభక్తితో కూడుకున్నదని, డ్యూటీలో మరణిస్తే అది వీరమరణం అవుతుందని, రిటైర్‌మెంట్ తర్వాతి జీవితానికి భరోసా వుంటుందనే నమ్మకంతో సంవత్సరానికి 75 వేల మంది యువత సైన్యంలో చేరేవారు. అలాంటి ఆలోచనలకు పూర్తిగా భిన్నమైంది ఈ 'అగ్ని పథ్' పథకం. అమెరికాలో అమలవుతున్న వాలంటరీ టూర్ ఆఫ్ డ్యూటీ (నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట సైనిక సేవలు) అనే విధానం నుండి ఈ 'అగ్ని పథ్' పథకాన్ని రూపొందించారు. అమెరికాతో పాటు ఇజ్రాయిల్, నార్వే, ఉత్తర కొరియా, సింగపూర్, స్వీడన్ దేశాల్లో ఇలాంటి విధానం అమలవుతున్నది. ఈ ప్రయోగం ఆచరణలో విఫలమైందని ఈ దేశాలన్నీ గుర్తించి సవరించుకుంటున్న స్థితిలో మన దేశంలో ఈ పథకం అమలులోకి వచ్చింది. 'అగ్ని పథ్' పథకంలో ప్రయివేటీకరణ విధానాలు, కాషాయదళ ప్రయోజనాలు కలగలిసి వున్నందున ఈ రెండింటి నుండి మద్దతు వుంది.

సైన్యంలో ప్రయివేటీకరణ

సాయుధ దళాలను యవ్వనంగా ఉంచడం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రస్తుత సాయుధ దళాల సగటు వయసు 32 ఏళ్ళు వుందని, దాన్ని 26 ఏళ్ళకు తీసుకు రావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు కేంద్రం చెప్పింది. అందుకోసమే 'అగ్ని పథ్' ద్వారా 17.5 సంవత్సరాల నుండి 21 (తర్వాత దీన్ని 23 సంవత్సరాలకు పెంచారు) సంవత్సరాలలోపు వయసు వున్న యువతను సైన్యంలో నియమిస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా నియమించబడిన 'అగ్ని వీర్'లు సివిల్ వర్క్ ఫోర్స్‌గా వుంటూ దేశానికి అవసరమైన సైనిక సేవలు చేస్తారట! ఈ మాటలన్నీ వినసొంపుగా వున్నా, ఈ పథకం అసలు ఉద్దేశ్యం సైన్యంలో కాంట్రాక్టీరణ విధానాన్ని అమలు చేయడం. శాశ్వత ఉద్యోగాలకు మంగళం పాడి, ఉద్యోగ విరమణ తర్వాత ఏ రక్షణ లేకుండా వీధుల్లోకి గెంటివేసే కాంట్రాక్టీరణ విధానం1991 తర్వాత అన్ని రంగాల్లో వేగంగా అమలవుతున్నది. ప్రయివేటీకరణ బకాసురుడి ఆకలికి ఇప్పుడు సైనిక రంగం ఆహారం అవబోతున్నది. ఈ పథకం కింద నియ మించే 'అగ్నివీర్'లకు ఆరు నెలలు శిక్షణ ఇచ్చి, నాలుగేండ్లు ఉద్యోగం ఇస్తారు. ఇలా ప్రతి ఏడాది ఎంపికయ్యే 42వేల మంది అగ్నివీర్‌లలో 25 శాతం మందికి మాత్రమే 15 సంవత్సరాల కొలువుకు అవకాశం వుంటుంది. వీరికి మాత్రమే పింఛన్, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు వుంటాయి. ఈ పథకం కింద నియమితు లైన సైనికులకు మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండవ సంవత్సరం రూ.33 వేలు, మూడో సంవత్సరం రూ.36,500, నాలుగో సంవత్సరం రూ.40 వేల వేతనం ఇస్తారు. ఈ వేతనంలో నుండి 30 శాతాన్ని కార్పస్‌ఫండ్‌కు జమచేస్తారు. కేంద్ర ప్రభుత్వం మరో 30 శాతాన్ని ఇందుకు జమ చేస్తుంది. నాలుగో సంవత్సరం పూర్తయ్యే నాటికి ఈ మొత్తం రూ. 10.04 లక్షలు అవుతుంది. 75 శాతం మంది అగ్నివీర్‌లకు ఈ మొత్తాన్ని రిటైర్‌మెంట్ ప్యాకేజీగా ఇచ్చి ఇంటికి పంపుతారు. ఇలా బయటకు వచ్చిన ఈ అగ్నివీర్‌లు మహా నగరాల్లో, నగరాల్లో వుండే కార్పొరేట్ ఆఫీసుల దగ్గర, కోటీశ్వరుల బంగ్లాల దగ్గర సెక్యూరిటీ గార్డులుగా పనిచేసే అవకాశం కోసం ఎదురు చూస్తూ బతకాలి. ఇప్పటికే 'దయార్ద్ర హృదయులు' అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీల యజమానులు, కంగనా రనౌత్ లాంటి సెలబ్రిటీలు అగ్నివీర్‌లకు అవకాశం ఇస్తామని 'గొప్ప మనసు'తో ముందుకు వచ్చారట! ఇన్నాళ్ళుగా మనం గుండెల నిండా గాలి పీల్చుకుని అరచిన 'జై జవాన్' నినాదం పాతబడి రానున్న రోజుల్లో కనుమరుగు కానుందన్న మాట!ఇప్పటికే రిటైర్ అయిన లక్షలాది మాజీ సైనికోద్యోగులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాజస్థాన్‌లో 53,373 మంది మాజీ సైనికులు ఉద్యోగాల కోసం అర్జీలు పెట్టుకోగా కేవలం 1415 మందికి మాత్రమే (2.6 శాతం) ఉపాధి దొరికింది. ఉత్తరప్రదేశ్‌లో 86,192 మందికి గాను 1616 మందికి (1.8 శాతం), పంజాబ్‌లో 60,772 మందికి గాను 1150 మందికి (1.8 శాతం), బీహార్‌లో 43,845 మందికి గాను కేవలం 6 మందికి (0.01 శాతం) మాత్రమే ఉపాధి అవకాశాలు దొరికాయి. ప్రస్తుతం ప్రతి సంవత్సరం సుమారు 75,000 మంది సైనికులు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి తోడు ప్రతి నాలుగు సంవత్సరాలకు 30 వేల మంది (అగ్ని పథ్ కింద నియమితులైన వారిలో 75 శాతం మంది) అగ్నివీర్‌లు తాత్కాలిక ఉద్యోగం నుండి బయటకు వస్తారు. వీరందరికి ఉపాధి ఎవరు కల్పిస్తారు? ఎక్కడ కల్పిస్తారు? 2022లో ఏర్పాటు చేయబడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 'ఆన్ డిఫెన్స్ రిపోర్టు' ప్రకారం 2025 నాటికి రక్షణ శాఖ పెన్షనర్ల సంఖ్య సుమారు 26 లక్షలు కాగా, వారి పెన్షన్ బిల్లు రూ.2.5 లక్షల కోట్లు అవుతుందని అంచనా. ఈ సంవత్సర రక్షణ బడ్జెట్ రూ.6,21,541 కోట్లు. ఇందులో రెండున్నర లక్షల కోట్లు అంటే సుమారు 40 శాతం పెన్షన్లకే ఖర్చు అవుతుందనే పేరుతో సైనికులకు పెన్షన్ అమలు చేయకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. దేశం కోసం ప్రాణ త్యాగాలకు సిద్ధపడిన సైనికులు రిటైర్‌మెంట్ తర్వాత గౌరవంగా జీవించే హక్కును కాలరాయడానికే ఈ విధానాన్ని బీజేపీ తీసుకు వచ్చింది. సైన్యంలో కూడా తాత్కాలిక ఉద్యోగాలు, పెన్షన్ లేని రిటైర్‌మెంట్ విధానాలు అమలు కావడం కార్పొరేట్ కంపెనీలకు అదనపు బలం, అందుకే ఈ పథకానికి ఆ కంపెనీలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపాయి.



> రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించడం ద్వారా హిందూ రాజ్య నిర్మాణం చేయాలనేది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. 1925లో స్వయం సేవక్ పేరుతో ఏర్పడిన ఈ సంస్థ ప్రతి రోజు తన సభ్యులకు శాఖ ద్వారా వ్యాయామంతో మొదలుపెట్టి, కర్ర సాము, ఆయుధాల శిక్షణ వరకు సైనిక తరహాలో శిక్షణ ఇస్తుంది. ఈ శిక్షణ లక్ష్యం మత విద్వేషం ప్రాతిపదికగా సాయుధ సైనిక బృందాలను తయారు చేయడం. 1938లోనే ఇందుకోసం భోంస్లా అనే ప్రాంతంలో మిలిటరీ స్కూల్ ప్రారంభిం చారు. అది ఇప్పటికీ నడుస్తోంది. ఇలా శిక్షణ పొందిన వారిని తమ అవసరాలకు అనుగుణంగా మత రాజకీయా లకు, మత ఘర్షణలకు వినియోగిస్తారు. జర్మనీ నియంత హిట్లర్ నుండి ఈ తరహా శిక్షణా పద్ధతులను ఆర్ఎస్ఎస్ వారసత్వంగా పొందింది. వీరు కోరుకునే పౌర సైనిక శిక్షణకు సరిగ్గా అగ్నిపథ్ పథకం తోడ్పడుతుంది. సైన్యంలో పనిచేసి వచ్చిన అగ్నివీర్‌లను తమ మతతత్వ రాజకీయాలకు వాడుకోవడం సులభం. కాబట్టే ఈ పథకాన్ని ఆర్ఎస్ఎస్ బలపరుస్తుంది.

కాషాయీకరణ

రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించడం ద్వారా హిందూ రాజ్య నిర్మాణం చేయాలనేది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. 1925లో స్వయం సేవక్ పేరుతో ఏర్పడిన ఈ సంస్థ ప్రతి రోజు తన సభ్యులకు శాఖ ద్వారా వ్యాయామంతో మొదలుపెట్టి, కర్ర సాము, ఆయుధాల శిక్షణ వరకు సైనిక తరహాలో శిక్షణ ఇస్తుంది. ఈ శిక్షణ లక్ష్యం మత విద్వేషం ప్రాతిపదికగా సాయుధ సైనిక బృందాలను తయారు చేయడం. 1938లోనే ఇందుకోసం భోంస్లా అనే ప్రాంతంలో మిలిటరీ స్కూల్ ప్రారంభించారు. అది ఇప్పటికీ నడుస్తోంది. ఇలా శిక్షణ పొందిన వారిని తమ అవసరాలకు అనుగుణంగా మత రాజకీయాలకు, మత ఘర్షణలకు వినియోగి స్తారు. జర్మనీ నియంత హిట్లర్ నుండి ఈ తరహా శిక్షణా పద్ధతులను ఆర్ఎస్ఎస్ వారసత్వంగా పొందింది. వీరు కోరుకునే పౌర సైనిక శిక్షణకు సరిగ్గా అగ్నిపథ్ పథకం తోడ్పడుతుంది. సైన్యంలో పనిచేసి వచ్చిన అగ్నివీర్‌లను తమ మతతత్వ రాజకీయాలకు వాడుకోవడం సులభం. కాబట్టే ఈ పథకాన్ని ఆర్ఎస్ఎస్ బలపరుస్తుంది.

సైన్యంలో కీలకమైన మార్పు చేసే అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టే ముందు దీని పర్యవసానాల గురించి నిపుణులతో కనీసం చర్చించకపోవడం సరికాదని పరమ వీరచక్ర కెప్టెన్ బాణా సింగ్ అభ్యంతరం తెలిపారు. ఈ పథకం అమలు వల్ల అనేక కష్టాలు వస్తాయని నావిక స్టాఫ్ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాష్, ఆర్మీ స్టాఫ్ మాజీ వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజ్ కద్యన్ లాంటి అనేక మంది మాజీ సైనిక ఉన్నతో ద్యోగులు అభిప్రాయపడ్డారు. అయినా వీటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా మోడీ ప్రభుత్వం 'అగ్ని పథ్' పథకాన్ని అమలులోకి తెచ్చింది. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తీవ్ర ఎదురుదెబ్బ తగలడానికి నిరుద్యోగం కీలక కారణమైంది. సైన్యంలో ఎక్కువ భాగం నియమితులయ్యే యు.పి, హర్యానా, పంజాబ్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో బీజేపీ ఘోరంగా దెబ్బతింది. అందుకే నితీష్ కుమార్ అగ్నిపథ్ పథకం గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం, కరోనా లాక్‌డౌన్ ఫలితంగా చిన్న పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతబడడం, జీఎస్‌టి పన్నుల విధానం, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల పోటీకి మధ్యతరహా పరిశ్రమలు గిలగిలలాడు తుండడం, ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమ తిరోగమన బాట పట్టడంతో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగింది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ తాజా నివేదిక 2015-2023 మధ్య 13 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని తయారీ రంగంలోని అసంఘటిత రంగ యూనిట్లలో పనిచేస్తున్న 54 లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారనే కఠోర వాస్తవాన్ని బయటపెట్టింది. ఉన్నత చదువులు కొనలేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రతి సంవత్సరం 75 వేల మంది సైన్యంలో చేరి బతుకుతున్నారు. ఈ 'అగ్ని పథ్' వల్ల కేవలం 40 వేల మందికి మాత్రమే తాత్కాలిక ఉద్యోగాలు వస్తాయి. సుమారు 35 వేల మంది సైనిక ఉపాధి కోల్పోతారు. ప్రస్తుతం వున్న నిరుద్యోగ సైన్యానికి వీరు అదనంగా తోడవుతారు. సర్వరోగ నివారిణిగా ప్రచారం చేసిన ప్రయివేటీకరణ ఇప్పటికే అనేక రంగాల్లో సర్వరోగాల నిలయంగా మారింది. ఇప్పుడు సైన్యంలోకి కూడా ఈ రోగం విస్తరించింది. పౌర జీవితంలో రగిల్చే మత విద్వేషాలను మరింత పెంచి పోషించేందుకు సైనిక రంగానికి కషాయ రాజ కీయాలు విస్తరిస్తున్నాయి. సైన్యంలోకి ప్రవేశ పెట్టిన కాంట్రాక్టీకరణ, కాషాయీకరణ విధానాలను అడ్డుకోవడం దేశ పౌరులందరి కర్తవ్యం.

కారంచేడు రుధిర క్షేత్రం భారతదేశ కుల వాస్తవిక కర్కశత్వానికి సాక్ష్యం. కారంచేడులో ఆధిపత్య కులంచే చంపబడిన అమరుల స్ఫూర్తి దినం 17జులై1985. కారంచేడులో కుల దురహంకారం మాదిగలను ఊచకోత కోసిన దుర్దినం.. ఇది జరిగి ముప్పయి ఎనిమిదేండ్లు గడిచాయి. కారంచేడు దురంతాలు భారతదేశంలో మొదటిది కాదు, చివరిదీ కాదు. ఆధిపత్య కులహత్యలు అనేకం జరిగాయి, జరుగుతున్నాయి. కాని కొన్నింటికి మాత్రమే జాతి జాతంతా కదులుతుంది. అలా కదిలించిన ఉద్యమమే కారంచేడు విజయం.

కారంచేడు చరిత్రను, కుల దాష్టీకాలను, ఆ ఉద్యమ చైతన్యాన్ని, స్ఫూర్తిని ఇతర బాధిత సమాజాలకు, ఉద్యమ సమాజాలకు ఇవ్వడానికి కారంచేడు రుధిర క్షేత్రాన్ని స్మృతి దినంగా జరుపుకోవాలి. బాధిత సమాజాలు ఐక్యంగా నిలబడిన ఉద్యమం. బాధిత సమూహాలకు బాసటగా అనేక ఉద్యమాలు, ఉద్యమ శక్తులు, వ్యక్తులు అండగా వున్న పోరాటమది. లక్షల మంది బాధిత శిబిరాలకు దన్నుగా వున్న ఉద్యమం కారంచేడు. అందుకే ప్రభుత్వాలు దిగొచ్చాయి. ఉద్యమం విజయవంతమైంది. అందుకే కారంచేడు రుధిర క్షేత్రాన్ని ప్రత్యేకంగా చరిత్రలో చెప్పాలి. కారంచేడు సాధించిన ప్రధానమైనవి దళితుల ప్రతిఘటనా పోరాటస్థైర్యం. దళిత ఆత్మగౌరవ పోరాటాన్ని ఇంకా అంటరాని సమాజాల మీద ఎలాంటి వివక్షలు జరగ కూడదనీ, జరిగితే ఎంత శిక్షార్హమో తెచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టమే అందుకు నిదర్శనం. ఈ చట్టం రాకముందు దళితుల మీద ఏం జరిగినా, ఎలాంటి దాడులు, హత్యలు జరిగినా కూడా సాధారణ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లే వుండేవి. నేరస్తులు సులువుగా ధనబలం, కుల బలంతో తప్పించుకునేవాళ్లు. కానీ కారంచేడు ఉద్యమం భారతదేశ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తెచ్చి వారికి బాసటగా నిలిచింది. ఇది సక్రమంగా అమలవుతుందా? ఇప్పటిదాకా ఎంత మంది శిక్షలు

కారంచేడు అలీసమ్మ హత్య కేసు ఏమైంది?



అనుభవించారంటే.. చెప్పలేము. కానీ అది అమలు పరిస్తే శిక్షలు ఖాయం అనే భయాలు కూడా ఉంటాయి.

ముఖ్యంగా కారంచేడు మారణకాండలో బాధిత మహిళలు సువార్తక్క, సలోచన, అలీసమ్మ ఇండ్లకు, కారంచేడు ఊచకోతకు ముందు మాదిగ గూడెం తాగే మంచి నీళ్ల చెరువును ఒక ఆధిపత్య కుల ఆసామి బర్లను కడిగి మురికి తీస్తుంటే కత్తి చంద్రయ్య అనే మాదిగ అవిటి అబ్బాయి 'మనషులు తాగే నీళ్లు అట్లా కంగాలి జేస్తవేంది సామి' అన్నందుకు 'నువ్వెవడవని' కొడుతుంటే..ఆ సమయంలో నీళ్ల కోసం బిందెతో వచ్చిన సువార్త అడ్డుకోబోయిందట. ఆమెను కూడా ఆ ఆసామి కొట్టబోతె బిందె ఎత్తిందట. ఆ తర్వాత కారంచేడు మారణకాండ చోటుచేసుకుంది.

పొలాల్లో పని చేసుకుంటున్న దళితుల మీద గొడ్డండ్లు, బరిసెలు గడ్డపారలతో భూస్వాములు ట్రాక్టర్లమీద వచ్చి దొరికినోల్లను దొరికినట్లు చంపింద్రు. చాలా మంది చెల్లా చెదురై పారిపోయింద్రు. కొంతమంది చావుదెబ్బలు తిని చచ్చినట్లు పడున్నారు. కొంత మందిని తీవ్రంగా గాయ పరిచింద్రు. వయసులో ఉన్న మహిళల్ని పొలంల దొరకబుచ్చుకొని కొట్టిన దెబ్బలు, గాయాలు వారి ఒంటి మీద ఇంకా మాయని మచ్చలుగా మిగిలిపోయాయి. ఈ మారణకాండలో మొత్తం చనిపోయింది దుడ్డు రమేష్, దుడ్డు వందనం, దుడ్డు అబ్రహం, తేళ్ళ ముత్తయ్య, తేళ్ళ యెహెూవా, అలీసమ్మ. ఆ దాడిలో నలభై మంది తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు.

దుడ్డు రమేష్ ఇరవైయేండ్లు కూడా నిండని యువకుడు. అతని భార్య సులోచన. సులోచనతో పాటున్న టీనేజ్ ఆడపిల్లలు తేళ్లమరియ, తేళ్ల విక్టోరియ, శాంతమ్మ, తాళ్లలక్ష్మి. వీల్లందర్ని కొట్టి కాల్చేద్దామన్న పథకం విఫలమైందని సజీవ చరిత్రగా మన్న సలోచన తనని కలిసిన వారితో చెప్తుంటది. సులోచన తన భర్త హత్యను చూసి ఆ భయాన్ని, బాధ నుంచి చేరుకొని మళ్లీ మామూలు మనిషి కావడానికి, కొత్త జీవితంలోకి అడుగుపెట్టడానికి ఉద్యమ సంఘాల సహకారం చేయూత అండనే కారణమని చెబుతున్నది. అయినా ఇప్పటికీ ఆనాటి మారణకాండల బీభత్సాలు, భయాల వణుకు అప్పుడప్పుడు వెన్నాడుతూనే ఉంటాయంటది సులోచన.

దుడ్డు అలీసమ్మ మరణం ఓ విషాదం. తన కన్నకొడుకు దుడ్డు వందనం. భూస్వాములు మాదిగల్ని వేటాడుతూ చంపుతున్నారని తెలిసి వెంటనే చీరాల పోలీస్టేషన్‌కి కంప్లయింట్ ఇద్దామని బయల్దేరిండు బయటకు. అంతే గొడ్డళ్లతో నరుకుతూ, బరిసెలతో పొడుస్తుంటే...ఆ అరుపులు కేకలు వీని బయట తనకొడుకుని చంపుతుంటే కళ్లార చూసిన దు:ఖం అలీసమ్మది. ఆక్రూర ఘటనను చూసిన అలీసమ్మ బహిరంగ సభల్లో, క్యాంపుల్లో చెపుతుంటే దళిత మహిళలు, పురుషులు శోకాలు బెట్టి ఏడ్చేవారంట. అయితే ఈ కేసులో ఐ విట్నెస్‌ను బహిరంగ పర్చకూడదని చట్టం చెబుతున్నది. కానీ అలీసమ్మకు బహిరంగ సభల్లో స్టేజీల మీద చెప్పించడం ఎలా జరిగింది? ఐ విట్నెస్‌ను చాలా రహస్యంగా వుంచుతారు, వారి సంరక్షణలో కాపు కాస్తారు. కానీ పోలీసులు, కోర్టులు పట్టించుకోవు, చెప్పరు కూడా ఈ రహస్యంగా, రక్షణ విషయాలు. కానీ ఉద్యమ సంఘాలకు, పౌరహక్కుల సంఘాలకు కూడా తెలవక పోవడమేంటి? వాల్లయినా అలర్ట్ చేయాల్సి ఉండాల్సింది. కానీ, అలా జరగలేదు. ఈ ఉదాసీనత ఏమరపాటు వల్ల అలీసమ్మను శత్రువు ఒక దొంగరాత్రి నిశ్శబ్దంగా చంపేసిపోయింది.

విజయనగర్ కాలనీ ఏర్పాటు చేస్తున్నప్పుడు బాధితుల కోసం ఇంకా పూర్తికాని తలుపులు కిటికీల్లేని ఇంటి ముందట ఆరుబయట నిద్రబోతున్న అలీసమ్మను మోకమ్మీద మెత్తేసి ఒత్తి చంపేసి పోయింద్రు. తెల్లవారి ఆమె శవమై మంచాల్లో పడివుంది. ఆమె మంచం పక్కన బూటు కాళ్ల అచ్చులున్నాయని గుర్తించారు. పోస్టుమార్టమ్ రిపోర్టులో ముఖమంతా కమిలి వుంది. ఊపిరాడకుండా ఉన్న పరిస్థితిలో చనిపోయిందని, అది సీబీ సిఐడికి ఇచ్చారు. ఇంకేముంది? అది ఇంకా పూర్తి కాలేదు రిపోర్ట్ అంటారు. బాధితులు తిరిగి తిరిగి వేసారి మానుకున్నారు. అలీ లేదు గలి లేదిప్పటికి. దళితుల పట్ల వ్యవస్థలు ఎంత దుర్మార్గంగా, నిర్లక్ష్యంగా ఉన్నాయనసేది అలీసమ్మ హత్య కేసే సాక్ష్యం. దోషులెవరు? అనేది ఇంకా తేలలేదు. ఏం జరిగినా బయటకు రాలే. ఒక మాదిగ మహిళను హత్య చేస్తే రుజువులున్నా, శిక్షలు, చట్టాలున్నా మనుస్మృతుల ముందు అవేమి పనిజేయలే. ఇది అంటరాని మహిళల దుస్థితి ఈ దేశంలో.

- జూపాక సుభద్ర

గ్రూప్2 పరీక్షలు వాయిదా వేస్తే నష్టమేంటి?



కోట రమేశ్
9618339490

గ్రూప్2, గ్రూప్3 పోస్టుల పెంపు, గ్రూప్2 పరీక్ష వాయిదా వేయడం గురించి అభ్యర్థులు ప్రభుత్వాన్ని అడుగుతున్నది న్యాయమైన, సామరస్యంగా పరిష్కరించ దగినదే. గ్రూప్ 2 పోస్టులు పెంచి, పరీక్షలను వాయిదా వేయడం మూలంగా ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక భారంగాని, ఇతర సాంకేతికాంశాలు కానీ పెద్దగా అడ్డురావు. వాళ్ల కోరుతున్నవి గొంతెమ్మ కోరికలేవీ కావు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచడంతో పాటు, గ్రూప్2 పరీక్షను డిసెంబర్ వరకు వాయిదా వేయడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే రాష్ట్రంలో గత కొంత కాలంగా గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలని, గ్రూప్ 2 పరీక్షను డిసెంబర్ వరకు వాయిదా వేయాలని అభ్యర్థులు, తీవ్రంగా ఆందోళనలు చేస్తున్నారు. గ్రూప్స్ పరీక్షలు, పోస్టుల సంఖ్య పెంపుపై నిరుద్యోగ అభ్యర్థులు లేవనెత్తుతున్న అంశాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. నిరుద్యోగ యువతను అవమానకరంగా మాట్లాడుతోంది. గ్రూప్2, గ్రూప్3 పరీక్షల విషయమై అభ్యర్థులు కోరుతున్న విధంగా సాధ్యాసాధ్యాలు పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాలేగానీ కాలయాపన చేస్తోంది.

గ్రూప్స్ పరీక్షల్ని వాయిదా వేయాలని అభ్యర్థులు ఎందుకంత బలంగా కోరుతున్నారో ప్రభుత్వం పరిశీలించాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో అనుసరించిన నిరుద్యోగ, విద్యార్థి వ్యతిరేక విధానాల మూలంగా ఆశించిన మేరకు ఉద్యోగాలు రాక నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలి. గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్లు రద్దు, పేపర్ లీకులు, టీఎస్పీఎస్సీ పరీక్షల నిర్వహణలో ఘోర తప్పిదాలు, పరీక్షలు వాయిదాలు వంటి కారణాలతో నిరుద్యోగులకు చాలా అన్యాయం జరిగింది. దానికి తోడు గ్రూప్2 పరీక్షలు మూడు సార్లు వాయిదా పడటం, నిరుద్యోగ యువతను మరింత నిరాశ పరిచింది. ఉద్యోగ నియామ కాల విషయంలో రెండు లక్షల ఉద్యో గాలు భర్తీ, రూ.4వేల నిరుద్యోగ భృతి, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ వంటి ఇతర అనేక వాగ్దానాలిచ్చి కాంగ్రెస్ గెలిచింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలవు తున్నా, ఉద్యోగ నియామకాల విషయంలో స్పష్టత లేకపోవడం, ఉద్యోగాల భర్తీలో నిరుద్యోగులకు నమ్మకం కలిగించక పోవడం, వరుస నోటిఫికేషన్లు, వివిధ రకాల పోటీ పరీక్షల నడుమ సమయం లేకపోవడం, ఇతర పోటీ పరీక్షల కోసం సన్నద్ధమయ్యే అవకాశాలు లేక అభ్యర్థులు మరింత మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. డీఎస్సీ రాత పరీక్షతోపాటు, గ్రూప్ 2 గ్రూప్ 3 పరీక్షలు వెనువెంటనే ఉన్నందున కొంత వెసులుబాటు కల్పిస్తూ, డిసెంబర్‌లో గ్రూపు 2 రాత పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అభ్యర్థులు కోరడం ఆలోచించదగిన అంశమే.

తెలంగాణ ఏర్పడ్డాక 2016 తర్వాత వేసిన నోటిఫికేషన్‌తో 783పోస్టులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికలు, ఇతర కారణాలరీత్యా సకాలంలో జరగాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయి. దాదాపు ఐదున్నర లక్షల మంది నిరుద్యోగులు ఈ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నిరుద్యోగుల ఆవేదన. 2022లో వేసిన నోటిఫికేషన్ ప్రకారం కాకుండా ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారం గ్రూప్2 పోస్టుల సంఖ్య పెంచి, సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షల గడువును డిసెంబర్ వరకు వాయిదా వేయాలని కోరుతున్నారు. జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు డీఎస్సీ రాత పరీక్షలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. డీఎస్సీ రాత పరీక్ష రాస్తున్న వారిలో అత్యధిక మంది గ్రూప్2, గ్రూప్ 3 పరీక్షలు కూడా రాస్తున్న వారున్నారు. అభ్యర్థులు కోరుతున్న విధంగా ఇతర పోటీ పరీక్షలు రాసుకునే అవకాశం ఉండే మాదిరిగా డిసెంబర్ వరకు గ్రూప్2 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు విన్నవిస్తున్నారు. గ్రూప్ 2 రాసే అభ్యర్థులు అత్యధిక శాతం మంది గ్రూప్3 కూడా రాస్తున్నందున, సిలబస్ రెండు పరీక్షలకు ఒకేలా ఉండడం, వాయిదా వేయాలని కోరుటకు మరో ప్రధాన కారణం.

నవంబర్‌లో నిర్వహించే గ్రూప్ 3 పరీక్ష దగ్గరగా గ్రూప్ 2 పరీక్షలు పెట్టడం మూలంగా అభ్యర్థులు సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుంది. గ్రూప్-2 రాసే అభ్యర్థులు గ్రూప్ 1 మెయిన్స్‌కు కూడా సెలెక్టయ్యారు. అలాంటప్పుడు ఈ రెండు పరీక్షలకు ఒకేసారి చదవడం కూడా చాలా ఇబ్బందే. గనుక వాయిదా వేయాలని నిరుద్యోగులు గట్టిగా పట్టుబడుతున్నారు. వేయకపోతే తమకు మరింత నష్టమన్నది నిరుద్యోగుల వాదన. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి నిరుద్యోగులతో పాటు గ్రూప్ 2 విషయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రూప్-2 పోస్టుల సంఖ్య పెంచి, మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామంటూ, యువతకు న్యాయం చేస్తామంటూ చెప్పిన అంశాన్ని నిరుద్యోగులు గుర్తుచేస్తున్నారు. దానికి కట్టుబడి ఉండాలని కోరుతున్నారు.

ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారు. గ్రూప్ 2 పోస్టులు పెంచి గ్రూప్-2 రాత పరీక్షలు డిసెంబర్ వరకు వాయిదా వేయాలని తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్నారు. అయితే చట్టబద్ధంగా పోరాడుతున్న అభ్యర్థుల పట్ల ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, అక్రమంగా అరెస్టు చేస్తూ, పోలీస్ స్టేషన్లో నిర్బంధిస్తూ, భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రూప్స్ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలి, గ్రూప్ 2 పరీక్షలు డిసెంబర్‌కు వాయిదా వేయాలనే అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం డీఎస్సీ రాత పరీక్షలు నిర్వహించడమే కాకుండా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల న్నింటిని భర్తీ చేయుటకు వెంటనే మరొక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడానికి సిద్ధపడాలి. దాంతో పాటు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న వాగ్దానానికి కట్టుబడి ఉండాలి. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించి చట్టబద్ధత తీసుకొచ్చేందుకు, నిరుద్యోగ భృతి అమలు చేసేందుకు నిర్ణయాలు తీసుకోవాలి. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు సమగ్రమైన కృషి జరగాలి. నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగాలి.



> జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు డీఎస్సీ రాత పరీక్షలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. డీఎస్సీ రాత పరీక్ష రాస్తున్న వారిలో అత్యధిక మంది గ్రూప్2, గ్రూప్ 3 పరీక్షలు కూడా రాస్తున్న వారున్నారు. అభ్యర్థులు కోరుతున్న విధంగా ఇతర పోటీ పరీక్షలు రాసుకునే అవకాశం ఉండే మాదిరిగా డిసెంబర్ వరకు గ్రూప్2 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు విన్నవిస్తున్నారు. గ్రూప్ 2 రాసే అభ్యర్థులు అత్యధిక శాతం మంది గ్రూప్3 కూడా రాస్తున్నందున, సిలబస్ రెండు పరీక్షలకు ఒకేలా ఉండడం, వాయిదా వేయాలని కోరుటకు మరో ప్రధాన కారణం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం

గురువారం | జులై 18, 2024 | www.navatelangana.com

బోనమెత్తిన 'న్యూ లిటిల్ ఫ్లవర్'



నవతెలంగాణ-వైరాటౌన్

స్థానిక న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఆడపడుచులు, విద్యార్థులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారు, పోతురాజు వేషధారణను ధరించి మహంకాళి అమ్మవారి బోనాన్ని ఎత్తుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణా సంస్కృతి, సాంప్రదాయానికి బోనం నిలువెత్తు నిదర్శనం అన్నారు. బోనం అంటే భోజనం అని, కొత్త మట్టి కుండలో గాని, రాగి బిందెలో గాని అమ్మవారికి భోజనం, బెల్లం, ఆకు కూరలతో కలిపి అమ్మవారికి బోనం సమర్పిస్తామన్నారు. తెలంగాణలో గ్రామ దేవతలను రకరకాల పేర్లతో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని పూజిస్తామని, శ్రావణ మాసంలో వచ్చే వరదల నుండి అంటు వ్యాధుల నుండి మనల్ని కాపాడమని వేడుకుంటూ ఘనంగా పూజలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డా. పి.భుమేష్‌రావు, కుర్రా సుమన్, పాఠశాల ప్రిన్సిపల్ షాజీ మాథ్యూ, ఎఐ నరసింహరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని, బోయినపల్లి

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామీణ వైద్యుల పట్ల సానుకూలంగా స్పందించడం అభినందనీయమని ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాస్‌రావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఖమ్మంలో ఆర్ఎంపిడబ్ల్యూఏ ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రులు జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్స్ ఇవ్వాలన్న ఆలోచన చేయడం సంతోషకరమన్నారు. ఏ విధంగా గ్రామీణ వైద్యులను గుర్తించి ఉత్తర్వులు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో తమ సంఘం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించామని, వీటికి తోడు ఇటీవలే మేధావులు జెఏసి చైర్మన్ కోదండరాం, విజ్ఞాన దర్శిని బాధ్యులు రమేష్, జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మారెడ్డిలు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో చర్చించిన ఫలితంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటి నుండి గ్రామీణ వైద్యులను గుర్తిస్తామని పేర్కొనడం శుభసూచికమన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రచార కార్యదర్శి గండరాపు రామారావు, జిల్లా కమిటీ సభ్యులు వడ్డెబోయిన శ్రీనివాస్‌రావు, షేక్ నాగుల్ మీరా, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు

మండల వ్యవసాయాధికారి బి.అరుణ కుమారి

నవతెలంగాణ-నేలకొండపల్లి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి డి.అరుణకుమారి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రుణమాఫీ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభిస్తారని తెలిపారు. నేలకొండపల్లిలోని రైతు వేదిక నుండి రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణమాఫీ కార్యక్రమాన్ని వీక్షించవచ్చున్నారు. రుణమాఫీ డబ్బులు విడుదలైన రోజునే రైతు వేదికల్లో రుణమాఫీ లబ్ధిదారులతో సంబరాలు జరపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సంబరాలలో రైతులు, బ్యాంకు ప్రతినిధులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. రైతులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో పాల్గొని రుణమాఫీ సంబరాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు.



పీరిలకు జవ్వాజి నాగరాజు చేయూత

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం తాటిపూడి గ్రామంలో జరుగుతున్న పిరిల పండగ సందర్భంగా అ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు జవ్వాజి నాగరాజు ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పిరీల సవిడి అభివృద్ధికి అన్ని విధాలా స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రామ్‌దాస్ నాయక్ ఆధ్వర్యంలో చేయుతనందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



డిపో డీఎంగా పీ.దినేష్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

స్వాగతం పలికిన ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధులు

నవతెలంగాణ-ఖమ్మం

ఆర్టీసీ ఖమ్మం డిపో నూతన మేనేజర్‌గా పీ.దినేష్ కుమార్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)గా బాధ్యతలు నిర్వర్తిస్తూ డిపో మేనేజర్‌గా పదోన్నతిపై ఖమ్మం వచ్చారు. ఖమ్మం డిపో మేనేజర్ ఛాంబర్ లో నూతన డిపో మేనేజర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపిన అందరికీ నూతన డిపో మేనేజర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు, ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ళ రోశయ్య, సీనియర్ నాయకులు మిర్యాల వెంకటేశ్వర్లు, గడ్డం అయోధ్య, అనంతారం ఏసోబు, వీకే.రావు, గడ్డం వెంకయ్య ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు, పరపతి సహకార సంఘం (సిసిఎస్) ప్రతినిధి గుండు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

నవతెలంగాణ-కామేపల్లి

గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. తాళ్లగూడెం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం నందు తొలి పండగ ఏకాదశి సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంగడాల అనంత రాములు, అంగడాల వెంకటేశ్వర్లు,పెరుగు అచ్చయ్య ,ముత్యం రామకృష్ణ, భక్తులు కంపసాటి సురేష్, శెట్టి సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: వివిధ గ్రామాల్లో ప్రజలు తొలి ఏకాదశి పండుగ వేడుకలను బుధవారం నిర్వహించారు.నూతన వస్త్రాలను ధరించి దేవాలయాలకు వెళ్లి పూజలు చేసి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

తప్పుడు ఆరోపణలు మానుకోండి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ఎర్రగడ్డ గ్రామపంచాయతీలో తీర్మానాలు లేకుండా వర్కులు కేటాయించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎర్రగడ్డ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గడ్డి కొప్పుల రాజు అన్నారు. పంచాయతీ కార్యదర్శిపై తప్పుడు ఆరోపణ చేయడంతో పాటు ఆమెను మానసికంగా మనోవేదనకు బీఆర్ఎస్ నాయకులు గురిచేస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. తీర్మానాలు లేకుండా గ్రామ సభలు లేకుండా వర్కులు కేటాయించారని, అదే విధంగా గ్రామపంచాయతీలో పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి ప్రభుత్వ పథకాలు మంజూరు చేయడంలో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణ చేస్తున్నారని, ఒక్క ఆరోపణ నిరూపించినా దేనికైనా సిద్ధమని అన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న గత బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా వ్యాప్త ఉద్యమం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ- మధిర



మధిర మండలం దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీ సమావేశం నిర్ణయాలను పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు ప్రకటించారు.

జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, యువకులను సమీకరించి పెద్ద సంఖ్యలో గంజాయి, గుట్కా మరియు ఇతర మాదక ద్రవ్యాల పట్ల అవగాహన సదస్సులు వాటి వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడితోందని, ప్రభుత్వం మాటలు తప్ప చేతలు శూన్యంగా ఉన్నాయని అన్నారు.

తెలంగాణ వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ప్రజలకు తెలియజేయడం కోసం సాయుధ పోరాట వారసత్వం గల గ్రామాల్లో సభలు సమావేశాలు నిర్వహించాలని, స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించి ఆందోళనలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్థానిక స్థానిక సంస్థల్లో పోటీకి సిద్ధం కావాలని, పార్టీ ఆధ్వర్యంలో మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు పెద్ద సంఖ్యలో చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

కార్మిక, రైతాంగ, వ్యవసాయ కూలీల, పేద ప్రజల సమస్యలను గుర్తించి జిల్లాలో ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, వై విక్రమ్, భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, ఎర్ర శ్రీకాంత్, చింతలచెరువు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సత్తుపల్లిలో భారీఎత్తున రైతు ప్రదర్శన

- కొత్తూరు వేదిక వద్ద సంబురాలు

నవతెలంగాణ-సత్తుపల్లి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీ ప్రక్రియలో భాగంగా ముందుగా రూ. 1లక్ష రుణమాఫీని అమలు చేస్తున్న నేపధ్యంలో ఆయనకు కృతజ్ఞత తెలిపేందుకు నేడు (గురువారం) సత్తుపల్లిలో భారీగా రైతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. సాయంత్రం 4గంటలకు పట్టణంలోని హనుమాన్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈ ప్రదర్శన ప్రారంభమై ప్రధాన రహదారి, వేంసూరు రోడ్డు మీదుగా కొత్తూరు రైతువేదిక వద్ద వరకు సాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం రైతువేదిక సంబురాల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని రైతు ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోరారు.



కొత్త నేర చట్టాలపై అవగాహన అవసరం

నవతెలంగాణ-ఖమ్మంలీగల్

అడ్వకేట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కొత్త నేర చట్టాలపై అవగాహన సదస్సు ఖమ్మం నగరంలోని శ్రీ శ్రీ హోటల్లో బుధవారం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ప్రధాన వక్తగా సీనియర్ న్యాయవాది, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు, అతిథులుగా హైకోర్టు న్యాయవాది ఈశ్వర ప్రగడ హరిబాబు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. అవగాహన సదస్సు నిర్వాహకులు సీనియర్ న్యాయవాది బిచ్చాల తిరుమలరావు, సోహాస్ సొసైటీ అధ్యక్షుడు తాళ్లూరు దిలీప్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సదస్సులో కొత్త నేరచట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్షా అధినీయం చట్టాలపై మామిడి హనుమంతరావు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకి సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తోట పెద్ద గోపయ్య ఆశయాలు కొనసాగించాలి

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ తోట పెద్ద గోపయ్య ఆశయాలు కొనసాగించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. వైరా మండలం ఖానాపురం గ్రామంలో తోట గోపయ్య 19వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో బొంతు రాంబాబు మాట్లాడుతూ ఆనాడు జమీందారులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, ఎట్టి చాకిరి విముక్తి కోసం అమరజీవి కుక్క వెంకటేశ్వర్లు, వేగంటి నారాయణ, వేగంటి జోగయ్య, గరిడేపల్లి వెంకటేశ్వరరావుతో దళంగా ఏర్పడి ఈ ప్రాంతంలో ఉన్న జమీందారుల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఆనాడు తోట గోపయ్య దళంలో పనిచేశారు. ఆ క్రమంలో రెండు కాళ్లకు తుపాకీ తూటా దూసుకుపోయినా ప్రాణాలు లెక్క చేయకుండా కొరియర్‌గా పని చేస్తూ ప్రజల పక్షాన ప్రజా పోరాటాలు నిర్వహించారని, తర్వాత కాలంలో గ్రామంలో గీత కార్మికులకు, పట్టా దారులకు వచ్చిన వివాదంలో ఆ సంఘం అధ్యక్షుడిగా అందరినీ కలుపుకొని పోరాటాలు చేయడం జరిగిందని, పార్టీ ఆదేశాల మేరకు స్వతంత్ర సమరయోధుల పెన్షన్ వద్దని అంటే నిజాయితీగా ఉన్నారని అన్నారు. నేటికి గోపయ్య చనిపోయే 19 సంవత్సరాలు అయినా వర్ధంతి సభ కొనసాగించడం అంటే వారు చేసిన పోరాటాలను మనం నిరంతరం కొనసాగించాలని, అప్పుడే గోపయ్యకు మనం ఇచ్చే నిజమైన నివాళని, గోపయ్యకు పార్టీ జిల్లా కమిటీ నుండి విప్లవ జోహార్లు అర్పిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్ కుమార్, పార్టీ నాయకులు గాలి నరసింహారావు, గోపయ్య కుమార్తెలు, కుమారులు పామర్తి పద్మ, పరస రాణి, తోట రాజ్యాలు, తోట హుస్సేన్, తోట రామారావు, తోట కృష్ణ, తోట కృష్ణవేణి, తోట మంగమ్మ, తోట రాధా, తోట గౌరమ్మ, పెదపోలు రామకృష్ణ, పెదపోలు అంజమ్మ, తోట సైదులు, మరీదు కృష్ణ తదితరులు పాల్గొని గోపయ్య చిత్రపటానికి, స్థూపానికి పూలు వేసి జోహార్లు అర్పించారు.

డిఎస్సీ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం కమిషనరేట్ పరిధిలో జులై 18 నుంచి ఆగష్టు 5 వరకు జరిగే డీఎస్‌సీ పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ చట్టం -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని 6 పరీక్ష కేంద్రాలలో గురువారం నుండి ప్రతి రోజు రెండు సెషన్‌లలో, ఉదయం 9 నుండి 12 మధ్యాహ్నం, 2 మధ్యాహ్నం నుండి సాయంత్రం 5 వరకు కమిషనరేట్ పరిధిలో నిర్వహించే పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు సెక్షన్ 163 ఆంక్షలు అమలలో ఉంటాయని, పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదే విధంగా పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు సంబంధిత నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



సీతారామ ఏకనామ సంకీర్తన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దత్తత దేవాలయం నందు సీతారామ ఏకనామ సంకీర్తన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గల శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో సంకీర్తన కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు.

ఏపీ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా బ్రాహ్మణపల్లి వాసి

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సూర్యదేవర ప్రసన్నకుమార్ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సెక్రెటరీ జనరల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఉత్తర్వులు జారీ చేశారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సూర్యదేవర జానకిరాములు, నీరదాదేవి దంపతుల చిన్న కుమారుడు సూర్యదేవర ప్రసన్నకుమార్. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జానకి రాములు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశాడు. లెక్చరర్‌గా విధులు నిర్వహించే సమయంలో జిల్లాలలో వివిధ ప్రాంతాలలో నివాసం ఉన్నారు. సూర్యదేవర ప్రసన్నకుమార్ తల్లాడలో అమ్మమ్మ ఇంటి వద్ద 1968లో జన్మించాడు. జానకిరాములు 2000 సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందాడు. 2001 నుంచి కుటుంబంతో ఖమ్మంలోనే నివాసముంటున్నారు. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు కొత్తగూడెంలో ప్రసన్నకుమార్ విద్యాభ్యాసం చేశాడు. ఇంటర్ కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. కర్నూల్ లో డిగ్రీ పూర్తి చేశాడు. ఢిల్లీ జవహర్ లాల్ విశ్వవిద్యాలయంలో పర్యావరణ శాస్త్రంలో ఎమ్మెస్సీ, ఎంఫిల్ డిగ్రీలు పొందాడు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందారు. మొదటగా ఆకాశవాణిలో న్యూస్ కాస్టర్‌గా ఉద్యోగంలో చేరారు. డిప్యూటేషన్‌పై ఆ తర్వాత సుప్రీంకోర్టులో ఓఎస్‌డిగా రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ తర్వాత అడిషనల్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందారు. అక్కడే రిజిస్ట్రార్‌గా ప్రమోషన్ పొంది సంవత్సరం పాటు విధులు నిర్వహించారు. దీంతో కేంద్రంలో ప్రభుత్వం మారటంతో సూర్యదేవర ప్రసన్న కుమార్‌కు మాతృ సంస్థకు వెళ్ళవలసి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో మాతృసంస్థకు వచ్చారు. అయితే ఢిల్లీలో తెలుగు న్యూస్ కాస్టర్‌గా పదవి లేకపోవడంతో హైదరాబాద్ గాని విజయవాడ గాని బదిలీ చేస్తామని ఆకాశవాణి ఉన్నతాధికారులు ప్రసన్నకుమార్‌కు తెలిపారు. అయితే ప్రసన్న కుమార్ భార్య సంగీత ఢిల్లీలోని తెలంగాణ భవనంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. భార్య ఢిల్లీలో ఉండటం ప్రసన్న కుమారుని హైదరాబాద్ లేదా విజయవాడ బదిలీ చేస్తామని చెప్పటంతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో కార్యనిర్వాహక శాసన, న్యాయ వ్యవస్థల పనితీరుపై అవగాహన ఉన్న ప్రసన్న కుమారును తెలంగాణ శాసనవ్యవస్థ సచివాలయ సలహాదారుగా కూడా ప్రస్తుతం కొనసాగుతున్నారు. ప్రసన్నకుమార్ అంతకుముందే అనేక ఉన్నత పదవులను నిర్వహించారు. శాసన వ్యవస్థ, సచివాలయం పనితీరు మరింత సమర్థంగావంతంగా ఉండేలా ఏపీ ప్రభుత్వ ప్రసన్న కుమార్‌ని శాసనమండలి సెక్రెటరీ జనరల్ గా నియమించింది. ప్రసన్నకుమార్ కేంద్ర ప్రభుత్వంలో సుమారు 30 ఏళ్ల పాటు విభిన్న, వివిధ హోదాల్లో సేవలు అందించారు. రాజ్యాంగం, చట్ట సంబంధ విషయాల్లో లోతైన అవగాహన కలిగిన ప్రసన్నకుమార్ 2004-2009 కాలంలో ఐదేళ్లపాటు లోకసభ స్పీకర్ సోమనాథ్ చటర్జీకి ఓఎస్డిగా పని చేశారు. లోకసభ స్పీకర్‌కు ఓఎస్‌డిగా ఉన్న సమయంలోనే లోకసభ టీవీ ఆవిర్భావ కార్యక్రమంలో కీలక పాత్ర నిర్వహించాడు. 2009-2015 మధ్యకాలంలో భారత ఉపరాష్ట్రపతి అమీద్ అన్సారి, రాజ్యసభ చైర్మన్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ గా, డైరెక్టర్ గా ఆరేళ్లకు పైగా సేవలు అందించారు. ఈ సమయంలోనే రాజ్యసభ టీవీ ఉనికిలోకి రావడానికి దోహదపడ్డారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా ఎన్వి రమణ ఉన్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో ఓఎస్డిగా పని చేశారు. సుప్రీంకోర్టులో మూడు సంవత్సరాల పాటు ఓఎస్‌డిగా, అడిషనల్ రిజిస్ట్రార్‌గా, రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. అందులో రిజిస్ట్రార్‌గా ఏడాది కాలం పాటు పనిచేశారు. ప్రారంభంలో ఢిల్లీలో ఆకాశవాణి వార్త విభాగంలో తెలుగు న్యూస్ కాస్టర్‌గా, విభాగాధిపతిగా, వార్తా విభాగంలో పరిపాలన బాధ్యతలను కూడా నిర్వర్తించారు. గతంలో ఢిల్లీ అసెంబ్లీ సెక్రటరీగా పనిచేసిన ప్రసన్నకుమార్ దాదాపు 11 ఏండ్లకు పైగా పార్లమెంటు ఉభయ సభల్లో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవంతో అసెంబ్లీ స్పీకర్, ప్రసన్నకుమార్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలు అప్పగించారు. ఢిల్లీ అసెంబ్లీ సెక్రటరీగా పనిచేసిన కాలంలో ఆయన ప్రదర్శించిన ప్రొఫెషనలిజం ఇప్పుడు శాసనమండలి జనరల్‌గా నియామకానికి దోహదపడింది. ఆకాశవాణిలో తెలుగు ట్రాన్స్‌లేటర్ (న్యూస్‌క్యాస్టర్)గా కేంద్ర సర్వీసుల్లో చేరిన ఆయన ఆ తర్వాత న్యూస్ సర్వీసెస్ డివిజన్‌లో అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. ఏకకాలంలో ఎగ్జిక్యూటివ్, లెజిస్లేచర్, జ్యుడిషియరీ (ప్రజాస్వామ్య మూల స్థంభాలు) రంగాల్లో ప్రావీణ్యం ఉన్న ప్రసన్న కుమార్ ఏపీ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించనున్నారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ప్రసన్ కుమార్‌కు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

ఇచ్చిన హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

నవ తెలంగాణ - బోనకల్

ఎన్నికల సమయంలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని కలకోట సొసైటీ అధ్యక్షుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కర్నాటి రామకోటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పంట పండించడానికి రైతు బ్యాంకు నుండి తీసుకున్న రుణమాఫీని రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నమాట ప్రకారం తొలుత లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా గురువారం రుణమాఫీ నిధులను రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. లిస్టులో తమ పేర్లు చూసుకొని రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత పది సంవత్సరములుగా రుణమాఫీ లేక తీసుకున్న రుణం కట్టలేక కలత చెందుతున్న రైతులకు ఇది శుభ పరిణామం అన్నారు. రైతుల రుణమాఫీ చేయడాన్ని కలకోట సొసైటీ రైతుల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

మొహర్రం పండగ త్యాగానికి ప్రతీక

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతికని ముస్లిం మత పెద్దలు తెలిపారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెంతో పాటు మామునూరు, భీమవరం, మీనవోలు, కాచవరం,పెగళ్లపాడు తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు మొహర్రం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లింలు పీరులను ఎర్రుపాలెం గ్రామంలోని పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. అగ్నిగుండంలో ప్రవేశించి నృత్య కేళితో ఆటలాడారు. భక్తి శ్రద్దలతో చిన్న పెద్ద తేడా లేకుండా కులాలకు అతీతంగా పండగను జరుపుకున్నారు. కార్యక్రమంలో సంసుద్దీన్, షేక్ ఇస్మాయిల్, గోరే, బాజీ బాబా, మైసూర్, మౌలాలి, తదితరులు పాల్గొన్నా రు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ఎర్రుపాలెం

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీస్ కానిస్టేబుల్ గోపాల్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఎర్రుపాలెం-తొండ్ల గోపవరం గ్రామాల మధ్య గల పెగళ్లపాడు రైల్వే బ్రిడ్జి కింద ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతి చెందిన యువకుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు, ఆధారాలు లేవు. ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. మృతుడు మెడలో పూసల దారంకి సిలువ (క్రాస్) ధరించి ఉన్నాడని తెలిపారు. యువకుడు శవాన్ని గుర్తించుట కొరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నందు భద్రపరిచినట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం జులై 18, 2024 www.navatelangana.com

ఆర్టీఐ యాక్ట్‌పై ఐటీడీఏ నిర్లక్ష్యం

- అడిగిన సమాచారం ఇవ్వకుండా ఏడాది కాలంగా అలక్ష్యం
- ఉన్నతాధికారుల ఆదేశాలనూ పట్టించుకోని భద్రాచలం ఐటీడీఏ డీడీ

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) భద్రాచలం ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన కె.ప్రవీణ్ అడిగిన సమాచారాన్ని ఏడాది కాలంగా ఇవ్వకుండా భద్రాచలం గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు అలక్ష్యం ప్రదర్శిస్తున్నారు. 31మే, 2023న ప్రవీణ్ గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు సంబంధించి బ్రిజలీలో సమర్పించిన స్టాక్, ఇష్యూస్ రిజిస్టర్, డైట్ చార్జీల బిల్లుల సమాచారం కోసం అప్పీల్ చేసుకున్నారు. వీటికి సంబంధించి 2020 మార్చినెల పూర్తి సమాచారం, 2014-19 వరకు మెనూలో భాగంగా మటన్ నెలకు ఎన్ని సార్లు వడ్డించారు?, ఆ మటన్ స్వచ్ఛతను నిర్ధారిస్తూ లైవ్ స్టాక్ ఆఫీసర్ జారీ చేసిన ధ్రువీకరణపత్రం, 2013 మార్చి నుంచి 2023 మార్చి వరకు అన్ని వసతిగృహాల డైట్ బిల్ కాపీలు ఇవ్వాలని కోరారు. 2014-22 వరకు హరితహారంలో నాటిన మొక్కల వివరాలు కూడా అడిగారు. వాటిలో ఎన్ని బతికున్నాయి...ఎన్ని చనిపోయాయో కూడా తెలపాలని కోరారు. జియోట్యాగింగ్ వివరాలనూ అడిగారు. కానీ భద్రాచలం ఐటీడీఏ డీడీ దీనిని ఏడాది కాలంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. పలుమార్లు అప్పీల్ చేసినా రిప్లై ఇవ్వడం లేదు. ఈ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ సంబంధిత డీడీకి మెమో కూడా ఇచ్చారు. శాఖ కమిషనర్, సంచాలకులు సైతం ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ దరఖాస్తుదారు ప్రవీణ్ అడిగిన సమాచారం ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో ఐటీడీఏ పీఓ చొరవ తీసుకొని, అడిగిన సమాచారం ఇవ్వాలిందిగా ప్రవీణ్ కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేసులో బీరెల్లి కార్తీక్

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన బీరెల్లి కార్తీక్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడి రేసులో ఉన్నారు. బీరెల్లి కార్తీక్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మల్లు నందినిలకు ముఖ్య అనుచరుడిగా ఉంటున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో పనిచేస్తున్నారు. చిరునోములలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు. మండల స్థాయిలో జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ కార్యక్రమాల విజయవంతంలో తన వంతు పాత్ర నిర్వహిస్తూ వస్తున్నారు. ఆదేవిధంగా కాంగ్రెస్ నాయకత్వం పిలుపునిచ్చిన కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో యువకుడిగా చురుకుగా పాల్గొంటున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులతో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష రేసులో ముందు వరుసలో తాను ఉన్నట్టు బీరెల్లి కార్తీక్ అంటున్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఖాళీ పోస్టులకు ఉద్యోగోన్నతులు నిర్వహించాలి
- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి

నవతెలంగాణ-సత్తుపల్లి



ఇటీవల బదిలీ అయిన ఎస్టీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంఘం జిల్లా నాయకులు జీఎస్‌ఆర్ రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. డివిజన్ కమిటీ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. బదిలీల ప్రక్రియను నిర్వహించి ఉపాధ్యాయులను రిలీవ్ చేయకపోవడం వల్ల బదిలీ చేసి ఏం ఉపయోగమని ఆయన ప్రశ్నించారు. రిలీవ్ కాని కారణంగా మానసికంగా ఇబ్బంది పడటమే కాకుండా స్టేషన్ సర్వీస్ పాయింట్లు కోల్పోతామని ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉద్యోగోన్నతులు నిర్వహించాలన్నారు. దీనివల్ల హైస్కూల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించవచ్చన్నారు. కొత్తగా నియామకం పొందిన ఉపాధ్యాయులు వచ్చేంత వరకు ఆయా ఖాళీలలో తాత్కాలికంగా విద్యా వలంటీర్లను నియమించి బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని నాగేశ్వరరావు కోరారు. బదిలీల ప్రక్రియ చేపట్టిన సమయంలో అధికారుల తప్పిదాల కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పీలన్నింటిని సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి వీవీ.రామారావు, రావెళ్ల రమేశ్, మట్టపర్తి రాజేశ్వరరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాల నాగేశ్వరరావు, కొప్పుల శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరెడ్డి, గుత్తా చంద్రశేఖర్, ఈశ్వరాచారి, ఎస్‌హెచ్.ప్రసాద్, వీరస్వామి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సైను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



నవతెలంగాణ-కామేపల్లి

నూతన ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న సాయి కుమార్‌ను బుధవారం స్టేషన్‌లో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, గ్రామ అధ్యక్షులు, యువజన నాయకులు, మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, కొమ్మినేపల్లి సొసైటీ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు, మండల నాయకులు హనుమంతరావు, గోపిరెడ్డి, నరసింహానాయక్, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ధరావత్ బాలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకు సన్మానం

నవతెలంగాణ-కల్లూరు

మొహరం వేడుకల్లో ఎస్సై బీ.కొండలరావు మంగళవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైను ముస్లిం సోదరులు ఘనంగా సన్మానించారు. శాంతియుతంగా పండుగలను నిర్వహించుకోవాలని ఎస్ఐ సూచించారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముజావర్ షేక్ యూసఫ్, కమిటీ సభ్యులు షేక్ మహరాజ్, బడే మియా, నన్నేసా, బహారాలి, బాబు, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఎమ్మెల్యే సత్కారం

నవతెలంగాణ-వైరాటౌన్



తెలంగాణ రాష్ట్ర హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నాయుడు సత్యనారాయణ బుధవారం హైదరాబాద్‌లో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ హాజరై సత్యనారాయణకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా సహకార సంఘం అధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, వైరా వ్యవసాయ సంఘం చైర్మన్ సూతకాని జైపాల్, వైరా, కొణిజర్ల, ఏన్కూర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేందర్, వైరా పట్టణ అధ్యక్షుడు ఎదునూరి సీతారాములు, రాష్ట్ర కిసాన్ ఖేత్ మజ్దూర్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, కొప్పురావూరి కుటుంబరావు, పమ్మి అశోక్, రాంపూడి రోషయ్య, బొళ్ల గంగారావు, పల్లపు కొండలు తదితరులు పాల్గొన్నారు.

రుణ మాఫీ ప్రారంభాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని కొర్లగూడెం రైతు వేదిక వద్ద గురువారం రుణమాఫీ ప్రారంభ వేడుకలలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ అధికారి ఎం.రూప బుధవారం ప్రకటనలో కోరారు. సాయంత్రం 3. 30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వయంగా మాట్లాడి రుణమాఫీ సంబరాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. లక్ష రూపాయలు రుణమున్న రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనిల్ హోటల్ ప్రారంభం

నవతెలంగాణ-కల్లూరు



పట్టణంలో నూతనంగా శాంతినగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఏర్పాటు చేసిన అనిల్ హోటల్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు యాసా శ్రీకాంత్ జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగం ప్రభాకర్ చౌదరి, పి. నరేష్, మట్ల రామకృష్ణ, పొన్నూరు వెంకటేశ్వర్లు, యాస శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దోర్నాల కృష్ణకి పరామర్శ

నవతెలంగాణ-మధిర

పట్టణంలో ఒకటో డివిజన్ జిలుగుమాడు కాంగ్రెస్ నాయకులు దోర్నాల కృష్ణ, తీరువేదుల వెంకటేశ్వరరావు అనా రోగ్యం సమస్యలతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పట్టణ నాయకులు బుధవారం ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారా బాలరాజు, కాంగ్రెస్ నాయకులు నిడమనూరు వంశీకృష్ణ, యన్నం కోటేశ్వరరావు, ఆదిమూలం శ్రీనివాసరావు, జింకల కోటేశ్వరరావు, మైలవరపు చక్రి, కాంగ్రెస్ డివిజన్ నాయకులు ఉన్నారు.



ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా కొండా పద్మ

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని సంజీవరెడ్డి భవన్‌లో బుధవారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీని నమ్ముకొని ఉన్న ప్రతి కార్యకర్తలకు జిల్లా కమిటీ అండగా ఉంటుందని, యూనియన్‌లో సమూచిత స్థానం కల్పిస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వమ్మి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు ఎవరు గొడవలకు పోవద్దని, సీతారాములు ఏర్పాటు చేసిన కమిటీనే అమలు అవుతుందన్నారు. అనంతరం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా కొండా పద్మను నియమాక పత్రం అందజేశారు. అలాగే ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ (సోషల్ మీడియా) గా అంజయ్యకు నియమాక పత్రం అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎండీ పాషా, నగర అధ్యక్షులు నరాల నరేష్, మోహన్ నాయుడు, గజ్జి సూర్య నారాయణ, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు పద్మ భవాని వివిధ మండల అధ్యక్షులు, కార్యదర్శులు, పోతగాని రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో కాంగ్రెస్ నాయకులు దయాకర్‌రెడ్డి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం మండలంలోని గొల్లగూడెం, పోచేర్ల తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం, నాణ్యమైన విద్యను అతితక్కువ ఖర్చుతో అందించేందుకు, కుల, మత భేదాలు లేకుండా గురుకులాలు అన్ని ఒకే చోట ఉండాలనే ఉద్దేశ్యంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తలంపులో భాగంగా ఆయన సూచన మేరకు ప్రభుత్వ భూములను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఏసీపీ కార్యాలయం, రెవిన్యూ కార్యాలయం, రిజిస్ట్రేషన్ తదితర కార్యాలయాలన్ని ఒకే చోట ఉంటే పరిపాలన సౌలభ్యంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి శ్రీనివాసరెడ్డి భావిస్తున్నట్టు తెలిపారు. అతితక్కువ ఖర్చుతో కార్పోరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు వచ్చిన స్వామి నారాయణ స్కూల్ యాజమాన్యానికి స్థలాన్ని ఇచ్చేందుకు శ్రీసిటీ సమీపంలోని ప్రభుత్వం స్థలాన్ని పరిశీలించారు. ఇందుకోసం తిరుమలాయపాలెం మండలంలో కూడా మరో స్థలాన్ని పరిశీలించనున్నారు. అదే విధంగా పోచేర్లలో ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుకు కావాల్సిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు అన్ని ఒకే చోట ఉండి కులమత బేధాలు అనేవి లేకుండా ఉంటాయనేది ప్రభుత్వ సదాభిప్రాయం. వీలైనంత త్వరగా మంత్రి పొంగులేటి చొరవతో వీటిని ఫైనల్ చేసి పాలేరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, శాఖమూరి రమేష్, జొన్నల గడ్డ రవి, కొప్పుల చంద్రశేఖర్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

37 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

- ఎస్సై జి.నరేష్

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని చిరుమర్రి గ్రామానికి చెందిన నల్లగొండ యల్లేశ్వరరావు, మోర రామారావు ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉన్న 37 క్వింటాల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నారు. ఎస్సై గజ్జల నరేష్ ఈ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసి సివిల్ సప్లై అధికారులకు అప్పజెప్పినట్టు తెలిపారు.



పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించిన ఎస్ఐ

నవతెలంగాణ-బోనకల్

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను కనుక్కొని తిరిగి బాధితులకు బోనకల్ ఎస్సై కడగండ్ల మధుబాబు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన నల్లల దొరబాబు అనే వ్యక్తి గత పది రోజుల క్రితం వివో వై 200 అనే మోడల్ గల సెల్ ఫోన్‌ను ద్విచక్ర వాహనంపై వెళ్తూ పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ పోర్టల్ సిఇ ఈయర్ మొబైల్ ట్రాకింగ్ యాప్ ద్వారా బాధితుడి సెల్ ఫోన్ ట్రేస్ చేసి ఫోను కనుగొన్నారు. దొరికిన ఫోనును ఎస్ఐ బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుబాబు మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిఇఈయర్ యాప్ ద్వారా పోగొట్టుకున్న లేక దొంగలించిన సెల్ ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు అప్పగించడం జరుగుతుందన్నారు. సెల్ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఆన్‌లైన్ ద్వారా చలానా రూపంలో చెల్లించి ఆ రసీదుతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా వారి సెల్ ఫోన్లను ట్రేస్ చేయడం జరుగుతుందని తెలిపారు. తాను పోగొట్టుకున్న సెల్ ఫోన్ తిరిగి తనకు దక్కటంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఐసంపల్లి సువర్ణ బాబు, హెడ్ కానిస్టేబుల్ అద్దంకి ఆనంద్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వంద పడకల హాస్పిటల్ పనులు వెంటనే ప్రారంభించాలి

- సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



వంద పడకల హాస్పిటల్ పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మండల కేంద్రంలో 2023 ఆగస్టు 8న వంద పడకల హాస్పిటల్ కావాలని సీపీఐ(ఎం) అఖిలపక్షాల ఆధ్వర్యంలో సాగిన పోరాటంలో భాగంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 100 పడకల హాస్పిటల్‌గా మంజూరు చేయడం జరిగింది. కానీ ఇంతవరకు ఆ హాస్పటల్లో సరిపడా వసతులు గాని ప్రభుత్వ డాక్టర్లుగాని నర్సులుగాని మంజూరు కాలేదు. అవి మంజూరు కావాలని అనేక పోరాటాలు నిర్వహిస్తోంది. కానీ ఇప్పుడు తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరైన వంద పడకల హాస్పిటల్ ను కూసుమంచి మండల కేంద్రానికి తరలించాలని ఆలోచన ప్రభుత్వం చేస్తుంది. ఇది తిరుమలాయపాలెం మండల ప్రజలకు తీరని అన్యాయమని ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ ఆర్టీ నెంబర్ 440 ప్రకారం 26 కోట్ల రూపాయలు ఆ యొక్క ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే పనులు ప్రారంభం కాకపోగా మంజూరైనటువంటి హాస్పిటల్లు కూసుమంచి తరలించాలని ఆలోచన చేయటం దుర్మార్గమని ఇక్కడ కాళ్లు పోస్టులు భర్తీ చేయాలని పోరాటం చేస్తుంటే ఇప్పుడు జరిగే ఈ ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా మన నియోజకవర్గ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకొని 100 పడకల హాస్పిటల్‌గా మార్చి సౌకర్యాలు ఏర్పడే విధంగా చర్య తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల నాయకులు కొలిచేలో స్వామి, మద్దినేని శ్రీనివాసరావు ఇస్సాల నవీన్ కుమార్, కల్లుకుంట్ల ప్రసాద్, నెర్సుల ఉప్పలయ్య, పాండవుల నాగేశ్వరరావు, సోమపొంగు రాము, భాష, పైన శ్రీను, నెరుసు వెంకటేషు, పి.ముత్తయ్య కే.వెంకన్న, బచ్చలకు రాములు పాల్గొన్నారు.

ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్య విచారకరం

- రిటైర్డ్ హైకోర్టు సింగిల్ జడ్జ్‌తో విచారణ చేయించాలి
- ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి

నవతెలంగాణ-ఖమ్మం



ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్య సంఘటన విచారకరమని, ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ విషయంలో నిష్పక్షపాత విచారణకు రిటైర్డ్ హైకోర్టు సింగిల్ జడ్జికు బాధ్యతలు అప్పగించాలని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితులపై సెక్షన్ 306 కింద కేసు నమోదు చేయాలని, అదేవిధంగా నిందితులైన పోలీస్ అధికారులను అరెస్ట్ చేయడం కాకుండా వారందరిని జైలుకు తరలించాలన్నారు. తమ తోటి పోలీసు అధికారిపై సీఐ జితేందర్‌రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్లు కుల పేరుతో దూషించడమే కాకుండా అనేక రకాలుగా వేధించి, ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన వీరిని అటాచ్మెంట్ చేయడం కాదు జైలుకు తరలించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మరోసారి ఇటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అటాచ్మెంట్ పేరుతో చేతులు దులుపుకునే చర్యలు మంచిది కావు అన్నారు. తొలుత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయానికి విచ్చేసిన ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలికి సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ భూముల పోరాట స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ. కృష్ణారావు, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్, నాయకులు దేవళ్ల నాగేశ్వరరావు, పగిడిపల్లి నాగేశ్వరరావు, భుక్యా శ్రీనివాస్‌నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గాయపడిన బాలుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్‌తో గాయపడిన బాలుడికి కాలనీ వాసులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని సాయిగణేష్ నగర్ కాలనీకి చెందిన భరత్‌రెడ్డి అనే బాలుడు గత కొద్ది రోజుల క్రితం డాబాపై ఉన్న కరెంటు కంబాలను కొట్టేందుకు పైకి వెళ్లి ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాల పాలయ్యాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని కాలనీ వాసులు పరామర్శించి బాలుడి వైద్య ఖర్చులకు కొంత నగదు జమచేశారు. బాలుడి తల్లిదండ్రులు మధురెడ్డి, శోభలకు రూ.2 లక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోటు శ్రీనివాస్‌రావు, బైరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రసాద్, జీవన్‌రెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మూడవ వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలోని బల్లేపల్లి మదర్ థెరిసా అనాథాశ్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రహీం, జిల్లా అధ్యక్షుడు షేక్ రహీం భాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ సకీనా, జిల్లా సీనియర్ నాయకులు సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి, నగర అధ్యక్షులు షేక్ రఫల్, నగర ప్రధాన కార్యదర్శి సైదా హుస్సేన్, 56 డివిజన్ అధ్యక్షులు షేక్ మొగుల సాహెబ్, నగర యూత్ నాయకులు పండు, రాజమండ్రి నాయకులు షేక్ షరీఫ్, షేక్ రజబల్లి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



- అరుణాచలంకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు
- ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరామ్

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

క్రీడలు ఉద్యోగులకు మానసిక ఆనందం కలిగించడంతోపాటు పనిలో ఒత్తిడిని దూరం చేస్తాయని ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరామ్ అన్నారు. బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోని ఆయన సందర్శించిన అనంతరం లక్షే లక్ష్యంలో భాగంగా డిపోలో నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం రీజియన్‌లో తిప్పుతున్న బస్సుల సంఖ్య కంటే అధికంగానే తిప్పుతున్నామని, 100 మంది డ్రైవర్లు కొరతా ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులు తిప్పుతున్నట్టు తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలోని బస్సాండ్లలో మరమ్మత్తులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రయాణికులు కూడా ఉద్యోగులకు సహకరిస్తూ ఆర్టీసీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికుల కొరకు ఖమ్మం, భద్రాచలం నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సుల ఏర్పాటు చేసినట్టు చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భక్తులను కోరారు. అనంతరం ఖమ్మం రీజియన్‌లో సీతారాముల కళ్యాణ ముత్యాల తలంబ్రాలు ఎక్కువగా బుకింగ్ చేసిన సత్తుపల్లి టీబీఓ కిన్నెర ఆనందరావు, ఎస్.సునీలలను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయ శ్రీ, అసిస్టెంట్ ఇంజనీర్ సాహితి, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మునీర్ పాషా, ఏడీసీలు, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.సురేష్



నవతెలంగాణ-టేకులపల్లి

ఖమ్మం కమిషనర్ రేట్ పరిధిలో పని చేస్తూ బదిలీపై టేకులపల్లి వచ్చిన పోగుల సురేష్ ఎస్ఐగా బుధవారం పదవి బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ ఎస్.కె.సైదా రవూఫ్ కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వీఆర్‌కు బదిలీ పై వెళ్లారు. వచ్చిన ఆరు నెలలకే ఎస్సై బదిలీ కావడం విశేషం. టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పోగుల సురేష్ విలేకరులతో మాట్లాడారు. మారినటువంటి చట్టాలకు వ్యతిరేకంగా ఎవరైనా కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా చట్ట పరిధిలోకి ఉపేక్షించేది లేదని, ముఖ్యంగా యూత్ గంజాయి తదితర వాటికి బానిసలు అయితే, గంజాయికి బానిసై అనేక సమస్యలను, సమస్యల బారిన పడుతున్నారని, ఎటువంటి సమాచారానైనా పోలీసులకి డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరిస్తే సమాజాన్ని గంజాయి, డ్రగ్స్ బాధ్యతగా స్వీకరించి పూర్తిగా నిర్వీర్యం చేయడానికి అందరూ తమ తమ బాధ్యతలను స్వీకరించి పోలీసు వారికి సహకరించాలని కోరారు.

మండలానికో వీడియో కాన్ఫరెన్స్ సెట్

- వారం వారం సాగు పై అవగాహన
- రైతు నేస్తంతో అన్నదాలకు చేరువ కానున్న వ్యవసాయ శాఖ



నవతెలంగాణ-అశ్వారావుపేట

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు నేస్తంతో అన్నదాతలకు మరింత చేరువ కానుంది. రైతు బరోసాతో సాగుచేసే రైతులకే పంట పెట్టుబడి, గురువారం నుండే ఋణమాఫీ అమలు చేయనుంది. ఈ క్రమంలో మండలానికో వీసీ సెట్‌ను అందించి వాటిని సైతం గురువారం నుండే రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలం, పేరాయి గూడెం పంచాయతీ పరిధిలో గల రైతువేదికలో వీసీ సెట్‌ను ఏర్పాటు చేసారు. ఈ సెట్‌ను సైతం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లాంచనంగా ప్రారంభించనున్నారు. ఈ వీసీ సెట్ ద్వారా రైతు నేస్తం పేరుతో రైతులకు వ్యవసాయం, సాగు పద్దతులు, పంటలకు ఆశించే చీడపీడలు, అధిక దిగుబడులుకు మెలుకువలుపై అవగాహన కల్పిస్తారు. గురువారం నిర్వహించే కార్యక్రమానికి అధిక రైతులు హాజరు కావాలని వ్యవసాయ అధికారులు అఫ్జల్ బేగం, నవీన్‌లు కోరారు.

శ్రీరాములు శ్రీనుకి నివాళ్లు



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

అశ్వారావుపేట సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన శ్రీరాములు శ్రీనుకి మండల కేంద్రంలో దళిత సంఘం నాయకులు చల్లా రమేష్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటం అంబేద్కర్ విగ్రహం దగ్గర పెట్టి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కొంత మంది అధికారులు వేదింపులు వలన ఒక దళిత రత్నం అయిన శ్రీరాములు శ్రీను అకాల మరణం చెందడం చాలా బాధాకరం అని అన్నారు. భవిష్యత్‌లో ఎన్నో ఉన్నత శికరాలను చేరుకొని ఉన్నతమైన పదవులు అలంకరించవలసిన దళిత అధికారికి ఇలా జరగడం దురదృష్టకరమని ఆయన మృతి కుటుంబ సభ్యులకు, పోలీస్ శాఖకు ఎంతో తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాము అని ఇలాంటి సంఘటన రాష్ట్రంలో మరెక్కడ జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇనపనూరి రాంబాబు, చిన్ని, వెంకన్న, పుల్లయ్య, చల్లా రాంబాబు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుని దశ దిన కర్మలకు క్వింటా బియ్యం వితరణ



నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని 3వ వార్డు వాస్తవ్యులు టీడీపీ నాయకుడు పసుపులేటి సత్యనారాయణ చాలా రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఈ మధ్య కాలంలో చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ బుధవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ పసుపులేటి కుటుంబం పార్టీకి చాలా సేవలు చేసిందని సత్యనారాయణ చనిపోవడం చాలా బాధాకరమన్నారు. పసుపులేటి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. నేడు జరగబోయే దశ దిన కర్మలకు 100 కిలోల బియ్యము మానవతా దృక్పథంతో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పసుపులేటి సత్యనారాయణ భార్య సామ్రాజ్యం, కుమారులు, రామకృష్ణ, ప్రసాద్, సతీష్, స్థానిక మహిళా నాయకులు బొందలి విజయ, కాగితం సుజాత, ఆకుల వెంకట్ రత్నం, బలసు రోజా, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాందావత్ రమేష్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు శ్యామ్ తీవరి, జెకె జానీ, వాసం వినీత్ తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా చిన్న గుబ్బల మంగి ప్రాజెక్ట్



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మంగళవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మండలంలో ఉన్న ప్రధాన వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. మండలంతో పాటు సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్గడ్‌లో రాత్రి కురిసిన వర్షానికి సీత వాగు, గుబ్బల మంగమ్మ వాగు, తూరుబాక వాగులతో పలు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. పలు చోట్ల రహదారులపై నీరు చేరుకోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. సీతానార చీరల ప్రదేశం పూర్తిగా నీట మునిగింది. సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందించే చిన్న గుబ్బల మంగి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరి అలుగుపడి ప్రవహించింది. చెరువుల్లోకి సైతం వర్షపు నీరు చేరడంతో మండల రైతులు రెట్టింపు ఉత్సాహంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం రైతులకు మేలు చేసిందనే చెప్పవచ్చు.

ఐద్వా మహిళా సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బూర్గంపాడు

ఐద్వా మహిళా సంఘం బూర్గంపాడు మండల మహాసభలో 12 మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ అధ్యక్షురాలుగా కౌవులూరి నాగమణి, కార్యదర్శిగా పాపినేని సరోజనలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో రాష్ట్రంలో మహిళలు అనేక రకాలుగా వేధింపులకు, వేధించబడుతున్నారని వారు ఆరోపించారు. మహిళలకు రక్షణ లేకుండా పోతుందని వారు అన్నారు. ప్రజల పక్షాన మహిళల పక్షాన నిరంతరం వారి సమస్యల పైన పోరాడుతామని వారు పేర్కొన్నారు. మహిళల హక్కులను కాపాడే విధంగా ఉంటామని వారు అన్నారు. దుష్ట శక్తుల్ని తరిమికొట్టే కొట్టాలంటే మహిళాలు అందరూ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. అనేక సమస్యలపై పోరాటం చేస్తూ మహిళలకు అండగా ఉంటామని వారు అన్నారు.

మణుగూరులో భారీ వర్షం

- బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు డివిజన్ వ్యాప్తంగా రాత్రి పది గంటల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఉపరితల బొగ్గు గనుల్లో 106 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్టు అధికారులు తెలిపారు. మణుగూరు సింగరేణి ఉపరితల గనులలో చేరిన వర్షపు నీరు వలన బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిందని అధికారులు తెలిపారు. బొగ్గు ఉత్పత్తికి (ఓబి) మట్టి పనులు కూడా నిలిచిపోయాయి, ఆరు వేలటన్నుల బొగ్గు ఉత్పత్తికి, లక్ష 38వేల క్యూబిక్ మీటర్ల (ఓబి) మట్టి పనులకు ఆటంకం ఏర్పడింది. ఓబిల నుండి వచ్చే వరద నీరును అరికట్ట లేకపోవడం వలన సుందరయ్య నగర్ వరదమయం అయింది. నీరు ఇళ్లల్లోకి చేరుకుంది. రేగుల గండి చెరువుకు భారీ వరద నీరు చేరడంతో అలుగు పోసింది. దీని కారణంగా భారీ వరద నీరు కోడిపుంజుల వాగులో చేరడంతో వాగు ఉధృతంగా ప్రవహించింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. మండలంలోని 14 గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలో 22 వార్డులలో సైడ్ కాలువలు ఉప్పొంగడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. దీని కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నిబంధనలు సవరించాలి

'రుణమాఫీ'ని రైతులందరికీ వర్తింపజేయాలి

- జీవోను యథాతథంగా అమలు చేస్తే లక్షలాది మంది అనర్హులవుతారు
- సాగదీత తగదు..రీషెడ్యూల్ చేసినా వర్తింపజేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

రుణమాఫీపై సాగదీతకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ఉందని, మార్గదర్శకాలలో రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ అనడం సరికాదని, సాగుదారులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. రీషెడ్యూల్ చేసిన ప్రభుత్వమే పునరుద్ధరించిన వారికి వర్తించదనడం ఏమాత్రం సమంజసంగా లేదన్నారు. బుధవారం కొత్తగూడెం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీ షెడ్యూల్ చేసిన రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రూ.2 లక్షలకు పైబడిన రుణాలను రైతే చెల్లించాలనడం సరికాదని, పెట్టుబడుల సమయంలో రైతు చెల్లించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. నిబంధనలను సడలించి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. గ్రామసభల ద్వారా కౌలురైతులను గుర్తించి వారికీ రైతుభరోసా పంటపెట్టుబడి సహాయం ఇవ్వాలని కోరారు. పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు రైతు బంధు, రుణమాఫీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యా, వైద్యరంగాలకు 10శాతమైనా నిధులు కేటాయించాలి

వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా, వైద్యరంగాలకు కనీసం 10 శాతం నిధులైనా కేటాయించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా డెంగ్యూ, వైరల్ జ్వరాల నియంత్రణకు తగిన వైద్య సిబ్బందిని, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు.

ఏఐటీయూసీ విధానాన్ని తిప్పికొట్టండి : సీఐటీయూ



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో కార్మిక సంఘం గుర్తింపు కాలపరిమితిపై ఎన్నికల ముందే డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాల అభిప్రాయం కోరగా 15 సంఘాలలో ఐదు సంఘాల మాత్రమే నాలుగు సంవత్సరాలు కావాలని, మిగతా 11 సంఘాలు రెండు సంవత్సరాలు కావాలని కోరాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఆ నిర్ణయాన్ని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, చీఫ్ లేబర్ కమిషనర్ ఢిల్లీకి పంపించగా సెంట్రల్ కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారము రెండు సంవత్సరాల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించాలని డిప్యూటీ సీఎల్‌సికి లెటర్ రాశారన్నారు. ఆ తదుపరి జరిగిన సమావేశంలో డిప్యూటీ సిఎల్సి రెండు సంవత్సరాలకే ఎన్నికలు నిర్వహిస్తున్నామని స్పష్టంగా తెలియజేశారు. దానిని అందరూ అంగీకరించే ఎన్నికలకు వెళ్లారు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చాలని ఎవరు ప్రయత్నం చేసినా కార్మికులను ప్రక్కదారి పట్టించడమే అన్నారు. ఎన్నికల తదనంతరం ఎఐటియుసి సింగరేణి మేనేజ్‌మెంట్‌కి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి లెటర్‌లో నాలుగు సంవత్సరాల కాలపరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వమని ఉత్తరాలు వ్రాసి లాబీయింగ్ నడుపుతున్న నేపథ్యంలో, సిఐటియు ఎన్నికల ముందు నిర్ణయించిన ప్రకారము రెండు సంవత్సరాలకే గుర్తింపు పత్రం ఇవ్వాలని ఒక డ్రాఫ్ట్ తయారు చేసినట్లు చెప్పారు. దాన్ని అన్ని యూనియన్లకు పంపించామని, దానికి 12 యూనియన్లు అంగీకరించి సంతకాలు చేసి సిఐటియుకు ఇచ్చారని తెలిపారు. సిఐటియు ఆ లెటర్లను మొత్తాన్ని క్రోడీకరించి డిప్యూటీ సిఎల్‌సికి, సిఎల్‌సికి, సింగరేణి యాజమాన్యానికి పంపించటం జరిగిందన్నారు. ఈ వాస్తవాన్ని మరుగున పరిచే ప్రయత్నం ఎవరు చేసినా దాన్ని కార్మికులు అందరూ అన్ని సంఘాలు తిప్పి కొట్టాలని సిఐటియు కోరుతున్నదన్నారు. గుర్తింపు పత్రం ఇవ్వకుండానే ఇప్పటికే అధికారిక కార్యక్రమాలలో సింగరేణి యాజమాన్యం ఏఐటిసిని గెలిచిన సందర్భంగా, ఐఎన్‌టియూసీ ప్రాతినిధ్య సంఘంగా అన్ని కార్యక్రమాలలో ఆహ్వానిస్తూ చర్యలు చేపడుతున్నదని, ఇది సరైన పద్ధతి కాదని, ఇలా జాప్యం చేసుకుంటూ పోయి గుర్తింపు పత్రం ఇచ్చిన నాటి నుండే కాలపరిమితిని లెక్క కట్టాలన్నారు. తద్వారా గతంలో లాగే ఎక్కువ కాలం గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలను కొనసాగించే విధానాన్ని అనుసరిస్తున్నందున ఎన్నికల అయిన తేదీ నుండి అనగా 27 డిసెంబర్ 2023 నుండి గుర్తింపు కాలాన్ని లెక్కించాలని నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈ విషయంలో వాస్తవాలను కార్మికులు గ్రహించాలని ఆయన కోరారు. గుర్తింపు పత్రం ఇవ్వటంలో జాప్యానికి ఏఐటియుసి, సింగరేణి యజమాన్యమే ప్రధాన బాధ్యత ఉన్నదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పేర్కొన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం వెంటనే రెండు సంవత్సరాలకాల పరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలి,దీనికి భిన్నంగా సింగరేణి యాజమాన్యం నాలుగు సంవత్సరాల కాల పరిమితితో గుర్తింపు పత్రం ఇస్తే దానికి పూర్తి బాధ్యత సింగరేణి యాజమాన్యమే వహించాల్సి వస్తుందని మంద నర్సింహారావు హెచ్చరించారు.

పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



నవతెలంగాణ-పాల్వంచ రూరల్

కేపీ జగన్నాధపురం శ్రీ కనకదుర్గ (పెద్దమ్మ తల్లి) దేవాలయంలో ఆషాడ మాసం తొలి ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం దేవాలయ ఆవరణలో 108 కలశాల ప్రతిష్టాపన చేసిన అర్చకులు గణపతి పూజ చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు ఉండాలని భక్తులు పూజలు నిర్వహించారు. కేశవాపురం, జగన్నాధపురం గ్రామాలకు చెందిన భక్తులు తెచ్చిన నీళ్ల బిందెలతో పాటు కలశాలను తీసుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం కలశ జనం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి రజిని కుమారి, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఈ నెల 21న చండీ హెూమం

ఈ నెల 21 ఆదివారం ఆలయంలో చండీ హెూమం నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. హెూమంలో పాల్గొను భక్తులు రూ.2516లు చెల్లించి, గోత్రనామాలతో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. హెూమంలో పాల్గొను భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9866923261, 6303408458 నెంబర్లను సంప్రదించాలని ఈవో కోరారు.

జీపీ కార్మికుల వేతనాలు విడుదల పట్ల హర్షం

నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్స్ వేతనాలు సుమారు రూ.150 కోట్లు విడుదల చేయటం పట్ల తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ హర్షం వ్యక్తం చేస్తున్నట్టు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, ప్రగశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సిరికొండ నాగేశ్వరరావు, జిల్లా నాయకులు మూడు బిచ్చు బుధవారం తెలిపారు. టేకులపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న గ్రామపంచాయతీ వర్కర్స్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన ఫలితంగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కార్మిక వర్గం సంఘటితంగా తమ సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ వర్కర్స్‌కు ప్రతినెల వేతనాలు విడుదల చేయాలని, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్రామపంచాయతీ జనాభా ప్రాతిదికన వర్కర్స్ నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కత్తుల ఎర్రయ్య, షికారు మల్లయ్య, భూక్యా కమిలి, కోరం పాండు, చీమల సూర్యనారాయణ, భూక్యా లింగా, పోషం రాజుతదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు జలాలను ఏజెన్సీ ప్రాంతాలకు మరలించాలి

నవతెలంగాణ-మణుగూరు

సీతారామ ప్రాజెక్టు జలాలను భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలకు మరలించాలని మణుగూరు ఎస్‌డీఎస్‌సీ సభ్యురాలు సున్నం భూలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ, అనుబంధ ప్రజా సంఘాల భద్రాచలం, మణుగూరు సబ్ డివిజన్ నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, జక్కం కొండలరావు, దుర్గం ప్రణయ్, మంగీలాల్, పెదగోని ఆదిలక్ష్మి, కొడిమి రాధ, కప్పల సూర్యకాంతం, రాపర్తి లక్ష్మి, కురసం సుజాత, లక్ష్మీనారాయణ, మర్ల కృష్ణ, సోడే అచ్చమ్మ, కణితి వెంకటమ్మ, జి.నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్

- సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి
- వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు అందజేయాలి
- టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి పుల్లయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

నేడు తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం చలో కలెక్టరేట్‌కు వేలాదిగా పోడు సాగుదారులు తరలి రావాలని కోరుతూ మండలంలోని గద్దమడుగు, చెరుపల్లి, జిన్నగట్ట, మారాయిగూడెం గ్రామాలలో సమావేశంలో నిర్వహించారు. ఆదివాసీలు తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలనే డిమాండ్ నేపథ్యంలో గత ప్రభుత్వం హక్కు పత్రాలు అందజేసినప్పటికీ పూర్తిస్థాయిలో పోడు చేసిన రైతులకు హక్కు పత్రాలు అందలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోడు పట్టాలు వచ్చిన రైతులకు పంట రుణాలు, త్రీఫేస్ విద్యుత్, వ్యవసాయ బోర్లు అందించాలని అన్నారు. వలస ఆదివాసీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 25వేల మంది గత 40 సంవత్సరాలు క్రితం మన ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి బతుకుదెరువు కోసం రావడం జరిగిందని వారందరికీ ఎస్టీ (కోయ) సర్టిఫికెట్ ఇవ్వాలని ఆయా గ్రామాలకు తాగనీరు సాగునీరు విద్య వైద్యం కరెంటు రోడ్ల సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీల పైన అటవీశాఖ అక్రమ దాడులు ఆపాలని, పోడు సాగుదారుల పైన పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ కోనబోయిన ధర్మరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోనబోయిన రామారావు, మడకం నాగేశ్వరరావు, వెట్టి ఇరమయ్య, మాస, ఉంగరాజు, సోడి ఇరమయ్య, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా వ్యకాస మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య అధ్యక్షతన చిన్న నల్లబల్లి, పెద్ద నల్లబల్లి, ఆర్లగూడెం, ముంగువాయి బాడువ, రామారావు పేట గ్రామాలలో జరిగిన పోడు సాగుదారుల సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ మాట్లాడారు. నేడు తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మడకం విజయలక్ష్మి కుర్సం కొండమ్మ వర్స చిన్నయ్య, సోడి శ్రీను, ధర్మరాజు, పాసయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు :18న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. పోడు భూములు రైతులు కదిలి రావాలని ఆయన పేర్కొన్నారు. గిరిజన గోపాలపురం గ్రామం వెళ్లి వ్యక్తి గత దరఖాస్తు ఇస్తూ గ్రామాలలో గ్రూప్ మీటింగులు పెట్టి కలెక్టరేట్ ధర్నాకి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామనాథం, పెద్దిరాజు, తాటి రాము, సర్వ భద్రమ్మ, తాటి కల్పన, ఆశ, సర్వ వీరస్వామి, కనితి సింగయ్య, జానీ, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణుగూరులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. పెద్దపల్లి, పగిడేరు, ఎస్టి కాలనీ, విప్పల గుంపు, సాంబయ్య గూడెం , విజయనగరం, కమలాపురం, రాయగూడెం, రేగుల గండి, కూనవరం, పలు గ్రామాలలో మీటింగ్ పెట్టి కరపత్రాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బొల్లం రాజు, నందం ఈశ్వరరావు, కుంజ నరసింహారావు, మడి నరసింహారావు, మూసకి ఉంగయ్య, సోడి గంగయ్య, కుంజ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్ సర్వీసులను పునరుద్ధరించండి



నవతెలంగాణ-మణుగూరు

రైల్ సర్వీసులను పురరుద్ధరించాలని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్‌ను మణుగూరు సబ్ డివిజన్ వారు కోరారు. వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా మణుగూరు రైల్వే స్టేషన్ నుండి రద్దు చేసిన రైలు సర్వీసులు అన్నింటిని వెంటనే ప్రారంభించాలని, సింగరేణి, విజయవాడ ప్యాసింజర్ ట్రైన్లను మణుగూరు వరకు పొడిగించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మణుగూరు నుండి నడిచే రైలు సర్వీసులను కరోనా కారణంతో రద్దు చేశారని తదుపరి దేశంలో అన్ని సర్వీసులను పునరుద్ధరించారని కానీ మణుగూరు నుండి రైలు సర్వీసులను పునరుద్ధరించలేదన్నారు. ప్రస్తుతం నడుస్తున్న మణుగూరు ట్రైన్ నిర్దిష్ట సమయానికి రైలు ప్రయాణికులు గమ్యస్థానం చేరేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనివలన మహిళలు, వృద్ధులు, పిల్లలు, ఆరోగ్య సమస్యలపై హైదరాబాద్‌కు వెళ్లినవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికార ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, సింగరేణి కార్మికుల సౌకర్యార్థం సింగరేణి ట్రైన్ మణుగూరు వరకు పొడిగించాలని కోరుతున్నారు. రైల్వే అధికారులు సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ అయిన సింగరేణి ట్రైన్, విజయవాడ ట్రైన్ మణుగూరు వరకు పొడిగించాలని రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఉదయం పూట వచ్చే మణుగూరు ఎక్స్ ప్రెస్‌ని తిరిగి వేరొక ప్రాంతానికి వెళ్లి వచ్చేలా ప్రణాళిక రూపొందించారని ప్రజలు కోరుతున్నారు. అలాగే కాకతీయ ట్రైన్ ఉదయం నడిచిన ప్యాసింజర్ ట్రైన్, బెల్గావి ఎక్స్ ప్రెస్‌లతోపాటు పుణ్యక్షేత్రాలైన తిరుపతి, నిజామాబాద్ (బాసర) (వయా పెద్దపల్లి) లకు నూతన రైలు సర్వీస్‌లను ప్రారంభించాలని ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయాన్ని అందిస్తున్న రైల్వే స్టేషన్ మణుగూరు ఉందని, కానీ ఈ ప్రాంతాన్ని రైల్వే అధికారులు చిన్న చూపు చూడడం విచారకరం గతంలో ఈ ప్రాంతం నుండి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంత ప్రజల తరపున స్పందించకపోవడం బాధాకరమని ఈ ప్రాంత ప్రజలు అనుకుంటున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న గిరిజన ప్రాంతమైన మణుగూరుకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ప్రభుత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధులు మంత్రులు ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరం బాధాకర విషయం అని సింగరేణి బిజిపిఎస్ఏ వాటర్ ప్లాంట్ ఐటిసి కంపెనీ కార్మికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసించే గిరిజనులు, కార్మికులు, సామాన్య ప్రజలు అధిక వ్యయ్య ప్రయాసలకు గురి అవుతున్నారు. కావునా రైల్వే శాఖ సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, భద్రాద్రి పవర్ ప్లాంట్, ఐటీసీలలో పనిచేసే కార్మికుల సౌకర్యార్థం భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం వెంటనే రైల్వే సర్వీస్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి, బిటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్ ఉన్నతాధికారులు కూడా ఈ సమస్య ను రైల్వే ఉన్నతాధికారులకు వివరించాలని కోరారు. అలాగే జిల్లాలో సింగరేణి పుట్టినిల్లు అయిన ఇల్లందు రైల్వే స్టేషన్‌ని పునరుద్ధరించాలి.

కావునా సత్వరమే స్పందించి రైల్ సౌకర్యానికి పునరుద్ధరించాలని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

సీతారాం ప్రాజెక్టు నీళ్లను మొదటి ప్రాధాన్యతగా జిల్లాకు ఇవ్వాలి

నవతెలంగాణ-టేకులపల్లి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయబడిన సీతారాం ప్రాజెక్టు నీళ్లను తలాపున ఉన్న ప్రాంతానికి ఇవ్వకుండా, మైదాన ప్రాంతానికి తీసుకెళ్లడం జల దోపిడికి నిదర్శనమని, ఉమ్మడి జిల్లాకు మంత్రులుగా ఉన్న వారు ఆదివాసీ జిల్లాకు అన్యాయం చేయడం క్షమించరానిదని, సీతారామ ప్రాజెక్టు నీళ్లు మొదటి ప్రాధాన్యతగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, మహబూబా బాద్ జిల్లా ఏజెన్సీ మండలాలకు ఇవ్వాలని ఆ తర్వాత మిగులు నీళ్లను మైదాన ప్రాంతానికి తీసుకెళ్లేందుకు అభ్యంతరం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జె.సీతారామయ్య బుధవారం తెలిపారు. సీతారాం ప్రాజెక్టు నీళ్లను కొత్తగూడెం జిల్లాకు ఇచ్చేందుకు రోళ్లపాడు రిజర్వాయర్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. టేకులపల్లి మండలం బద్దుతండాలో నర్సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి హర్షా, పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కొండపల్లి శ్రీనివాస్‌లు మాట్లాడారు. రోళ్లపాడు రిజర్వాయర్ శంకుస్థాపన చేసిన రోజే, భక్త రామదాసు ప్రాజెక్టును శంకుస్థాపన చేశారని, 10 నెలల కాలంలోనే భక్త రామదాసు ప్రాజెక్టును పూర్తి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా సీతారామ ప్రాజెక్టును జిల్లాకు అందించే రోళ్లపాడు రిజర్వాయర్ పనులు చేపట్టకుండా విస్మరించటం, జిల్లా ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం చూస్తే ఆదివాసీలు, గిరిజనులపై బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి ఉన్న కపట ప్రేమను తెలియజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్య నర్సింగ్, భూక్య కిర్య, రఘు, బాల, బద్య, హుస్సేన్, వాల్యి, ప్రసాద్, శంకర్, వెంకట్, సుక్కు, మణి, కాటేశ్వరి, కాంతి, మారోని, లలిత, శౌరి పాల్గొన్నారు.

ఎస్సై దశ దినకర్మలో పాల్గొన్న తాటి, పెద్ది

- ఎస్సై కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తు ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్‌కు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిలు నివాళులు అర్పించారు. శ్రీనివాస్ దశదినకర్మ వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం, తన స్వగ్రామం అయిన నారక్కపేటలోని ఆయన గృహంలో బుధవారం తన కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తాటి వెంకటేశ్వర్లు, సుదర్శన్ రెడ్డిలు శ్రీనివాస్ చిత్రపటానికి పూలు వేసి పుష్పాంజలి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం శ్రీనివాస్ భార్య క్రిష్ణ వేణికి రూ.25 వేలు చెక్‌ను ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ శ్రీనివాస్, గాదెగోని వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇల్లు గడవని పరిస్థితిలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్పెంటర్ గడ్డం నాగరాజుకి భద్రాచలం శ్రీ వెంకటేశ్వర కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మూడు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పారి రామ్ మాట్లాడుతూ.... యూనియన్‌లో సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్మికుడికీ యూనియన్ అండగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా ప్రతి కార్మికుడు వెల్ఫేర్ బోర్డు నుండి ఇన్సూరెన్స్‌ని నమోదు చేసుకొని ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని కోరారు. కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగి ఇబ్బందులు వస్తే తప్పనిసరిగా బోర్డు నుండి ఆర్థిక సాయం అందుతుందని ఈ అవకాశాన్ని ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అధ్యక్షులు మధుసూదనాచారి చేతుల మీదుగా నాగరాజుకి నగదును అందించారు. ఈ కార్యక్రమంలో అనుగోజు నరసింహ చారి, గౌరవ సలహాదారుడు బుద్దోజు శ్రీనివాసరావు, ఇల్లా సత్యనారాయణ, చాట్ల శ్రీనివాసరావు, రాంబాబు, హరిబాబు, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర కార్యవర్గం సభ్యులు శరత్ బాబు

నవతెలంగాణ-అశ్వారావుపేట



విశ్రాంత ఉద్యోగుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శరత్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆ సంఘం జిల్లా కార్యవర్గం సమావేశం మండల కమిటీ ఆధ్వర్యంలో శాఖ అధ్యక్షులు పున్నెం పుల్లయ్య అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన శరత్ బాబు మాట్లాడుతూ ఆరోగ్య సౌకర్యాల విషయంలో ఏర్పాటు చేసిన "హెల్త్ ట్రస్ట్"ను సమర్ధంగా కొనసాగించాలని, పెన్షన్ దారులు నుండి 1శాతం చందా వసూలు చేసి ప్రభుత్వం నుండి దానికి సమానంగా వేసుకొని ట్రస్టును సమర్ధంగా కొనసాగిస్తూ కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్య సౌకర్యం కల్పించాలని, పెన్షన్ కమిటేషన్ రికవరీ పీరియడ్‌ను 15 నుండి 12 సంవత్సరాలకు తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఆర్‌లను విడుదల చేయాలని, మంచి ఫిట్ మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని, బస్సులు, రైళ్లలో రిటైర్డ్ ఉద్యోగులకు రాయితీ ఇవ్వాలని, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల పతాకంలో గృహ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెస్లీ, వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నారాయణరావు, కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండ, సుధాకర్ రావు, ఇల్లందు మండల అధ్యక్షులు ఎల్.రాములు, సీహెచ్ బ్రహ్మ రావు, భూషణ్ రావు, వి.స్వామి దాసులు పాల్గొన్నారు.



మహోన్నత త్యాగానికి ప్రతీక మొహర్రం

- రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

మహోన్నత త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీక మొహర్రం అని జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మెన్, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ముస్లిం సోదరులు భక్తి శ్రద్దలతో జరుపుకొనే మొహర్రం సంధర్భంగా పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కారకవాగులో గిరిజనులు ఏర్పాటు చేసిన పీర్ల చావడిలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా హిందువులు, ముస్లింలు మొహర్రంను కలిసి నిర్వహించి సోదరభావం చాటుతున్నారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం ముస్లిం పెద్దలు ప్రాణాలు సైతం కోల్పోయారని, వారి త్యాగాల చిహ్నంగా జరుపుకొనే రోజు మొహర్రం అని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల అధ్యక్షులు కోండం వెంకన్న, మొహర్రం ఉత్సవ నిర్వాహకులు, గిరిజన నాయకులు బానోత్ హుస్సేన్, జాటోత్ బాలాజీ నాయక్, అజ్మీరా రవి, అజ్మీరా ప్రశాంత్, నూనావత్ రూప్ సింగ్, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మహేష్, శాంతివర్ధన్, గండు భరత్, రాము, కొండల రావు, చిన్న పండు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : మండల పరిధిలోని మైబూబ్ నగర్, అన్నపురెడ్డిపల్లి గ్రామాలలో ముస్లింలు మొహర్రం పండగను ఎంతో ఘనంగా నిర్వహించారు. పదవ రోజున పీరీలను గ్రామంలో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో బాజిబాబు, గఫార్, బుడెన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : హిందూ, ముస్లిం ఐక్యతకు మతసామరస్యానికి నిదర్శనమే పేర్ల పండుగని పలువులూరు పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి సత్యనారాయణ, కొత్తపల్లి సీతారాములు, కాసిం, లక్ష్మయ్య, మహేష్, దుగ్యాల సాయి ధనరాజ్, నరేష్, సాంబశివరావు, సందీప్, నరేష్, అఖిల్, సంతు, రాంబాబు, గోపీచంద్, తేజ, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించండి

నవతెలంగాణ-టేకులపల్లి

మండల కేంద్రం నుండి బోడు కొప్పురాయి, రామకృష్ణాపురం తదితర ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం పాతర్ల గడ్డ ప్రధాన రహదారిపై ప్రజలు ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ నాయకులు ఎట్టి నర్సింహారావు మాట్లాడారు. నిత్యం అనేకమంది ప్రజలు వివిధ ఏజన్సీ గ్రామాలనుండి ఎన్నో అవసరాలకు మండల కేంద్రమైన టేకులపల్లికి వస్తూ, పోతు ఉంటారని, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అత్యవసర సమయంలో వాహనాలు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రయివేటు వాహనాల వల్ల కాలయాపన జరిగి సమయానికి పనులు పూర్తి చేసుకోలేకపోతున్నామని వాపోయారు. ఆర్టీసీ సంస్థ స్పందించి వెంటన ఈ ఏజన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయుకులు భూక్యా రమేష్, బండ పాపమ్మ బోడ శిరోమణి, షేక్ హలీమా, మాడే స్వరూప, బండ సమ్మక్క, బండ రాధ తదితరులు పాల్గొన్నారు.

జలకలతో ఉట్టిపడుతున్న కిన్నెర రిజర్వాయర్

- 402.20 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఇన్ ఫ్లో 2400 క్యూసెక్కులు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



కిన్నెరసాని రిజర్వాయర్‌కు స్వల్ప మొత్తంలో వరదనీరు క్రమేపి పెరుగుతోంది. డ్యామ్ సామర్థ్యం 407 అడుగులు కాగా..బుధవారం ఉదయం 8 గంటలకు 402.60 అడుగులకు చేరింది. వివరాలను బుధవారం డ్యామ్ సైట్ అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు చేరడంతో.. రిజర్వాయర్ జలకళను తలపిస్తోంది. కేటీపీఎస్, డ్యామ్ సైట్ అధికారులు అనునిత్యం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇన్ ఫ్లో 2400 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో లేదని తెలిపారు. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

హామీలిచ్చిన ప్రభుత్వం విస్మరిస్తే పోరాటాలు తప్పవు

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ

నవతెలంగాణ-కొత్తగూడెం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని ప్రభుత్వం విస్మరించే విధంగా ప్రయత్నిస్తుందని, విస్మరిస్తే పోరాటాలు తప్పవని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం అఖిల అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆఫీసు కొత్తగూడెం రామ టాకీస్ ఏరియా మంచి కంటి భవన్‌లో సంఘం అధ్యక్షులు డి.లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే ఎత్తటం లేదన్నారు. గ్యాస్ రూ.1,000లు అయితే ఖాతాలో రూ.500 జమాయితాయని చెప్పారని అన్నారు. అవి ఖాతాలో పడటం లేదన్నారు. ప్రతి పేద మహిళకి నెలకి రూ.2,500లు ఇస్తానని ఇంతవరకు వాటి ఊసే లేదని ఆరోపించారు. ఇంటింటికీ ఫ్రీ కరెంటు కూడా ప్రతి ఒక్క పేద మహిళలకు అందడం లేదని, అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు ఇస్తామని వాగ్దానాలు చేసి ఇంత వరకు ఒక్కరికీ కూడా అమలుచేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో సక్రమంగా మహిళలకు సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోతున్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, వాటి గురించి ఇంతవరకు ఎక్కడా మాట్లాడకుండా కాలం గడుపుతున్నారని మండి పడ్డారు. పింఛన్లు, రేషన్ కార్డులు కొత్తవి ఇస్తానని అవి కూడా ఇవ్వలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ విధానల పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మహిళలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందచేయాలని, లేనియెడల ఐద్వా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి, సహాయ కార్యదర్శి సందకూరి లక్ష్మి, ఎన్.లీలావతి, ఎన్‌వి.వాణి, అమల తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా నాట్యరవలి డాన్స్ కాంపిటీషన్‌లో చిన్నారులు ప్రతిభ

నవతెలంగాణ-పాల్వంచ



విశాఖపట్నంలోని కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 11, 12, 13వ తేదీలలో 35వ ఆలిండియా నాట్యరవలి డాన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీ సంతోషిణి నాట్య నిలయం పాల్వంచ చిన్నారులు వివిధ విభాగాలలో పాల్గొని చక్కటి ప్రతిభను కనపరిచారు. కూచిపూడి సబ్ జూనియర్స్ విభాగం నుంచి ధాత్రి శ్రీ సాయి ద్వితీయ బహుమతి, మాన్విత, సంకీర్తన కన్సోలేషన్ మీనాక్షి స్పెషల్ జ్యూరీ అవార్డును కైవసం చేసుకున్నారు. అలాగే కూచిపూడి జూనియర్స్ నుంచి కార్తీక కన్సోలేష యోషిత స్పెషల్ జ్యూరీ అవార్డు, కూచిపూడి గ్రూప్ విభాగం నుంచి యోషిత అండ్ గ్రూప్ వారి సత్తాను చాటుకుని తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. అలాగే ఫోక్ విభాగం నుంచి జూనిర్స్‌లో కార్తీక మొదటి బహుమతిని, (సబ్ జూనియర్స) విభాగం నుంచి మాన్విత ద్వితీయ బహుమతి, అలాగే ధాత్రి సాయి శ్రీ-కన్సోలేషన్, (ఫోక్ డ్యూయెట్) విభాగం నుంచి ధాత్రి శ్రీ సాయి, మాన్విత-ద్వితీయ బహుమతిని (కూచిపూడి డ్యూయెట) భాగం నుంచి మీనాక్షి, సంకీర్తన-తృతీయ బహుమతిని కైవసం చేసుకుని వారి సత్తాను చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సంతోషిని నాట్య నిలయం నిర్వాహకురాలు నాట్య చారిని రమాదేవి రామ్ చిన్నారులను అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. ఇటువంటి చక్కటి అవకాశాలను చిన్నారులకు కల్పిస్తున్నందుకుగాను చిన్నారుల తల్లిదండ్రులు గురువుకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ఐపై బాదుడు...

రెస్టారెంట్ల మాటున బార్లు

- అధిక రేట్లకు విక్రయిస్తున్న మద్యం
- మందుబాబుల జేబుకు చిల్లు
- మామూళ్ల మత్తులో సంబంధిత అధికారులు

నవతెలంగాణ-అశ్వాపురం



ప్రధాన రహదారి పక్కన రెస్టారెంట్ పేరుతో వెలసిన బోర్డు

మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్లో అనధికార బారును నడుపుతూ మద్యపాన ప్రియులను ఐపై బాదుడు బాస్తున్నారు. బయట ప్రధాన రహదారి పక్కన ఐపై రెస్టారెంట్ పేరుతో బోర్డును ఏర్పాటు చేసి లోపల మాత్రం నిరభ్యాంతరంగా మద్యం దందాను కొనసాగిస్తున్నారు. మద్యపాన ప్రియుల నుండి ప్రతి కోటర్ బాటిల్ పై హోల్‌సేల్ ధరల కంటే రూ.60 నుంచి 70 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే ఏసీ రూముల నిర్వహణ పేరుతో ఆ రూములలో కూర్చుని మద్యం సేవించే వారిపై మరో రూ.20 కలిపి రూ.90 అదన పు భారాన్ని వేస్తూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

రెస్టారెంట్ల మాటున కొనసాగుతున్న బారు



రెస్టారెంట్ మాటున నడుస్తున్న ధాబా

సాధారణంగా రెస్టారెంట్లో ఆహారాలకు సంబంధించిన వ్యాపారాన్ని చేసుకోవాలి. సంబంధిత శాఖ అధికారుల అనుమతులు లేకుండా దాబాల్లో మద్యం అమ్మకాలు చేపట్టకూడదనే నిబంధనలు లేకపోలేదు. అయితే వీటిని పర్యవేక్షించాల్సిన కొన్ని శాఖల అధికారులకు గుట్టు చప్పుడు కాకుండా నెలనెలా మామూళ్ళు ముట్ట చెపుతూ వారి వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని పలువురు అంటున్నారు. హోటలలో మద్యం విక్రయాలు జరగకుండా చూడాల్సిన అధికారులే పట్టించుకోకపోవడంతో రెస్టారెంట్ల పేరుతో దాబాలు నడుపుతున్న వారి ఆగడాలు రోజురోజుకు పెచ్చు మీరుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు.

అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్న దాబాలపై చర్య తీసుకోవాలి

ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడుతున్న దాబా నిర్వాహకులపై సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మద్యపాణ ప్రియులు కోరుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలో ఓ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రెస్టారెంట్ మాటున దాబాను నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేపడుతున్న వారిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మందుబాబులు కోరుతున్నారు. ఈ రెస్టారెంట్లో అమ్మకాలు చేపడుతున్న మద్యం బాటిల్ పై అధిక మొత్తంలో వసూలు చేస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఈ దాబాపై దృష్టి సారించి అధిక రేట్లకు మద్యం అమ్మకాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న పాలకవర్గం

- అక్రమంగా జరిగిన సంత వేలం పాటను రద్దు చేయాలి
- సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శి బాలరాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టే విధంగా మున్సిపల్ పాలకవర్గం వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు అన్నారు. అక్రమంగా టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మంచికంటి భవన్‌లో జరిగిన టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపాలిటీలో ఇటీవల కాలంలో అనేక రకాలుగా నిధులు దుర్వినియోగం జరుగుతున్నదని, ఇటీవల మున్సిపాలిటీ పరిధిలోగల వారాంతపు సంత టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సిన కనీస పద్ధతులు పాటించకుండా ఏకపక్షంగా నిర్వహించడం జరిగిందని ఆరోపించారు. టెండర్ పిలిచే ముందు పాటించవలసిన కనీస నిబంధనలు పాటించలేదని అనుమానం వ్యక్తం చేశారు. అత్యధిక సర్క్యులేషన్ ఉన్నటువంటి పేపర్లలో ప్రకటన చేయడము, మైక్ ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు మొత్తానికి తెలిసేలా ప్రచారం చేయవలసినటువంటి బాధ్యత ఉందని, ఇలాంటి నిబంధనలు ఏమి కూడా పాటించకుండా తప్పు దోవలో టెండర్ ప్రక్రియను నడిపారని ఆరోపించారు. డైలీ మార్కెట్, సంత, కబేళ టెండర్లు తక్కువ వేలం పాటకు ఇచ్చి ప్రజల ఆదాయాన్ని అధికారులు కలిసి కట్టుగా కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇదే వారాంతపు సంత పూర్వం యాభై లక్షలు, అంతకు పూర్వం డెబ్బై లక్షలకు వరకు కూడా వేలం పాట జరిగిందని చెప్పారు. కానీ ఈసారి రూ.8 లక్షలకు మాత్రమే వారాంతపు సంత పాట అయినట్లుగా మున్సిపల్ అధికారులు ప్రకటించడం చాలా విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీకి ఇంత పెద్ద ఎత్తున నష్టం జరుగుతుంటే మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. వారాంతపు సంత, డైలీ మార్కెట్ సంత, చికెన్, మటన్ వ్యర్ధాల, మూత్రశాలలు, కబేలాల టెండరలలో అవినీతి జరిగినా, డస్ట్ బిన్లు, చలివేంద్రం, డబల్ బెడ్రూం వాహనాల నిర్వాణలో అవినీతి జరిగిందని తక్షణమే మున్సిపాలిటీలో అభివృద్ధి పేరుతో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు భూక్యా రమేష్, టౌన్ కమిటీ సభ్యులు డి.వీరన్న, సందకూరి లక్ష్మి, జునుమాల నగేష్, నందిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ స్క్రాప్ తరలింపుపై నిపుణుల కమిటీ విచారణ చేయాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-పాల్వంచ

కేటీపీఎస్ పాత ప్లాంట్ స్క్రాప్ తరలింపులో జరిగిన అవినీతిపై నిపుణుల కమిటీతో విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలోనే కేటిపిఎస్ పాత ప్లాంట్ స్క్రాప్ తరలింపుపై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాయని అన్నారు. టెండర్ల ప్రక్రియలో కూడా అనేక అవకతవకలు జరిగాయని పలు మీడియా ఛానెల్స్, వార్తా పత్రికల కథనాలను ప్రచురించాయని ఈ క్రమంలో నిజాలను నిగ్గుతేల్చాలని మొట్టమొదటగా స్పందించింది బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమే...దానికి స్పందించిన జెన్కో ఉన్నతాధికారులు విచారణ కమిటీ నియమించారని స్పష్టం చేశారు. అయితే గతంలో ఆరోపణలు వచ్చినప్పుడు స్పందించని స్థానిక శాసనసభ్యులు కూనంనేని స్క్రాప్ 80 శాతం తరలించిన తర్వాత స్పందించడంలో ఉన్న అంతర్యమేంటని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో రెండుసార్లు కేటిపిఎస్‌ను సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే ఏం సాధించారని ప్రశ్నించారు?. కనీసం స్క్రాప్ తరలింపు ప్రక్రియను కూడా నిపులుదల చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. అదేరోజు శాఖాపరమైన విచారణ జరుపుతామని చెప్పిన జిల్లా కలెక్టర్ విచారణ ఎంత వరకు వచ్చిందో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు స్క్రాప్ తరలింపు ప్రక్రియ నిలుపుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ చెప్పినప్పటికీ స్క్రాప్ ఏవిధంగా తరలిపోతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా జెన్కో ఉన్నతాధికారులు నిబద్ధతతో వ్యవహరించి స్క్రాప్ తరలింపులో జరిగిన అవకతవలపై ఉన్నతస్థాయి అధికారుల నిపుణుల కమిటీతో విచారణ జరిపించి, నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోళ్ళపూడి ప్రవీణ్ కుమార్, అసెంబ్లీ మహిళ అధ్యక్షురాలు కాటబోయిన వసుంధర, రంజిత్, సరోజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు వారు వేసిన బాటలు నేటి భావితరానికి నాంది

- సింగరేణి స్టట్ ఇంక్లైన్ గని ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి కార్యక్రమంలో జీఎం

నవతెలంగాణ-ఇల్లందు



1938వ సంవత్సరం మొహర్రం నాడు విషవాయువుకు గురై పురుషులు, మహిళా ఉద్యోగులు మృత్యువాతపడ్డారు. ఇందులో భాగంగా ప్రతి ఏట వారి జ్ఞాపకార్థం మొహర్రం నాడు గని ప్రదేశంలో సంస్మరణ సభ నిర్వహించి, శ్రద్ధాంజలి ఘటిస్తు న్నామని నాడు వారు వేసిన బాటలు నేటి భావితరానికి నాంది అయ్యిందని జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 1938వ సంవత్సరం ఇల్లందులో దాదాపు 37మంది పురుషులు, ఆరుగురు మహిళా, ఉద్యోగులు మొత్తం 43 మంది మృతి చెందారని అన్నారు. 1886సంవత్సరంలో డా.కింగ్ అనే భూగర్భ శాస్త్రవేత్త ఇల్లందు పరిసర ప్రాంతాల్లో బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని కనుగొనడం జరిగింది. దురదృష్ట వశాత్తు 1938 మార్చి 12వ తేదీ ఒక పెద్ద ప్రమాదం సంభవించిందన్నారు. అనాడు ఈ బ్రిటిషర్స్ కింగ్ సీం ద్వారా చక్కటి నాణ్యమైన బొగ్గును తీస్తూ వస్తున్న సమయంలో ఒక ప్యానల్ స్ట్రట్ ఇంక్లైన్‌కు దగ్గరగా 100మీ.లోతులో ఉన్న దానిని 1937 సంవత్సరం నాడు ప్రారంభించి 9 నెలలుగా పనిచేస్తున్నారు. ఆ సమయంలో ఈ సాండ్ స్టోవింగ్ లేటెస్ట్ టెక్నాలజీ లేక కేవలం కేవింగ్ మెథడ్ ద్వారా పనిచేయడం జరిగింది. ఐసోలేషన్ గోడలు కట్టడం కోసం అక్కడ ఉన్న షెల్ బొగ్గు పెల్లలతో గోడలు నిర్మించడం కోసం పై నుండి బోర్వెల్ వేసి దాని ద్వారా మట్టి నీరు పంపించి గోడలు నిర్మించే ప్రక్రియ జరుగుతున్న సమయంలో 1938 మార్చి 12వ తేదీ దాదాపు రాత్రి 11గంటలకు ఇక్కడ ఈ ప్రదేశంలో ఉన్న గనుల మేనేజర్ ఆర్.ఎల్ యాండ్రూస్ ఆధ్వర్యంలో పని జరుగుతున్న తరు ణంలో అక్కడ ఒక పెద్ద బండ కూలడంతో కార్బన్ మో నాక్సైడ్ బయటకు వచ్చి గోడలు పడిపోవడం జరిగింద న్నారు. అదే సమ యంలో అక్కడ పనిచేస్తున్న అధికా రులు, ఉద్యోగులు వెంటనే వెలువడిన విషవాయువుని పీల్చడం ద్వారా ప్రాణాలు కోల్పోయినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా యాజమాన్యము మొహర్రం పండుగ నాడు సెలవుదినంగా, ఇల్లందు ఏరియాలో శు క్రవారం వారాంతపు సెలవు దినంగా ప్రకటించిందని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో, ఏజీఎం(ఐడీ) యం.గిరిధరరావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, డీజీఎం (పర్సనల్) జీవి.మోహన రావు, డీజీఎం (సివిల్)రవి కుమార్, ఇతర అధికారులు ధనుజయ రెడ్డి, అంజి రెడ్డి, శివ కుమార్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం తరుపున మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైను కలిసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఇటీవల మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంకటప్పయ్యను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకేలు అందజేయడంతో పాటు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ శాంతి భద్రతలను, అసాంఘిక కార్యక్రమాల కట్టడికి కృషి చేస్తానన్నారు. ఎస్సైను కలసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లంక శ్రీనివాసరావు, డివిజన్ నాయకులు కుంజ శ్రీనివాస్ రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి చంటి, మట్ట నరసింహారావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నె సత్యనారాయణమూర్తి, కనితి రాముడు, నాయకులు దామెర్ల శ్రీనివాసరావు, సోయం నరసింహారావు, అర్జున్ తదితరులు ఉన్నారు.

రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు

- రేపటి నుండి లక్ష లోపు రుణాలు మాఫీ ప్రారంభం

నవతెలంగాణ-చర్ల

చర్ల రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు జరగనున్నట్టు వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం చే నేరుగా రుణమాఫీ లాంచనంగా ప్రారంభించి, లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతారు. చర్ల రైతు వేదిక ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించొచ్చు. వీడియో కాన్ఫరెన్స్ (దృశ్య శ్రవణ మాధ్యమం) ద్వారా రుణమాఫీ రైతుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేయడం జరుగుతుంది. రుణమాఫీ డబ్బులు విడుదలైన రోజునే రైతు వేదికల్లో రుణమాఫీ లబ్దిదారులతో సంబరాలు జరుపుకోనున్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొంటారు. కావునా రైతులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఏవో శివరాం ప్రసాద్ కోరారు.

టేకులపల్లి : నేటి నుండి లక్షలోపు రుణాలు మాఫీ ప్రారంభంతో నేడు మధ్యాహ్నం 3 గంటలకు సీఎం నేరుగా రుణమాఫీ లాంచనంగా ప్రారంభించి, లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడుతారని మండల వ్యవసాయ శాఖ అన్నపూర్ణ బుధవారం తెలిపారు. రైతు వేదిక ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించొచ్చునని, వీడియో కాన్ఫరెన్స్ (దృశ్య శ్రవణ మాధ్యమం) ద్వారా, రుణమాఫీ రైతుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేయడం జరుగుతుందని, రుణమాఫీ డబ్బులు విడుదలైన రోజునే రైతు వేదికల్లో రుణమాఫీ లబ్దిదారులతో సంబరాలు జరుపుకోనున్నారని, అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. కావునా రైతులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.



సాగునీటిని సద్వినియోగపరచుకోండి

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-చర్ల

మండల పరిధిలో ఉన్న మధ్యతరహా తాలి పేరు ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న సాగునీటిని ఆయకట్టు రైతులు సద్వినియోగ పరుచుకోవాలని ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు రైతులను కోరారు. బుధవారం పెదమిసలేరు సమీపంలో ఉన్న తాలి పేరు ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ద్వారా సాగునీటిని వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ విడుదల చేసి ఆయన మాట్లాడారు. తాలి పేరు ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న సుమారు 25వేల ఎకరాలకు ఈ సాగునీటి ద్వారా ఖరీఫ్ సాగు చేపట్టాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నీటిని సకాలంలో అందించి అన్నదాతను అన్ని విధాల ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రాజెక్టు మరమ్మత్తులు నాణ్యంగా చేపట్టి ఆధునికరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, డి తిరుపతి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, ఎంపీటీసీలు శోభారాణి, పాలంచ రామారావు, శ్యామల రామారావు, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, గుండెపుడి భాస్కర్ రావు, పెద్ద ఎత్తున రైతులు అధికారులు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

కళ్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం పంపిణీ చేశారు. 17 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష 116 రూపాయల చొప్పున చెక్కులను అందజేసి సద్వినియోపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోదండరామయ్య, ఎంపీటీసీలు మడకం పద్మజ, శోభారాణి, తహసీల్దార్ శ్రీనివాస్ అధికారులు నాయకులు పాల్గొన్నారు.

తాలిపేరుకు భారీగా వరద తాకిడి

- 70,750 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

నవతెలంగాణ-చర్ల



అల్పపీడనద్రోణితో సరిహద్దు చత్తీస్‌గడ్‌లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తాలిపేరు నది పర్వాలు తొక్కుతూ తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టును చేరడంతో ప్రాజెక్టుకి జలకల సంతరించుకుంది. ఎగువ నుండి 70,750 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుకోవడంతో అధికారులు ప్రాజెక్టుకు ఉన్న 25 గేట్లకు గాను ఐదు గేట్లను పూర్తిగా ఎత్తి 20 గేట్లను రెండు అడుగుల మేర లేపి 70,750 క్యూసెక్కుల నీటిని దిగువున్న గోదావరిలోకి వదులుతున్నారు. ఈ వర్షాకాలం సీజన్ ప్రారంభం అయిన దగ్గర నుండి బుధవారం మొట్టమొదటిసారిగా తాలిపేరు ప్రాజెక్టుకు అధికంగా వరద నీరు చేరుకుంది. ప్రాజెక్టు సరాసరి సామర్థ్యం 74 మీటర్లు కాగా అధికారులు 73 మీటర్ల నీటిని నిలువ ఉంచి అధికంగా వచ్చిన వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు డీఈ తిరుపతి తెలిపారు.

నిషాకోసం యువత తప్పటడుగులు

- అంధకారంగా యువత భవిష్యత్
- గుప్పమంటున్న గంజాయి...

నవతెలంగాణ-దమ్మపేట

మత్తు కోసం యువత కొత్త ఎత్తులు వేస్తూ చిత్తవుతోంది. సంప్రదాయ మత్తు పదార్థాలు అందుబాటులో లేనివారు ఇతర ప్రమాదకరమైన పదార్థాలను వినియోగిస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొంతమంది అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో యువతకు గంజాయి అంటగట్టే పనికి దిగారు. దీంతో గంజాయి మత్తులో యువత చిత్తవుతున్నారు. గంజాయి, గుట్కా కిక్కుతో యువత మునిగి తేలుతున్నారు. దమ్మపేట కేంద్రంగా మత్తు పదార్థాల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. దీంతో పలువురు యువత గంజాయి మత్తులో దాడులకు తెగబడుతున్నారు. మండలంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలతో గ్రామాల్లో రాత్రివేళల్లో మహిళలు బయటకు వెళ్లాలంటేనే భయాందోళనలకు గురవుతున్నారు. గంజాయి ముఠాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తుంది. దమ్మపేట మండలంలో అటవీ ప్రాంతం అధికంగా ఉండటం, భద్రాద్రి జిల్లా సరిహద్దు



చత్తీస్‌గఢ్ ప్రాంతం కావడంతో ఇటువైపుగా గంజాయి రవాణా నిరంతరం చత్తీస్‌గడ్, ఒరిస్సా ప్రాంతాల నుండి విచ్చలవిడిగా సాగుతుంది. దీనికి నిదర్శనంగా ఇటీవల కాలంలో పోలీసులు జిల్లాలోని సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద భారీ స్థాయిలో గంజాయిని పట్టుకున్న సంఘటనలెనో. ఇదే అదునుగా చేసుకొని మారుమూల ప్రాంతాల యువతను టార్గెట్ చేసుకొన్నాయి. వీరికి అనుసంధానంగా పట్టణంలో కొన్ని ముఠాలు గంజాయి దర్జాగా సాగిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలను ఇక్కడికి తీసుకువస్తున్నట్లు, కొన్ని స్థావరాలను ఏర్పాటు చేసుకుని మత్తు పదార్థాలు పలువురు యువతకు అమ్ముతున్నట్లు విమర్శలున్నాయి. మండలంలోని కొమ్ముగూడెం కేంద్రంగా చేసుకొని గంజాయి సరఫరా చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయి దందాపై వార్తలు వ్రాసే విలేకర్లపై దాడులు చేయడానికి సదరు ముఠా వెనకాడట్లేదు. దీంతో పాటు తమకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని గంజాయి దందాలు నిర్వహిస్తున్న వ్యక్తులు బాహాటంగా చెప్పుకోవడం ఈ ముఠా దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో యువత గంజాయి మత్తులో జోగుతోంది. ఎక్కడబడితే అక్కడ గంజాయి లభించడంతో యువత గంజాయి మత్తుకు బానిసలు అవుతున్నారు. విద్యార్థుల నుంచి కార్మికుల వరకు గంజాయికి బానిసలై కుటుంబాలను ఛిద్రం చేస్తున్నారు. మండలంలోని కొమ్ముగూడెం, పార్కెలగండి తదితర గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేస్తే కచ్చితంగా గంజాయి వినియోగిస్తున్న వ్యక్తులను పట్టుకోవచ్చని ఆయా గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఆందోళనకర పరిస్థితి నుంచి యువతను రక్షించాల్సిన ప్రభుత్వం, గంజాయి స్మగ్లర్లను అణచివేయడంలో మీనమీషాలు లెక్కిస్తోందనేది నగ్నసత్యం.

తల్లి తండ్రులు అప్రమత్తంగా ఉండాలి

యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే చాలిస్తున్నారు. మత్తుకు అలవాటు పడి అనేక అఘాత్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై తల్లి తండ్రులు అప్రమత్తమై పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించకపోతే వారి భవిష్యత్ అంధకారంగా మారుతుంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా వీటి వినియోగంపై నిఘాపెట్టి నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ సాయి కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందంతో పలుచోట్ల నిఘా ఏర్పాటు చేశామని ఈ క్రమంలో ప్రజలు కూడా పోలీస్‌లకు సహకరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు.

షరతులు లేకుండా ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ

నవతెలంగాణ-అశ్వాపురం



ఏజెన్సీ ప్రాంతాలలో బ్యాంకుల నుండి రైతు రుణాలు తీసుకున్న ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం రుణమాఫీని అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టాదారు పుస్తకం ఉన్నవారికే రుణమాఫీ అనడంతో ఏజెన్సీలో గతంలో బ్యాంకులలో పహానిలపై రుణాలు పొందిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వారికి కూడా మినహాయింపు ఇచ్చి రుణమాఫీ పథకం అమలు చేయాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం బ్యాంకర్ల నుంచి నివేదికలు తెప్పించుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. ఇలా చేయకపోవడం వలన అనేకమంది ఏజెన్సీలోని గిరిజనేతర రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏజెన్సీ గిరిజనేతర రైతులకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు

నవతెలంగాణ-చంద్రుగొండ

నేటి నుంచి లక్షలోపు రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు వేదికలో సంబరాలు నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో మధ్యాహ్నం నాలుగు గంటలకు లబ్ధిదారులతో ముఖాముఖి ఉంటుందని, రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని నేరుగా వీక్షించే సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి రుణమాఫీ సంబరాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



రిటైర్డ్ అయి 8 ఏండ్లైనా గ్యాడ్యూటి రాలేదు

- సింగరేణి చైర్మెన్‌కు వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థలో పనిచేసి, రిటైర్డ్ మెంటు తీసుకుని 8 సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు గ్యాడ్యూటి రాలేదని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చింత చెర్వు గెర్షోం తెలిపారు. బుధవారం సింగరేణి చైర్మెన్ ఎన్.బలరామ్‌కు వినతి పత్రం అందజేశారు. సింగరేణి వెజ్ బోర్డు ప్రకారము 2017 నుంచి రూ.20 లక్షలు గ్రాడ్యూటీ ఇవ్వవలసిన డబ్బులు మా సింగరేణి కార్మికులకు ఈ రోజు వరకు ఇవ్వలేదని తెలిపారు. కోడిడ్-19 సాకుతో నిలిపి వేశారని, కోవిడ్ తరువాత ఇస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిపారు. సింగరేణి కార్మికులకు రిటైర్డ్ అయి 8 సంవత్సరాలు అవుతున్నాయని తెలిపారు. కార్మికుల పిల్లలు వివాహాలకు, ఇల్లు కట్టుకోలేక, తల్లి, దండ్రులకు కార్పోరేట్ హాస్పటల్లో వైద్యం చేయించలేక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. మాకు రావాల్సిన గ్రాట్యునిటి కార్మికుల కుటుంబాలకు ఇప్పించగలరని కోరారు. స్పందించిన చైర్మెన్ ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చొరవ తీసుకుంటామని చెప్పారు.

డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంలతో నమూనాల సేకరణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం సామ్యాతండాలో అనుమానాస్పదంగా తలపై గాయాలతో మృతి చెందిన గుగులోత్ సక్రి(65) విషయమై మంగళవారం రాత్రి సీఐ తిరుపతిరెడ్డి, కామేపల్లి ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలతో నమూనాలను సేకరించారు. తన తల్లికి, అన్నదమ్ములకు ఆస్తి తగాదాలు నడుస్తున్నాయని, ఆస్తి తగాదాలతోనే తన తల్లిని హతమార్చారని వద్దురాలి పెద్ద కుమార్తె బుజ్జి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయమై అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఎస్సైకు అభినందనలు తెలిపిన మాజీ వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-జూలూరుపాడు

నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాణా ప్రతాప్‌ని బుధవారం మాజీ వైస్ ఎంపీపీ కొడెం సీతాకుమారి పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎంట్రీ- ఎగ్జిట్ పై ఎన్ హెచ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం టూ దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకు ధంసలాపురం వద్ద ఎంట్రీ ఎగ్జిట్ పై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సమీక్షించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఇతర అధికారులతో డిజైన్స్‌పై చర్చించారు. అధికారులు మంత్రికి రెండు డిజైన్లు సమర్పించారు. వీటిపై మంత్రి స్పందిస్తూ రైతులు ఎక్కువగా నష్టపోకుండా తక్కువ భూసేకరణ ఉండే డిజైన్ పరిశీలించాల్సిందిగా సూచించారు. అటువంటి డిజైన్ ను ఆమోదించాల్సిందిగా ఉన్నతాధికారులకు సూచన చేశారు. త్వరగా భూ సేకరణ చేసి నేషనల్ హైవే అధికారులకు అప్పగించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ను కోరారు. అలాగే ధంసలాపురం హైవే ఎంట్రీ



ఎగ్జిట్ డిజైన్స్ త్వరగా ఆమోదం పొందేలా కృషి చేయాలి అన్నారు. ఖమ్మం - యదేవరపల్లి హైవే మిగులు పనులు పూర్తయ్యేలోపు ధంసలాపురం వద్ద ప్రవేశం నిష్క్రమణ వంతెన పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్ హెచ్ ఏఐ అధికారులను ఆదేశించారు.

ఎన్‌హెచ్ 365ఏపై అధికారులకు మంత్రి లేఖ

మధిర అసెంబ్లీ నియోజకవర్గంలోని జాతీయ రహదారి 365ఏ వెంకటాపురం-ముదిగొండ నుంచి వెళ్తుందని, ఇక్కడ అనేక గ్రానైట్ పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో దీనిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని ఎన్ హెచ్ ఏ ఐ హైదరాబాద్ రీజనల్ ఆఫీసర్ రజాక్ కు మంత్రి లేఖ రాశారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. 8 కిలోమీటర్ల వ్యవధిలో ఐదు ప్రమాద హెచ్చరిక బోర్డులను పోలీస్ శాఖ ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ ప్రమాద స్థలాలను సరిచేసి, నాలుగు లైన్ల రోడ్డు పూర్తయిన తర్వాత రాష్ట్ర రోడ్డు భవనాల శాఖకు దీనిని అప్పగించాల్సిందిగా కోరారు.

మట్టి రోడ్డు ఏర్పాటు

'నవతెలంగాణ' కథనానికి స్పందన

నవతెలంగాణ-కరకగూడెం



నవతెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పత్రికలో సోమవారం రోడ్డు అధ్వానం.. పట్టించుకోని ప్రభుత్వం అనే శీర్షిక తో ప్రచురితమైన కథనానికి మండల ఎంపీడీఓ దేవవార కుమార్ స్పందించి బుధవారం బట్టుపల్లి గ్రామంలో తాత్కాలిక మట్టి రోడ్డును వేయించారు. తాత్కాలిక రోడ్డు వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.



గ్రామాల్లో అద్వానంగా అంతర్గత రోడ్లు

నవతెలంగాణ-చంద్రుగొండ

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామలలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. తుంగారం పంచాయతీలో వీధులు నారుమళ్లను తలపిస్తున్నాయి. రావికంపాడు పంచాయతీ కార్యాలయం, ఒడ్డు బజారులలో వర్షం నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారాయి. మండల కేంద్రమైన చంద్రుగొండ బ్రాహ్మణ వీధిలో ఇళ్లలో వాడే డ్రైనేజీ నీళ్లు, వర్షపు నీటితో కలిసి రోడ్డుపై చేరాయి. నిత్యం రాకపోకలు అధికంగా ఉండే ఈ వీధిలో డ్రైనేజీ లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. అధికారులు మురికి నీటి నిల్వలు తొలగించే విధంగా తర్వాత చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డీఎస్పీ పరీక్ష కేంద్రం వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్

- డీఎస్పీ రెహమాన్

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం జిల్లా పరిధిలో జులై 18 నుంచి ఆగష్టు 5 వరకు జరిగే డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో పరీక్షా సెంటర్ అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ చట్టం-2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ తెలిపారు. జులై 18 తేది నుండి ప్రతి రోజు రెండు సెషన్‌లలో, ఉదయం 9గంటల నుండి 12 గంటలు మధ్యాహ్నం వరకు ఉంటుంది. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి 5గంట వరకు జరగనున్న డిఎస్సి పరీక్ష సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు సెక్షన్ 163 అంక్షలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాలలో పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు సంబంధిత నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఇసుక వాగుపై బ్రిడ్జిని నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలి

- మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని గొందిగూడెం ఇసుక వాగుపై నిలిచిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే పునర్ ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక వాగుపై నిర్మాణం చేపడుతున్న బ్రిడ్జి పనులు కాంట్రాక్టర్కు బిల్లులు చెల్లించక అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఏజెన్సీలోని మారుమూల గ్రామపంచాయతీల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా పక్కన తూరలు వేసి నిర్మించిన తాత్కాలిక రోడ్డు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోవడంతో అత్యవసర వైద్య సేవల కొరకు మండల కేంద్రంతో పాటు ఇతర పట్టణ ప్రాంతాలకు వెళ్లే రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. గత



ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులకు బిల్లులు ఇవ్వని కారణంగానే కాంట్రాక్టర్ సామాను సదురుకొని వెళ్ళాడని ప్రస్తుత పాలకులు ఈ బ్రిడ్జి నిర్మాణం పై దృష్టి సారించి ప్రజల కష్టాలు తీర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఇసుక వాగు కష్టాలు తీర్చేందుకు స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణమును కొనసాగేలా చూడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలి

- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ-ఖమ్మం

కోతలు, కొరతలు, ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతుల రుణమాఫీ చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని నిర్ణయించడానికి రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటామన్న ప్రభుత్వ ప్రకటనతో అనేకమంది రైతులు భయాందోళనలకు గురవుతున్నారని, గడిచిన తొమ్మిది సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని, రేషన్ కార్డులో పేర్లు తొలగించడం గాని చేర్చడం కానీ అవకాశం లేదని, దీని కారణంగా దశాబ్దం కితమే వేరైనా కుటుంబాలు సైతం రేషన్ కార్డులో ఒకే కుటుంబం ఉంటే ప్రమాదం ఉందని, కనుక దాని పరిగణలోకి తీసుకుంటే చాలామంది రైతులు రుణమాఫీ అమలు కాదని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు నిబంధన తొలగించి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు.



అదేవిధంగా ల్యాండ్ ఎలిజిబిలిటీ కార్డుల ద్వారా అనేక వేలమంది సన్న చిన్న కారు రైతులు రుణాలు పొందారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి రుణమాఫీ జరిగే అవకాశం లేదని, తక్షణమే ల్యాండ్ ఎలిజిబిలిటీ కార్డు ద్వారా రుణాలు పొందిన రైతులందరికీ కూడా రుణమాఫీని అమరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఒక ఎకరం భూమి ఉన్న రైతులను కలిపి జేఎల్జి అనే గ్రూపులు ఏర్పర్చి దానిద్వారా రైతులకు రుణాలు ఇచ్చారని, అటువంటి రైతులకు రుణమాఫీలు ప్రభుత్వ ఏం చేయదలుచుకుందని ప్రశ్నించారు. సుమారు 16 లక్షల మంది తెలంగాణలో కౌలు రైతులు ఉన్నారని, వీరికి ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించే ప్రయత్నం చేయటం లేదని, దానివల్ల నిజంగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతుల కు అటు గిట్టుబాటు ధర రాక ఇటు రైతు భరోసా అందగా రుణాలు మాఫీ కాక మరింతగా అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కౌలు రైతును గుర్తించి వారికి పంట రుణాలు పెట్టుబడి సాయం రుణమాఫీ అందజేయాలని అన్నారు.

రేషన్ కార్డులు ఇళ్ల స్థలాలు ఇంటి నిర్మాణానికి డబ్బులు పెన్షన్లు పోడు భూములకు పట్టాలు తదితర సమస్యలపై ఈనెల 22న తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నట్లు, 29న జిల్లా కలెక్టరేట్ల ముందు ఆందోళనకి నిర్వహించాలని ఆగస్టు 21న చలో హైదరాబాద్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.రంగయ్య, చిన్న చంద్రన్న, గుమ్మడి నరసయ్య, వీ. ప్రభాకర్, గోకినపల్లి వెంకటేశ్వర్లు, ముద్ద బిక్షం, ఎం. కృష్ణ, రామకృష్ణ, గుర్ర అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య సివైపుల్లయ్య, అవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

నవతెలంగాణ-దమ్మపేట



ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము పేర్కొన్నారు. మండలంలోని లింగాలపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ వైఫల్యంకు సంబంధించి డిమాండ్స్‌తో కూడిన కర పత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ రుణాలు రద్దుచేయడంతో పాటు వారికి కొత్త రుణాలు ఇవ్వాలని, పంటల బీమా పథకం జూలై ఆగస్ట్ నెలలో అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని, వాస్తవ సాగుదారులందరికీ రైతు భరోసా అందించాలని కోరారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న మండల కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించాలని అదేవిధంగా ఈనెల 29న కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు తొడెం దుర్గమ్మ, పార్టీ మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, మండల నాయకులు బండి ఆదినారాయణ, వెంకటేష్, రాముడు, కుంజా కాంతారావు, కాకా రమేష్, కొండ్రు లక్ష్మి, వాడ గిరి, సున్నం పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

నవతెలంగాణ-కల్లూరు

అప్పు తీసుకున్న డబ్బులు ఎందుకు ఇవ్వట్లేదు మోటార్ సైకిల్ పై వస్తుండగా రోకలితో దాడి చేసి గాయపరిచిన విషయంపై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్కే.షాకిర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం..15న తేది రాత్రి 9:30 గంటలకు కంటిపూడి రాణి తన కుమారుడు అయిన కంటిపూడి గోవర్ధన్ మోటార్ సైకిల్ పై ఇంటికి వస్తున్నారు. మార్గం మధ్యలో శాంతినగర్ నివాసి యంగల ప్రియాంక, మోటర్ సైకిల్ ఆపి వాళ్లకు ఇవ్వాల్సిన డబ్బులు విషయంలో గొడవపడి బూతులు తిట్టి యంగల ప్రియాంక, యంగల సురేష్, యంగల సావిత్రి, యంగల వెంకటేశ్వర్లు, యంగల రాములు, గోవర్ధన్‌ను రోకలి బండతో తలపై కొట్టగా కంటి పై గాయమైనదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి రుణమాఫీ



(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ పరిణామాలపై సీఎం వారికి దిశా నిర్దేశం చేశారు.

రుణవిముక్తే లక్ష్యం

రైతును రుణ విముక్తుడిని చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. రుణమాఫీపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని వ్యాఖ్యానించారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేయలేదని గుర్తు చేశారు. లక్ష రూపాయలతో ప్రారంభమై...ఈ నెలాఖరులోగా లక్షన్నర రూపాయలు, రెండు లక్షలు ఇలా మూడు దశల్లో ఆగస్టు 15లోపు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు సీఎం ప్రకటించారు.

ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలి

రైతు రుణమాఫీ నేపథ్యంలో గ్రామ, మండల, అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సంబురాలు చేపట్టాలని సీఎం పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు లేనిచోట నియోజకవర్గ ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామ, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబురాలు జరపాలన్నారు. ఏడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి రూ.30వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారంటీని అమలు చేశామంటూ పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించాలని సూచించారు.

ఆర్థిక నిపుణులు కూడా భయ పెట్టారు

కేసీఆర్ పదేండ్లపాటు అధికారంలో ఉండి రూ.28 వేల కోట్లు కూడా మాఫీ చేయలేక పోయారని రేవంత్ విమర్శించారు. ఆగస్టు 15లోగా రైతుకు రుణమాఫీ చేస్తామని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చామని, అయితే ఆర్థిక నిపుణులు రుణమాఫీ కష్టమని తేల్చి చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని వారు హెచ్చరించారన్నారు. కానీ గాంధీ కుటుంబం మాట ఇస్తే అది తమకు శిలాశాసనమన్నారు. రైతు రుణమాఫీ చేస్తామంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ఇచ్చారనీ, ఇబ్బంది లెన్నున్నా దాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.

దేశానికి తెలంగాణ మోడల్ 'రుణమాఫీ'

వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజనీ, గురువారం సాయంత్రం నాలుగు గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతురుణాలు మాఫీ చేస్తున్నట్టు ప్రకటించారు. రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదన్నారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి ఎంతో చిత్తశుద్ధి ఉందని అన్నారు. అందుకే ఏకమొత్తంలో రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నట్టు వివరించారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే ఈ రుణమాఫీ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించాలని కోరారు.

రూపాయి, రూపాయి పోగేసి రుణమాఫీ
రేషన్‌కార్డు లేని కుటుంబాలకూ రుణవిముక్తి :
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

రైతు రుణమాఫీ అమలుకు నిద్రలేని రాత్రులు గడిపామనీ, రూపాయి, రూపాయి పోగేసి అన్నదాతలను రుణ విముక్తులను చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఆగస్టు చివరి నాటికి రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. అన్ని కుటుంబాలకూ రుణమాఫీ అవుతుందని భరోసానిచ్చారు. రేషన్ కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని చెప్పారు. అవినీతిపరుల్లో 'ఎవరినీ వదలం...ఎవరికీ అవకాశం ఇవ్వం' అని స్పష్టం చేశారు. సాహసోపేతమైన రుణమాఫీ నిర్ణయాన్ని ప్రతి పోలింగ్ బూత్, ప్రతి ఓటర్ వద్దకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ క్యాడర్‌కు విజ్ఞప్తి చేశారు.

తలెత్తుకుని ప్రచారం చేయండి

రుణమాఫీపై తల ఎత్తుకుని, ఎక్కడ తగ్గకుండా ప్రచారం చేయాలని భట్టి ఈ సందర్భంగా కోరారు. మిగులు బడ్జెట్ ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం... లక్ష రూపాయల రుణమాఫీని రు.25వేల చొప్పున.. నాలుగు దఫాలుగా పూర్తి చేసిందన్నారు. ఏడు లక్షల కోట్ల అప్పులతో అధికారం చేపట్టిన కాంగ్రెస్... రెండు లక్షల రుణమాఫీని నెలల వ్యవధిలోనే పూర్తి చేస్తున్నదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఐదు హామీలను అమలు చేశామన్నారు. అయితే వాటి అమలుపై ఆశించిన స్థాయిలో క్షేత్రస్థాయిలో ప్రచారం లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తే అంతా ఆశ్చర్యపోయారని గుర్తు చేశారు. 'సీఎం సవాల్ ఓట్ల కోసమే, ఎన్నికల సవాల్ అనుకున్నారు. కానీ అందరి అంచనాలు తలకిందులు చేస్తూ రూపాయి రూపాయి పొగేసి రుణమాఫీని అమలు చేయబోతున్నాం. కాంగ్రెస్ నేతలందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడే కార్యక్రమం రుణమాఫీ. అందువల్ల ప్రతీ గ్రామానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది' అని వివరించి రైతులు, ప్రజల హృదయాలను గెలవాలని కోరారు.

జూనియర్ విద్యార్థులపై సీనియర్ల దాడి

- చేర్యాల గురుకులంలో ఘటన మరువక ముందే అల్లాపూర్‌లో..





నవతెలంగాణ-తూప్రాన్

మరో గురుకుల పాఠశాలలో సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. మెదక్ జిల్లా తూప్రాన్ మండల పరిధిలోని అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో జూనియర్ విద్యార్థులపై ఇంటర్ సీనియర్ విద్యార్థులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేయడం కలకలం రేపింది. భోజనాలు చేసిన తర్వాత టెన్త్ క్లాస్, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు నిద్రిస్తున్న గదికి సెకండియర్ విద్యార్థులు వెళ్లారు. ఈ క్రమంలో జూనియర్లు, సీనియర్లకు మధ్య మాటామాటా పెరిగింది. జూనియర్లపై బకెట్లు, పెట్టెలు, కర్రలతో సీనియర్లు విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో ఫస్ట్ ఇయర్ విద్యార్థి రాకేష్‌కు తీవ్ర గాయాలు కాగా షణ్ముఖ్, అనిల్ స్వల్పంగా గాయపడ్డారు. రాకేష్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కళాశాల నిర్వాహకులను పోలీసులు ఆరా తీస్తున్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ సంఘటన జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

పది రోజుల కిందట చేర్యాలలో..

పది రోజుల కిందట చేర్యాల గురుకులంలోనూ ఇలాగే జరిగింది. ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్లో పదోతరగతి విద్యార్థులపై ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాడి చేసి గాయపర్చారు. దెబ్బల ధాటికి తట్టుకోలేక టెన్త్ విద్యార్థులు వీధుల వెంబడి పరుగులు తీస్తూ సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటనలో విధుల్లో ఉండి నిర్లక్ష్యం వహించిన నైట్ స్టే అధికారి పాము కృష్ణమూర్తి, వాచ్‌మెన్ లక్ష్మణ్‌కు అధికారులు మెమో జారీ చేశారు. రిజినల్ కో ఆర్డినేటర్ నిర్మల విద్యార్థులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఇలా గురుకుల హాస్టళ్లలో ఇంటర్ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై దాడులు చేయడం తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తోంది.

సీఎంను కలిసిన యూఎస్ ప్రొఫెసర్ మురళీధరన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ టాటా చాన్సలర్స్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మురళీధరన్ ముఖ్యమంత్రిని కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సైతం మర్యాద పూర్వకంగా కలిశారు.

పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలి

పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలి

- బదిలీ అయిన ఉపాధ్యాయులకు స్థానచలనం కల్పించాలి : టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) నివేదికను కమిటీ నుంచి తెప్పించుకుని వెంటనే ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ విడుదల చేయాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ 2023 జులై నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయాల్సిన పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలని అన్నారు. కర్నాటక ప్రభుత్వం 27.5 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించిందని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 2022 జులై నుంచి 2024 జనవరి వరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నాలుగు డీఏలను ప్రకటించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవు, జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్ రుణాలు, ఉద్యోగ విరమణ అనంతరం చెల్లించాల్సిన బిల్లులు రెండేండ్లుగా చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇప్పటికీ ప్రభుత్వం చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాబట్టి వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉపాధ్యాయుల పదోన్నతుల్లో మిగిలిపోయిన ఖాళీల్లో వెంటనే పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగానికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బదిలీల్లో సమయాభావం వల్ల ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చే సందర్భంలో జరిగిన పొరపాట్ల వల్ల దూర ప్రాంతాలకు వెళ్ళిన వారికి న్యాయం చేయాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయు లందరినీ వెంటనే విడుదల చేయాలని చెప్పారు. ఒక వేళ ఉపాధ్యాయులు అవసరమైతే తదుపరి సర్దుబాటు చేయాలని సూచించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ అన్ని గురుకులాల్లో జరుగుతున్న పదోన్నతులు, బదిలీల్లో సీనియార్టీ జాబితాల్లో తప్పులవల్ల సీనియర్లకు పదోన్నతి రాకుండా నష్టం జరుగుతున్నదని చెప్పారు. కాబట్టి సీనియార్టీ జాబితాలను తప్పుల్లేకుండా చేసి అందరికీ న్యాయం జరిగేటట్టు చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా వారి జిల్లాలకు ఖాళీలను బట్టి బదిలీలు చేయాలని కోరారు. కేజీబీవీ నూతన నియామకాలు చేపట్టక ముందే ప్రస్తుతం పనిచేస్తున్న వారికి బదిలీలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశాల్లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, సిహెచ్ దుర్గా భవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎ వెంకటి, కె సోమశేఖర్, ఎం రాజశేఖర్‌రెడ్డి, వి శాంతికుమారి, డి సత్యానంద్, ఆర్ రంజిత్ కుమార్, ఈ గాలయ్య, బి రాజు, కె రవికుమార్, ఎస్ రవిప్రసాద్‌గౌడ్, ఎస్ మల్లారెడ్డి, జి నాగమణి, వై జ్ఞానమంజరి, జె యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే 'కస్తూర్బా'లు

- కల్వకుర్తి సమీపంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కడ్తాల్‌లో కస్తూర్బా విద్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు





నవతెలంగాణ-ఆమనగల్

కాంగ్రెస్ హయాంలోనే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ప్రారంభించినట్టు ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో రూ.3.35 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం మంత్రులు శ్రీధర్ బాబు జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు గర్వించేలా చేయాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కల్వకుర్తి సమీపంలో రూ.800 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రూప్-1 పరీక్షలను సజావుగా నిర్వహించలేకపోయిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఇప్పుడు పోటీ పరీక్షలు వాయిదా వేయాలని కుట్రలు చేస్తోందని అన్నారు. నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా డీఎస్సీతోపాటు అన్ని పోటీ పరీక్షలు నిర్ణీత సమయంలో కొనసాగుతాయని వివరించారు. ఏటా నిర్వహించే ఉద్యోగాల భర్తీ విషయమై త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. అన్ని సమస్యలను అధిగమించి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా నేటి నుంచి ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.31 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తామని అన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్య ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి దేశానికే తలమానికంగా ఎదగాలని సూచించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గంలోని చెర్యాకర్ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం వందెకరాల స్థలాన్ని గుర్తించినట్టు చెప్పారు. అదేవిధంగా డీ 82 (కేఎల్ఐ) కాల్వ ద్వారా నియోజకవర్గంలో 35వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పొల్యూషన్ కమిటీ సభ్యులు బాలాజీ సింగ్, జిల్లా కలెక్టర్ శశాంక్, అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డీఓ సూరజ్ కుమార్, జిల్లా విద్యాధికారి సుశిందర్ రావు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామేశ్వరీ దేవి, ఎంఈఓ సర్దార్ నాయక్, తహసీల్దార్ ముంతాజ్, ప్రిన్సిపాల్ అనిత, ఏటీడీఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 'బు అబ్దుల్లా' కంపెనీ పెట్టుబడులు

- టీ హబ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దుబాయికి చెందిన ప్రముఖ సంస్థ 'బు అబ్దుల్లా' రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లోని టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు 'బు అబ్దుల్లా' అంగీకారం తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక వ్యాపార రంగాల్లో పెట్టుబడులు పెట్టి రికార్డులను సొంతం చేసుకున్న ఈ సంస్థ టీ కన్సల్ట్‌తో కలిసి పని చేయడానికి ముందుకు రావడం పట్ల సంస్థ చైర్మెన్ సందీప్ కుమార్ మక్తాలా సంతోషం వ్యక్తం చేశారు. వ్యాపార విస్తరణ, సహకారం, అభివృద్ధికి ఈ ఒప్పందం వారధిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

నేటినుంచి డీఎస్సీ రాతపరీక్షలు

- ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సారిగా డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 11 నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 2,48,851 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు రోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు జరుగుతుంది. రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి విడతకు ఉదయం 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు గేట్లను మూసేస్తారు. రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం 1.45 గంటలకు గేట్లను మూసేస్తారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసేస్తామని అధికారులు స్పష్టం చేశారు. మొదటి విడతలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. డీఎస్సీ అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తారు. అందుకే పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.

నీటిపారుదల ప్రాజెక్టులకు రూట్‌మ్యాప్

- మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌తో ముందుకుపోతున్నామని ఆ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ ఇటీవల మహబూబ్‌నగర్ పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు 2025 డిసెంబరునాటికి ఆ జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డితోపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, నిర్మించాల్సిన ప్రాజెక్టులపై బుధవారం జలసౌధలో అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, సలహాదారు ఆదిత్యానాథ్ దాస్, ఈఎన్సీ బి అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ కృష్ణా బేసిన్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్, ఆర్‌బీఎల్ఐఎస్, జేఎస్ఎల్ఐఎస్, డిండి ఎల్ఐఎస్, ఏఎంఆర్, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ఎల్ఐఎస్ ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, నిల్వాయి ప్రాజెక్టు, పాలెంవాగు, మత్తడివాగు, ఎస్ఆర్ఎస్‌పీ ఫేజు-2, చనాకా కోరాట, లోయర్ పెన్‌గంగా, దేవాదుల, మోడీకుంటవాగు, ఎస్‌వైపీ, జేసీఆర్‌డీఎల్ఐఎస్, సీతారామా ఎల్ఐఎస్‌పై సమీక్ష చేసినట్టు తెలిపారు. వీటిని పూర్తి చేసేందుకు సుమారు రూ. 8 వేల కోట్ల పైచిలుకు ఖర్చవుతుందని చెప్పారు. అలాగే 2025 డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలన్న నిర్దేశిత లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించుకున్న తాము నీటిపారుదల శాఖకు అదనంగా మరో రూ.11 వేల కోట్లు బడ్జెట్ ప్రతిపాదనను ఆర్థిక శాఖకు పంపాలని నిర్ణయించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ. 28 వేల కోట్లు నీటిపారుదల శాఖకు కేటాయించగా, గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాల పేరుతో చేసిన అప్పులకు కడుతున్న వడ్డీయే రూ.18 వేల కోట్లు అని చెప్పారు. మరో రూ. 2వేల కోట్లు జీతభత్యాలకు ఖర్చవుతున్నాయని మంత్రి తెలిపారు. అవసరం మేరకు అదనపు నిధులతో ముందుకు సాగుతామన్నారు. ఇప్పటికే పూర్తికావొచ్చిన వాటిని ఏ కేటగిరీలో, ఆ తరువాత పనులు మధ్యలో ఉన్నవి బీ కేటగిరీలో, పనులు ప్రారంభంలో ఉన్నవి సీ కేటగిరీగా విభజించినట్టు తెలిపారు. ఏ విభాగంలో రూ.240.66 కోట్లతో 47,882 ఎకరాల ఆయకట్టును సేద్యంలోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించారు. అలాగే ఆన్ గోయింగ్ ప్రాజెక్టులుగా నిర్మితమవుతున్న ప్రాజెక్టులకు రూ.7500 కోట్ల అంచనా వ్యయంతో 5,84,770 ఎకరాల ఆయకట్టు భూమిని సేద్యంలోకి తీసుకురానున్నట్టు చెప్పారు. నిర్మల్ జిల్లా సదర్‌మాట్ ప్రాజెక్టును ఈ నెల చివరలో ఖమం జిల్లా రాజీవ్ కెనాల్(సీతారామప్రాజెక్టు)ను ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు తెలిపారు.

రుణమాఫీ.. సాఫీయేనా..!

- మార్గదర్శకాల్లో రేషన్‌కార్డుతో లింకు
- మౌఖికంగా లేదంటున్న మంత్రులు
- కుటుంబం ప్రామాణికతతో లక్షల్లో అనర్హులుగా మారుతున్న రైతులు
- రీషెడ్యూల్ విధానం కరెక్ట్ కాదంటున్న రైతులు, రైతుసంఘాలు
- విధివిధానాల సవరణ కోసం ఆందోళనలు
- నేటి నుంచి రూ.లక్షలోపు రుణాల మాఫీ.. సోషల్ మీడియాలో లిస్టు చక్కర్లు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రుణమాఫీ అమలు సాఫీగా సాగేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతులను యూనిట్‌గా తీసుకుంటామని చెప్పి.. మార్గదర్శకాల్లో మాత్రం కుటుంబాన్ని ప్రాతిపదికగా నిర్ధారించడం ప్రభుత్వాన్ని విమర్శలకు గురిచేస్తోంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేండ్లలో రైతులు తీసుకున్న రుణాన్ని రూ. రెండు లక్షలు మాఫీ చేస్తామని ప్రభుత్వం మాటిచ్చింది. ఇందుకు రూ.31వేల కోట్లు కేటాయించింది. 47 లక్షల మంది రైతులను లబ్దిదారుగా సూచించింది. అయితే, రేషన్‌కార్డుతో లింకు చేయడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రేషన్‌కార్డు కేవలం కుటుంబ సభ్యులను తేల్చడానికేనని మంత్రులు మౌఖికంగా చెబుతున్నారు.. మార్గదర్శకాల్లో సవరణలు మాత్రం చేయలేదు. దాదాపు పదేండ్లుగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో లక్షలాది మంది అర్హులు కూడా అనర్హులుగా మారే ప్రమాదం ఉందని రైతుసంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం, బ్యాంకర్ల ఒత్తిడి మేరకు రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు మాఫీ వర్తించకపోవడాన్ని కూడా పలువురు తప్పుపడుతున్నారు.

కొర్రీలు లేకుండా వర్తింపజేయాలని డిమాండ్లు

ఎలాంటి కొర్రీలు లేకుండా రుణమాఫీని వర్తింపజేయాలనే డిమాండ్ తీవ్రంగా ఉంది. ఈ పథకంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు.. మార్గదర్శకాల్లో లోపాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు రూ.లక్షలోపు రుణాలను గురువారం సాయంత్రానికి అకౌంట్లలో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో 'క్రాప్‌లోన్ వేయివర్ 2024- ఫేస్‌వన్ ఫార్మర్స్ డేటా' పేరుతో ఓ పీడీఎఫ్ ఫైల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఖమ్మం జిల్లాలో 1,302 పేజీలతో 57,857 మంది రైతులను లబ్దిదారులుగా గుర్తిస్తూ మండలాలు, క్లస్టర్లు, రైతుల పేర్లతో కూడిన జాబితా ఒకటి సర్క్యులేట్ అవుతుండటంతో పలువురు దీనిపై చర్చించుకుంటున్నారు. ఈ జాబితాలో ఇది వరకే మాఫీ అయిన రైతుల పేర్లు ఉండటం మరో చర్చకు దారితీస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కొత్తగా జారీ చేసిన పట్టాదార్ పాస్‌పుస్తకాల రైతుల పేర్లు మాత్రమే అర్హుల జాబితాలో ఉండటం గమనార్హం. కొన్నిచోట్ల దీనిని ఏవోలు షేర్ చేయడంతో ఇది అధికారిక జాబితాగా ప్రచారమవుతోంది.

విధివిధానాల సవరణ కోసం..

రైతు రుణమాఫీ విధివిధానాలను సవరించాలని పలుచోట్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. విపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల నిరసనలు తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. బుధవారం సెలవు దినం కావడంతో గురువారం ఈ ఆందోళనలు మరింత ఉధృతంగా కొనసాగే అవకాశం ఉంది.

కుటుంబం.. రేషన్‌కార్డు అంశంపై విమర్శలు

రూ.2లక్షల్లోపు రుణాలు మాఫీ అవుతుండటంపై అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వ మార్గదర్శకాల్లో కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం.. వారిని రేషన్‌కార్డు ఆధారంగా గుర్తిస్తామనడంతో కొందరిలో ఆందోళన నెలకొంది. గతంలో కుటుంబాన్ని నిర్ధారించేందుకు రేషన్‌కార్డును ప్రాతిపదికగా తీసుకుంటే.. 10 ఏండ్లుగా కొత్త కార్డులు జారీ కాలేదు. ఈ పదేండ్లలో వివాహాలు చేసుకుని వేర్వేరుగా ఉంటున్న సన్నకారు రైతుల్లో సందేహాలు నెలకొన్నాయి. మార్గదర్శకాల్లో ఉన్న ఈ నిబంధనను పూర్తిస్థాయిలో ఎత్తివేస్తామని ప్రభుత్వం ప్రకటించలేదు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం మౌఖికంగా రేషన్‌కార్డుతో సంబంధం లేదని చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు విచారించి రేషన్‌కార్డు లేని రైతులను ధ్రువీకరిస్తారని అంటున్నారు. అలాగే, ఏజెన్సీ ప్రాంతంలో పట్టాదారు పాస్‌పుస్తకం లేని రైతులకు కూడా మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మిగతా మంత్రులూ అదేరకంగా ప్రకటన చేస్తున్నారు. అయితే, మౌఖికంగా ఉన్న ఈ అంశాలు మార్గదర్శకాల్లో స్పష్టంగా లేకపోవడంపై అనుమానాలు నెలకొన్నాయి.

ప్రారంభ గడువుతో పలువురికి అనర్హత

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.లక్షలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని నాటి కేసీఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక రుణమాఫీ పథకం ఆచరణలో రకరకాల కొర్రీలు పెట్టింది. ఏకకాలంలో కాకుండా విడతల వారీ అమలుతో అర్హతున్నా చాలా మంది రైతులు అనర్హులయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. నాడు కేసీఆర్ సర్కారు ఏ కటాఫ్ తేదీ (2018 డిసెంబర్ 11)తో ముగించిందో ఆ మరుసటి రోజు (2018 డిసెంబర్ 12) నుంచి రూ.2లక్షల పంట రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. 2018 డిసెంబర్ 12 నుంచి సోనియాగాంధీ పుట్టిన రోజైన 2023 డిసెంబర్ 9వ తేదీని కటాఫ్‌గా ప్రకటించింది. ముగింపు తేదీ విషయంలో రైతులకు ఎలాంటి అభ్యంతరమూ లేకపోయినా కటాఫ్ డేట్స్ ప్రారంభ తేదీ (2018 డిసెంబర్ 12)ని మార్చు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మార్గదర్శకాలను సవరించి 2023 డిసెంబర్ 9లోపు రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయాల్సిందిగా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రీషెడ్యూల్‌తో మరికొందరు అనర్హులు

రీషెడ్యూల్ విధానంతో మరికొందరు అనర్హులుగా మారే ప్రమాదం ఉంది. 2008-09లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పంట నష్టపోయిన రైతుల రుణాలను రీషెడ్యూల్ చేశారు. ఉదా: లక్ష పంట రుణం ఉంటే దానిని నాలుగు విడతలుగా రూ.25వేల చొప్పున చెల్లించాలని సూచించారు. ఆ రైతులకు రూ.50వేల లోన్‌ను తిరిగి ఇచ్చారు. అలా పునరుద్ధరించిన రుణాలు కమర్షియల్ బ్యాంకుల్లో అధికంగా ఉన్నాయి. అప్పటి నుంచి కొనసాగుతున్న రీషెడ్యూల్ రుణాలకు మాఫీ వర్తించకపోవడంతో పలువురు అర్హత కోల్పోతున్నారు

సావిత్రిని గుర్తుచేసే నటన

సినీ రంగంలో అతి తక్కువ కాలంలో గొప్ప పేరు తెచ్చుకోవడం అంత తేలికైన పని కాదు. అలాగే ఒక్కసారి ఫేమ్ వచ్చిన తర్వాత దాన్ని ఎక్కువ కాలం నిలుపుకోవడం కూడా అంత సులువు కాదు. ఇలాంటి నటులు అతి తక్కువ మంది ఉంటారు. అలాంటి వారిలో సౌందర్య ఒకరు. తెలుగు సినీ పరిశ్రమలో ప్రభావవంతమైన నటీమణులలో ఆమె కూడా ఒకరు. తన అద్భుతమైన నటన, చెరగని చిరునవ్వుతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేశారు. ఈ రోజు ఆమె జన్మదినం సందర్భంగా ఆమె నటనా ప్రస్థానం నేటి మానవిలో...



సౌందర్య సొంతూరు బెంగుళూరు. తండ్రి కె.ఎస్. సత్యనారాయణ అయ్యర్, కన్నడ సినీ నిర్మాత. తల్లి మంజుల. ఈమె అసలు పేరు సౌమ్య. సినీరంగంలోకి ప్రవేశించిన తర్వాత సౌందర్యగా మార్చుకున్నారు. తండ్రి సినీ రంగంలో ఉండడంతో పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే ఆమె మొదటి చిత్రంలో నటించారు. ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో ఉండగా ఆమె తండ్రి స్నేహితుడు గంధర్వ చిత్రంలో నటించేందుకు ఆమెకు అవకాశం ఇచ్చారు. తర్వాత 'మనవరాలి పెళ్లి' సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత తెలుగులో నటించిన అమ్మోరు విజయవంతంగా కావడంతో చదువు మధ్యలోనే ఆపేసి సినీ రంగంలోకి వచ్చేశారు. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు. తెలుగు చిత్రపరిశ్రమలో మంచి పేరు ప్రఖ్యాతులు గడించి విజయఢంకా మోగించారు.

ఆరు ఫిల్మ్‌ఫేర్‌లు...

వెంకటేష్ సరసన రాజా, జయం మనదేరా, పెళ్ళి చేసుకుందాం, పవిత్రబంధం వంటి సూపర్ హిట్ సినిమాలలో నటించి ప్రశంసలందుకున్నారు. వారిద్దరూ తెలుగు సినిమా పరిశ్రమలో అత్యంత విజయవంతమైన జంటగా గుర్తింపబడ్డారు. సౌందర్య మొదటి నుండి అందాల ప్రదర్శనకి బద్ధ వ్యతిరేకి. తెలుగు ప్రజలు ఆమెనెప్పటికీ మరువలేరు. పన్నెండ్ల అచిరకాలంలోనే సౌందర్య ఆరు ఫిల్మ్ ఫేర్ పురస్కారాలను అందుకున్నారు. అవి అమ్మోరు (1994), అంత:పురం (1998), రాజా (1999), ద్వీప (2002) (ఉత్తమ నిర్మాత విభాగాల్లో రెండు పురస్కారాలు), ఆప్తమిత్ర (2004), కర్ణాటక ప్రభుత్వం నుండి నాలుగు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు.

పరిశ్రమలో లైట్ బాయ్ స్థాయి నుండి ప్రతి ఒక్కరినీ ఆదుకునే మనిషిగా సౌందర్యకు మంచి పేరు ఉంది. వీటన్నింటి మూలంగానే కాక అభిమానుల హృదయాలలోనూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది. సౌందర్యని తెలుగింటి ఆడపడుచుగా ఆదరించారు. ఆమెను జూనియర్ సావిత్రి అంటారు. సౌందర్యకు నవరసనటన మయూరి అనే బిరుదు గలదు.

సేవచేయడమంటే ఇష్టం

హిందీ చిత్రం సూర్యవంశంలో అమితాబ్ బచ్చన్‌తో నటించి మెప్పించారు. అన్ని దక్షిణాది భాషల్లో ప్రముఖ హీరోలతో నటించారు. పేరుకు తగ్గట్టుగా ఆమె మనసు కూడా సౌందర్యమే. చిన్నతనం నుండి ప్రజలకు సేవ చేయాలనే భావన ఎక్కువగా ఉండేది. అందుకే చిత్ర పరిశ్రమలోకి వచ్చిన తర్వాత అనేక సేవా కార్యక్రమాలు కూడా చేసేవారు. ఈమె మేనమామ, తన బాల్య స్నేహితుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అయిన జి.ఎస్.రఘును ఏప్రిల్ 27న వివాహం చేసుకున్నారు. భర్త, ఆడపడుచు సహకారంతో 'అమర సౌందర్య సోషియల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ద్వారా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారు. కర్ణాటక ములబాగల్ తాలూకాలోని తమ గ్రామం గంగికుంటను అభివృద్ధి పరిచారు. ఓ అనాథ ఆశ్రమాన్ని, 'అమర సౌందర్య విద్యాలయం' పేరుతో ఓ పాఠశాలను కూడా ప్రారంభించారు. ఆమె మరణించిన తర్వాత కూడా వీరి కుటుంబం ఇప్పటికీ ఈ విద్యాలయాలకు ధన సహాయం చేస్తూనే ఉంది.


నటనకు పట్టాభిషేకం

తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం చిత్రాలతో పాటు ఒక హిందీ చిత్రంలోనూ నటించారు. పవిత్రబంధం చిత్రంలో ఆమె స్వాభిమానం కల యువతిగా రాధ పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకుల మనసు దోచుకోవడమే కాక ఈ చిత్రానికి బంగారు నంది అవార్డును అందుకున్నారు. గిరీష్ కాసరవల్లి దర్శకత్వంలో ద్వీప అనే కన్నడ చిత్రాన్ని నిర్మించారు. ఈచిత్రం జాతీయ పురస్కారాలలో ఉత్తమ చిత్రానికి గాను స్వర్ణకమలంతో పాటు పలు పురస్కారాలు అందుకుంది. ఈ చిత్రానికి కర్ణాటక ప్రభుత్వం నుండి ఉత్తమ నటి, ఉత్తమ చిత్రం, ఉత్తమ ఛాయా చిత్రగ్రహణానికిగాను పురస్కారాలు లభించాయి. పలు అంతర్జాతీయ చిత్రోత్సవాలలో కూడా ప్రదర్శించబడింది. పెళ్లి చేసుకుందాం రా సినిమాలో అత్యాచారానికి గురైన శాంతి పాత్రలో సమాజం నుండి ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు, వాటిని అధిగమించడానికి ఆమె పోరాటం ఈ చిత్రంలో హైలైట్ అని చెప్పవచ్చు.

ఎప్పటికీ నిలిచి ఉంటారు

2004లో లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు ఏప్రిల్ 17వ తేదీన బెంగుళూరులోని జక్కూరు విమానాశ్రయం నుండి తెలంగాణలోని కరీంనగర్ వచ్చేందుకు చార్టెర్డ్ విమానంలో బయలుదేరారు. ఆ విమానంలో సౌందర్య, ఆమె సోదరుడు అమరనాథ్ ఉన్నారు. విమానం గాలిలోకి ఎగిరిన కొన్ని క్షణాలకే పక్కనే ఉన్న గాంధీ విశ్వవిద్యాలయం ఆవరణలో కుప్పకూలిపోవడంతో సజీవ దహనం అయ్యారు. అలా సహజ నటి నటనకు తెలుగు ప్రేక్షకులు దూరమయ్యారు. సౌందర్య మరణించిన తర్వాత కుటుంబ సభ్యుల మధ్య కొన్ని ఆస్తి తగాదాలు జరిగి కోర్టు వరకు వెళ్ళారు. చివరకు ఆ సమస్యలు సద్దుమణిగాయి. ఏది ఏమైనా అలనాటి మహానటి సావిత్రిని గుర్తు చేసే నటన సౌందర్యది. 100కు పైగా చిత్రాలలో నటించి అనేక అవార్డులు గెలుచుకున్నారు. భౌతికంగా ఆమె మనకు దూరమైనా ఆమె చేసిన పాత్రలతో ఎప్పుడు ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు.

- పాలపర్తి సంధ్యారాణి.





ఇట్ల చేద్దాం

ఎండు కొబ్బరి సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్ల చల్లి కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి.

కంటి జాగ్రత్తలు ఇలా!

మీ చేతులను తరచుగా సబ్బుతో కడుక్కోండి, మీ కళ్ళను చేతితో తాకకుండి. టవల్, కాంటాక్ట్ లెన్స్‌లను వేరే వారితో షేర్ చేసుకోవద్దు. వర్షం, గాలి నుంచి మీ కళ్ళను రక్షించడానికి సన్ గ్లాసెస్ లేదా గ్లాసెస్ ఉపయోగించండి. మీ కళ్ళు తడిగా ఉంటే వాటిని శుభ్రమైన, పొడి గుడ్డతో తుడవడం ద్వారా వాటిని పొడిగా ఉంచండి. అవసరమైతే శుభ్రమైన, ఫిల్టర్ చేసిన నీటితో మీ కళ్ళను కడగాలి. పరిశుభ్రత సరిగా లేని కొలనుల వంటి నీటి ప్రదేశాల్లో ఈత కొట్టకూడదు. బ్యాక్టీరియా పెరుగుదలను నివారించడానికి మీ నివాసం, పని ప్రదేశాలను శుభ్రంగా ఉంచండి. మీ లెన్స్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోండి.

వర్షాకాలంలో కంటి ఇన్‌ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. తేమ, వర్షపు నీరు, బాక్టీరియా, వైరస్‌ల పెరుగుదల చాలా ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. వర్షాకాలంలో వచ్చే కొన్ని సాధారణ కంటి ఇన్ఫెక్షన్లను తెలుసుకుందాం.

కంజెక్టివైటిస్

దీనినే పింక్ ఐ అని కూడా పిలుస్తారు, ఇది సాధారణంగా వైరస్‌లు లేదా బ్యాక్టీరియా వల్ల వస్తుంది. కండ్లు ఎరుపు రంగులోకి మారి దురద వస్తుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది.

డాక్రియోసిస్టిటిస్

ఈ రకమైన ఇన్ఫెక్షన్, టియర్ (లాక్రిమల్) గ్రంథిలో ఏదైనా అడ్డుపడటం వల్ల ఏర్పడుతుంది. కన్ను నొప్పిగా ఉండటం, ఎర్రగా అవ్వడం, కన్ను లోపల వాపు ఉండటం దీని లక్షణాలు.

బ్లేఫరిటిస్(కనురెప్పల ఉబ్బడం)

బ్లెఫారిటిస్ వల్ల కనురెప్పలు వాపుగా ఉంటాయి. ఈ రకమైన ఇన్‌ఫెక్షన్‌లో కన్ను ఎర్రగా అవుతుంది. కన్ను దురదగా ఉండటం, కనురెప్పలు ఉబ్బి ఉంటాయి.

కంటికురుపు

హార్డియోలమ్ అని కూడా పిలుస్తారు. ఇది కనురెప్పలో తైల గ్రంథుల ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. సాధారణంగా స్టెఫిలోకాకస్ బ్యాక్టీరియా వల్ల ఇన్‌ఫెక్షన్ వస్తుంది. దీని వల్ల కన్ను ఎరుపు రంగులోకి మారి, కురుపు ఏర్పడి నొప్పి ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలి.

మేడి పండు చందంగా ఆర్థిక వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

వేమన పద్యం గుర్తుంది కదా. భారత ఆర్థిక వ్యవస్థ కూడా ఇప్పుడు అలాంటి సమస్యలనే ఎదుర్కొంటోంది. అవి చిన్నా చితకా సమస్యలు కావు. పెద్దవే. దేశ ఆర్థిక వ్యవస్థ పరిణామాన్ని లెక్కించే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గడచిన ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ సర్దుబాటుతో 8.2 శాతం పెరిగింది. అయితే అదే సంవత్సరంలో ప్రైవేటు వినియోగ వ్యయం (వస్తువులు, సేవల కొనుగోలు కోసం మనం పెట్టే ఖర్చు) కేవలం 4 శాతం మాత్రమే పెరిగింది. 2002-03 తర్వాత వినియోగ వ్యయం ఈ స్థాయిలో నెమ్మదించడం ఇదే మొదటిసారి.



పడిపోయిన ఆర్థికేతర సంస్థల అమ్మకాలు

దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు వినియోగ వాటా 55-60 శాతం ఉండడం ఆందోళన కలిగించే విషయం. అయితే ప్రజల వినియోగ వృద్ధిలో మందగమనం కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాల్లో కన్పించదు. 2023-24లో స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన 3,900కు పైగా ఆర్థికేతర సంస్థల నికర అమ్మకాలు కేవలం ఒక శాతం మాత్రమే పెరిగాయి. ఈ పెరుగుదల 2021-22లో 34.9 శాతం, 2022-23లో 22.6 శాతంగా నమోదైంది.

గోప్యంగా జీఎస్టీ వసూళ్లు

ఇటీవలి కాలంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల మందగించాయి. మేలో జీఎస్టీ వసూళ్లు కేవలం 9.96 శాతం మాత్రమే పెరిగాయి. 2021 తర్వాత జీఎస్టీ వసూళ్లలో వృద్ధి పది శాతం కంటే తగ్గడం ఇదే మొదటిసారి. జూన్‌లో ఈ పెరుగుదల కేవలం 7.8 శాతంగానే నమోదైంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇప్పుడు జీఎస్టీ వసూళ్ల సమాచారాన్ని విడుదల చేయడం లేదు. జీఎస్టీ వసూళ్లలో తగ్గుదలను గమనిస్తే జనాభాలో ఎక్కువ మంది వినియోగ వస్తువుల కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారని అర్థమవుతోంది. ద్రవ్యోల్బణం అధికంగా ఉండడమే దీనికి కారణం. పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం తగ్గుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగానే ఉంటోంది. గత ఆర్థిక సంవత్సరంలో పట్టణ ద్రవ్యోల్బణం 5.1 శాతం ఉండగా గ్రామీణ ద్రవ్యోల్బణం 5.6 శాతంఉంది.

రెండు వేల ఉద్యోగాలు.. 25 వేల మంది హాజరు

(మొదటిపేజీ తరువాయి)

లోడర్స్ అవసరం ఉంటుంది. వారికి నెలకు రూ.20వేల నుంచి 25 వేలకు వేతనం అందిస్తారు. ఓవర్‌టైమ్ చేసి చాలామంది రూ.30వేల వరకు సంపాదిస్తుంటారు. ఈ ఉద్యోగానికి కనీస విద్యార్హతలు ఉంటే సరిపోతుంది కానీ, అభ్యర్థులు శారీరకంగా ధృఢంగా ఉండటం తప్పనిసరి. అయితే ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు కొందరు 400 కి.మీ. ప్రయాణించి రావడం గమనార్హం. వారిలో పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ పూర్తి చేసినవారు కూడా ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా ఇప్పటివరకు ఉద్యోగం లభించని వారూ ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చారు. మరికొందరు రాజస్థాన్ నుంచి వచ్చిన వారున్నారు.

రుణమాఫీ మార్గదర్శకాలు సవరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉండదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అందరికీ రుణమాఫీని వర్తింపజేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పుడు వారిని విస్మరించిందన్నారు. చిన్న, సన్నకారు రైతులందరూ ఈ పథకంలో లబ్ధిపొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ లియబిలిటీ గ్రూపులుగా కౌలుదార్లను రూపొందించి ఈ పథకాన్ని వారికి వర్తింపజేయాలన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర నష్టాలు వచ్చినప్పుడు ప్రభుత్వం రుణాలను రీషెడ్యూల్ చేస్తుందని, అలాంటప్పుడు రీషెడ్యూల్‌కు రుణమాఫీ వర్తింపజేయకపోవడమేమిటని రాఘవులు ప్రశ్నించారు. రీషెడ్యూల్ చేసిన రుణాలను కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుమిత్ర గ్రూపుల్లో చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులున్నారన్నారు. రైతుమిత్ర గ్రూపులు రుణాలు తీసుకోవడానికి అర్హులవుతారు కానీ, రుణమాఫీకి అనర్హులవుతారా ? అని ప్రశ్నించారు. తొలుత రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రకటించారని, విమర్శలు రాగానే పట్టాదారు పాసుపుస్తకమని చెబుతున్నారని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేవన్నారు. వీరంతా నష్టపోయే ప్రమాదముందని, పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోయినా, పహాణిలో పేరున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

త్వరితగతిన కులగణన చేపట్టాలి..

ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో కులగణనకు ఐదు నెలలు పట్టే అవకాశముందని అధికారులు చెప్పినట్టు తెలిసిందని, అవసరమైతే ఎక్కువ మంది సిబ్బందిని పెట్టి త్వరితగతిన కులగణన పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని రాఘవులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ జనగణనకు సంబంధం లేకుండా కులగణన చేపడతామని హామీనిచ్చిందని గుర్తు చేశారు. 2021లో కేంద్రం జనగణన చేయాల్సి వుండగా చేయలేదన్నారు. జనగణనతో పాటు కులగణన చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తూ వచ్చిందన్నారు. బీసీల రిజర్వేషన్లు వివాదాస్పదం అవుతున్నందున వెంటనే కుల గణన చేసి రిజర్వేషన్లను నిర్ధయించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కులగణనకు ఎక్కువ సమయం పడుతున్నందున.. ముందుగా ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అందువల్ల వెంటనే కులగణన షెడ్యూల్ ప్రకటించి.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

సీఎం రేవంత్ జోక్యం చేసుకోవాలి

వరంగల్, హన్మకొండ, కాజీపేట నగరాల్లో చెరువులను ఆక్రమించుకుని ఇండ్లు నిర్మించుకున్నారంటూ మున్సిపల్ అధికారులు నోటీసులివ్వడాన్ని రాఘవులు తప్పుపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. హైకోర్టు తీర్పు పేరిట ఇలాంటి చర్యలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వమే పట్టాలిచ్చి, వారందరూ ఇండ్లను నిర్మించుకున్నాక.. అనర్హులని ఖాళీ చేయాలనడం సరైంది కాదన్నారు. అవసరమైతే ప్రభుత్వం కోర్టులో మళ్లీ అప్పీల్ చేయాలన్నారు. ఈ విషయం కేవలం వరంగల్ నగరానికే పరిమితం కాదని, భవిష్యత్‌లో మరిన్ని నగరాలకు వ్యాపించే అవకాశం లేకపోలేదన్నారు.

ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు ఈ విషయంలో తొందరపాటుతో వ్యవహరించొద్దన్నారు. ప్రభుత్వం పట్టాలిస్తేనే అక్కడ నిరుపేదలు వేలాది రూపాయలు వెచ్చించి ఇండ్లను నిర్మించుకున్నారని, స్వాతంత్ర్య సమరయోధులు, వితంతువులు, జర్నలిస్టులు, మాజీ సైనికుల కుటుంబాలకు ఇచ్చిన పట్టా స్థలాల్లోనే ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, ఎం.చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్, కాడబోయిన లింగయ్య, జి.రాములు, దీప ఉన్నారు.

ఆ ఎమ్మెల్యేలు మాజీలయ్యే వరకు నిద్రపోం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం రామచంద్రాపురం పట్టణంలోని భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 2001లో కేసీఆర్ పిడికెడు మందితో ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. "అప్పుడు కూడా కుట్రలు జరిగాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 12మంది ఎమ్మెల్యేలను లాక్కున్నారు.. కానీ న్యాయం గెలిచింది. కేసీఆర్ 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందన్న వాళ్లు తర్వాత కనిపించకుండా పోయారు. పార్టీకి కష్టాలు వస్తాయి. మీరు ధైర్యంగా ఉండండి. మీ బాధ్యత నేను తీసుకుంటా.." అని కార్యకర్తలకు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పోతే పార్టీకి ఎటువంటి నష్టం లేదని.. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడితేనే మహిపాల్ రెడ్డి గెలిచారని, పటాన్‌చెరుకు ఏం కావాలంటే అది ఇచ్చామని, రోడ్లు, తాగునీళ్లు, స్టేడియం వంటి ఎన్నో అందించామని.. అయినా ఎమ్మెల్యే పార్టీ మారడం సరైన పద్ధతి కాదన్నారు. మహిపాల్ రెడ్డికి మూడుసార్లు టికెటిచ్చి గెలిపిస్తే పార్టీ మారడానికి మనసెలా వచ్చిందని ప్రశ్నించారు. కార్యకర్తలకు ధైర్యం చెబుదామని వచ్చిన.. కానీ నాకే మీరు వేలాది మందిగా తరలివచ్చి ధైర్యం చెప్పారని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసుకుందాం.. మళ్లీ గులాబీ జెండా ఎగిరేవరకు కష్టపడి పనిచేద్దామని అన్నారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టండి అన్న రేవంత్.. ఇప్పుడు తానే ఇండ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట ఉప ఎన్నికలు కచ్చితంగా వస్తాయి. దానికి ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు.

రేషన్ కార్డు ఆధారంగా రైతు రుణమాఫీ అని చెప్పి.. వ్యతిరేకత వస్తుందని మాట మార్చుతున్నారని అన్నారు. పాస్ బుక్ ఉంటే సరిపోతుందని నోటి మాటతో చెప్పడం కాదు.. అదే నిజమైతే జీవో మార్చాలని డిమాండ్ చేశారు. రుణమాఫీకి పీఎం కిసాన్ నిబంధనలు ఎందుకు? రేషన్ కార్డు నిబంధనలు ఎందుకు? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, కార్పొరేటర్, మున్సిపాలిటీ, అసెంబ్లీ ఎన్నికలు ఇలా ఏ ఎన్నికలు వచ్చినా కష్టపడి పనిచేసి పార్టీని గెలుద్దామని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్, బొల్లారం మున్సిపాలిటీ చైర్మెన్ రోజా బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ రెడ్డి, సోమిరెడ్డి, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో 'నైనీ' బొగ్గు ఉత్పత్తి

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నైనీ బొగ్గు బ్లాకు పనుల పురోగతిపై ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) దేవేందర్ తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నైనీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి ఒడిశా ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందించేందుకు సంసిద్ధత వ్యక్తంచేసిన నేపథ్యంలో పనుల్ని వేగవంతం చేయాలని చెప్పారు. 135 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ తొలిసారిగా తెలంగాణ వెలుపల ఈ ప్రాజెక్టు చేపడుతున్నదని తెలిపారు. మైనింగ్ సందర్భంగా స్థానికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పనుల వేగవంతం కోసం నైనీ జనరల్ మేనేజర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించి, బాధ్యతలు అప్పగించాలని సూచించారు. హై టెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణం కోసం ఆ రాష్ట్ర విద్యుత్ శాఖతో సంప్రదింపులు చేస్తూ ముందుకు సాగాలని చెప్పారు. పునరావాసం, నష్టపరిహారం అంశాలపై చర్చించే ఆర్పీడీఏసీ సమావేశాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని ఆదేశించారు.

ఒమెన్ తీరంలో

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



ఒమన్: గల్ఫ్ దేశమైన ఒమన్ సముద్ర తీరంలో విషాదం చోటుచేసుకుంది. కొమొరోస్ జెండాతో వెళ్తున్న చమురు ట్యాంకర్ బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 16 మంది నౌక సిబ్బంది గల్లంతు అయ్యారు. వీరిలో 13 మంది భారత సిబ్బంది, ముగ్గురు శ్రీలంక వాసులు ఉన్నారు. మునిగిపోయిన ఓడను ప్రెస్టీజ్ ఫాల్కాన్‌గా గుర్తించారు. పోర్టు టౌన్ దుకమ్‌కు సమీపంలోని రాస్ మద్రాకకు ఆగ్నేయంగా 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగినట్లు ఆదేశ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ పేర్కొంది. ఆయిల్ ట్యాంకర్ ముగినిపోవడానికి కారణాలు వెల్లడించలేదు. ఘటన జరిగిన సమయంలో ఓడలో 16 మంది సిబ్బంది ఉన్నట్లు తెలిపింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొంది. ఓడ మునిగిపోయి తలకిందులైనట్లు సమాచారం. అయితే సముద్రంలో చమురు ఉత్పత్తులు లీకైన విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదు. బుధవారం కూడా సహాయక చర్యలు కొనసాగాయి. ఈ చర్యల్లో పాల్గొనడం కోసం భారత సైన్యానికి చెందిన పి-81 అనే యుద్ధ నౌక కూడా బయలుదేరి వెళ్లింది.

కర్నాటకలో

'స్థానికులకే ఉద్యోగాలు'

బెంగళూరు: కర్నాటకలో 'స్థానికులకే ఉద్యోగాలు' బిల్లుపై ఆ రాష్ట్ర కార్మిక మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చింది. ఈ బిల్లు ప్రకారం ప్రయివేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ కోటాలో 70 శాతం, మేనేజ్‌మెంట్ కోటాలో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాలని చెప్పినట్టు వెల్లడించింది. కర్నాటక ప్రయివేట్ సంస్థల్లోని గ్రూప్ సీ, డీ గ్రేడ్ పోస్టుల్లో కన్నడిగులకే 100 శాతం రిజర్వేషన్లకు వీలు కల్పించే బిల్లుకు ఆమోదం తెలుపుతూ కర్నాటక మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశమైంది. సోమవారం ఈ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం లభించిన తర్వాత సీఎం సిద్ధరామయ్య ఎక్స్‌లో పోస్టు చేశారు. 'రాష్ట్రంలో నెలకొల్పిన అన్ని ప్రయివేట్ పరిశ్రమల్లో సీ, డీ గ్రేడ్ పోస్టులకు సంబంధించి 100 శాతం కన్నడిగుల నియామకాన్ని తప్పనిసరి చేసే బిల్లు కోసం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర వాసులు సుఖవంతమైన జీవనం గడిపేందుకు అవకాశం కల్పించాలని, ఈ గడ్డపై ఉద్యోగాలు కోల్పోకుండా చూడాలనేదే మా ప్రభుత్వ ఆకాంక్ష. మాది కన్నడ అనుకూల ప్రభుత్వం. వారి సంక్షేమమే మా ప్రాధాన్యం" అని ఈ పోస్టులో ముఖ్యమంత్రి తెలిపారు. దీంతో ఈ బిల్లుపై పారిశ్రామిక వేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో తాను చేసిన పోస్ట్‌ను సీఎం తొలగించారు. ప్రయివేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ రోల్స్‌లో 70 శాతం, మేనేజ్‌మెంట్ రోల్స్‌లో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాలని తాము చెప్పినట్టు కర్ణాటక కార్మిక శాఖ వివరణ ఇచ్చింది. అలాగే ముఖ్యమంత్రి కూడా రాష్ట్రంలోని ప్రయివేటు పరిశ్రమలు, ఇతర సంస్థల్లో అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో 50శాతం, నాన్- అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగాల్లో 75శాతం చొప్పున కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పించాలనే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు తాజాగా మరో పోస్ట్‌లో వెల్లడించారు.

నవచిత్రం

నేను ఆరోగ్యంగానే ఉన్నా..



ఆర్.నారాయణమూర్తి

నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్. నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన నిమ్స్ హాస్పిటల్‌లో డాక్టర్ బీరప్ప నేతృత్వంలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య నిమిత్తమై భయపడాల్సిన అవసరం లేదని, సాధారణమైన టెస్ట్‌లు మాత్రమే చేస్తున్నామని డాక్టర్ బీరప్ప తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని పేర్కొన్నారు.

బుధవారం ప్రసాద్ ల్యాబ్ వద్ద ఉన్న ఆర్ నారాయణమూర్తికి సడెన్‌గా నీరసం రావడంతో, వెంటనే అక్కడి నుంచి నిమ్స్ హాస్పిటల్‌కి చేరుకున్నారు. రెండు నెలల క్రితం ఆయన బైపాస్ సర్జరీ చేయించుకుని ఉండటంతో, డాక్టర్లు ఆయన ఆరోగ్యాన్ని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నారు. అయితే తన ఆరోగ్యం బాగోలేదని మీడియాలో వస్తున్న పలు వార్తల నేపథ్యంలో ఆర్.నారాయణమూర్తి స్పందించారు.

'నేను ఆరోగ్యంగానే ఉన్నా.. నా ఆరోగ్యం గురించి అభిమానులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నా. దేవుడి దయతో బాగానే కోలుకుంటున్నా. పూర్తిగా కోలుకున్నాక అన్ని వివరాలు చెబుతాను. అప్పటివరకు ఎలాంటి వదంతులు నమ్మవద్దు' అని నారాయణమూర్తి తెలిపారు.

ఆద్యంతం వినోదాత్మకం



ప్రియదర్శి

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకుడు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈనెల 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో ప్రియదర్శి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'కమెడియన్‌గా మొదలై సీరియస్ కథలు చేస్తూ ఈసినిమాతో లవర్ బాయ్‌గా రావడం చాలా హ్యాపీగా ఉంది. ఎందుకంటే కంటెంట్‌కి మంచి రోజులు వచ్చాయని భావిస్తున్నాను. కొత్త కథలు, వినూత్నమైన ఆలోచనలని ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. 'మల్లేశం, బలగం, సేవ్ ది టైగర్స్'కి వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే... ఫ్యామిలీ డ్రామాకి ఎప్పుడూ స్పేస్ ఉందని నిరూపించాయి. ఫ్యామిలీ డ్రామాలు ఇండియన్ సొసైటీలో ఎవర్ గ్రీన్. జనరల్‌గా మ్యారేజ్‌ని చాలా స్టీరియోటిపికెల్ అప్రోచ్‌లో చూస్తాం. డార్లింగ్ విషయానికి వస్తే.. ఉమన్ క్యారెక్టర్ స్ప్లిట్ పర్సనాలిటీ అనే స్పెషల్ కండీషన్ ఉంటుంది. దీన్ని ప్రజెంట్ చేసిన తీరు చాలా వైవిధ్యం. రెండు క్యారెక్టర్‌లు సీరియస్‌గా బాధపడుతుంటే ప్రేక్షకుడికి నవ్వొస్తుంది. డార్క్ కామెడీలో ఉన్న మ్యాజిక్ ఇది. ఇందులో అది చాలా అద్భుతంగా ఎక్స్‌ప్లోర్ చేశాం. నభా లాంటి యాక్టర్‌తో నేనెప్పుడూ పని చేయలేదు. నాలాంటి యాక్టర్‌తో తనూ ఎప్పుడూ వర్క్ చేయలేదు. మా ఇద్దరి పెయిరింగ్ చాలా ఫ్రెష్‌గా ఉందని చాలా మంది అన్నారు. ఇందులో నా క్యారెక్టర్, నభా క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. మా నిర్మాతలు నిరంజన్, చైతన్య ట్రూ డార్లింగ్స్. ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. డైరెక్టర్ అశ్విన్ రామ్‌లో మంచి లీడర్ షిప్ క్వాలిటీస్, కమ్యునికేషన్ స్కిల్స్, క్లియర్ విజన్ ఉన్నాయి. రానున్న రోజుల్లో పెద్ద డైరెక్టర్ అవుతాడు. ఈ సినిమాని అద్భుతంగా తీశాడు'.

100 రూపాయలకే సినిమా

క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నుంచి నిర్మాత రాకేష్ వర్రే నిర్మించిన చిత్రం 'పేక మేడలు'. వినోద్ కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో వస్తున్న సినిమా ఇది. ఇటీవలే వైజాగ్, విజయవాడలో వేసిన స్పెషల్ షోస్‌లో పబ్లిక్ రెస్పాన్స్ చాలా వచ్చింది. ప్రతి ఒక్కరూ సినిమా చూసే విధంగా రూ100కే టికెట్లు రేట్లు ఉండడం సినిమాకి ప్లస్. ఈ సినిమాని తెలుగులో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా నిర్మాత డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, 'ఈ సినిమా చూసి నచ్చి ఇంకా బాగా ప్రమోట్ చేయొచ్చు అనిపించింది. ఇలాంటి సినిమాని మంచిగా ప్రమోట్ చేసి ప్రేక్షకులు ముందు తీసుకెళ్తే ఇంకా పెద్ద విజయం అవుతుంది. పెద్ద సినిమాలు ఏ రేట్ పెట్టిన ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు కానీ చిన్న సినిమాలకి తక్కువ రేట్లు ఉంటే కానీ రారు. ఈ సినిమా కోసం టికెట్ రేట్లను రూ.100కు తగ్గించాం. పెద్ద సినిమాలతో పోటీ పడలేక చిన్న సినిమాలు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రేక్షకులకు మంచి సినిమాని అందించే ప్రయత్నంలోనే విజయవాడ, వైజాగ్, హైదరాబాద్‌లో పలు ప్రదేశాల్లో పెయిడ్ ప్రీమియర్స్ 50 రూపాయలకే టికెట్ రేట్ పెట్టి ఎక్కువమంది సినిమా చూసేలాగా ప్లాన్ చేశాం. చూసిన ప్రతి ఒక్కరూ కూడా సినిమా బాగుందని ప్రశంసిస్తున్నారు' అని అన్నారు. 'పెయిడ్ ప్రీమియర్స్‌కి వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉంది. 'పేక మేడలు' టీమ్ అని గుర్తుపట్టి సినిమా గురించి చాలా పాజిటివ్‌గా చెబుతున్నారు. ధీరజ్ నాకు ముందు నుంచే పరిచయం ఉన్నప్పటికీ ఈ సినిమా చూసి నచ్చి, నేను రిలీజ్ చేస్తానని ముందుకు వచ్చారు. అదేవిధంగా మా సినిమాను సపోర్ట్ చేస్తున్న రానా దగ్గుబాటి, అడివి శేష్, విశ్వక్ సేన్‌కి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఓ మంచి సినిమాని తీశామని గర్వంగా ఫీల్ అవుతున్నాం. ప్రేక్షకులకు కచ్చితంగా ఈ సినిమా నచ్చుతుంది అని ఆశిస్తున్నాను' అని నిర్మాత రాకేష్ వర్రే చెప్పారు.

భారత్ తొలి ప్రత్యర్థి పాకిస్తాన్

రేపటి నుంచి మహిళల ఆసియా కప్



ధంబుల్లా (శ్రీలంక): మహిళల ఆసియాకప్‌కు రంగం సిద్ధమైంది. మొత్తం 8జట్ల మధ్య జరిగే 2024 మహిళల ఆసియాకప్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. శ్రీలంక ఆతిథ్యమిస్తోన్న ఈ టోర్నమెంట్‌లో దంబుల్లా వేదికగా మొత్తం మ్యాచ్‌లు జరగనున్నాయి. గ్రూప్-ఎలో భారత్‌తోపాటు పాకిస్తాన్, యుఎఇ, నేపాల్... గ్రూప్-బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థాయ్‌లాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్ లీగ్ దశలో ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ చొప్పున ఆడనుంది. మూడు లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్ టాప్-2 జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. గ్రూప్-ఎలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్-బిలో రెండోస్థానంలో నిలిచి జట్టుతో, గ్రూప్-బిలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్-ఎలో రెండోస్థానంలో నిలిచిన జట్టుతో తలపడనున్నాయి. 2022లో బంగ్లాదేశ్ వేదికగా జరిగిన చివరి ఆసియాకప్‌లో భారతజట్టు విజేతగా నిలిచింది. ఇప్పటి వరకు 8సార్లు మహిళల ఆసియాకప్ టోర్నీ జరగ్గా భారత్ ఏకంగా 7సార్లు విజేతగా నిలిచింది. 2018లో బంగ్లాదేశ్ ఫైనల్లో భారత్‌ను చిత్తుచేసి తొలిసారిగా విజేతగా నిలువగా.. భారత్ రన్నరప్‌తో

గ్రూప్-బి: శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థాయ్‌లాండ్ షెడ్యూల్...

19(శుక్ర)	నేపాల్	× యుఎఇ	మ.2.00గం॥
	ఇండియా	× పాకిస్తాన్	రా.7.00గం॥
20(శని)	మలేషియా	× థాయ్‌లాండ్	మ.2.00గం॥
	శ్రీలంక	× బంగ్లాదేశ్	రా.7.00గం॥
21(ఆది)	ఇండియా	× యుఎఇ	మ.2.00గం॥
	నేపాల్	× పాకిస్తాన్	రా.7.00గం॥
22(సోమ)	శ్రీలంక	× మలేషియా	మ.2.00గం॥
	బంగ్లాదేశ్	× థాయ్‌లాండ్	రా.7.00గం॥
23(మంగళ)	పాకిస్తాన్	× యుఎఇ	మ.2.00గం॥
	ఇండియా	× నేపాల్	రా.7.00గం॥
24(బుధ)	బంగ్లాదేశ్	× మలేషియా	మ.2.00గం॥
	శ్రీలంక	× థాయ్‌లాండ్	రా.7.00గం॥
26(శుక్ర)	సెమీఫైనల్-1		మ.2.00గం॥
	సెమీఫైనల్-2		రా.7.00గం॥
28(ఆది)	ఫైనల్		రా.7.00గం॥

వెస్టిండీస్‌తో రెండోటెస్ట్‌కు ఇంగ్లండ్ రెడీ

ఇంగ్లండ్ బౌలింగ్ మెంటార్‌గా అండర్సన్

లార్డ్స్: వెస్టిండీస్‌లో ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు సిద్ధమైంది. తొలిటెస్ట్‌లో వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 114పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు రెండో టెస్ట్ బరిలోకి దిగుతోంది. మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు 1-0 ఆధిక్యతలో ఉండగా.. 2012 తర్వాత ఇంగ్లండ్ క్రికెట్ జట్టు టెస్టుల్లో స్టువర్ట బ్రాడ్, అండర్సన్ లేకుండా బరిలోకి దిగడం ఇదే తొలిసారి. మరోవైపు వెస్టిండీస్ టెస్టుల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఆ జట్టు అన్ని విభాగాల్లోనూ రాణిస్తేనే ఇంగ్లండ్‌కు గట్టి పోటీ ఇవ్వనుంది.

బౌలింగ్ మెంటార్‌గా అండర్సన్..

మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ మళ్లీ జాతీయ జట్టుతో చేరాడు. 41ఏళ్ల అండర్సన్ వెస్టిండీస్‌తో గురువారం నుంచి లార్డ్స్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు మెంటార్‌గా ఎంపికయ్యాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్టు ముగిసిన తర్వాత అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అయితే రిటైర్మెంట్ ప్రకటించిన మూడు రోజులకే మళ్లీ జాతీయ జట్టుకు సేవలందించనున్నాడు. రెండో టెస్టుకు ఇంగ్లండ్ మార్క్‌వుడ్‌ను తుది జట్టులోకి తీసుకుంది.

117మంది అథ్లెట్లకు 140మంది సహాయ సిబ్బంది

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే 117మంది భారత అథ్లెట్లకు 140మంది సహాయ సిబ్బంది వెళ్లనున్నారు. ఆ జాబితాకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయిన మహిళా షాట్ పుటర్ అబా కథువా పేరును ఈ జాబితా నుంచి తొలగించారు. కేంద్రం ఆమోదించిన జాబితాలో ఆమె పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. వీరితోపాటు 140మందితో కూడిన సహాయక సిబ్బంది, అధికారుల బృందం కూడా పారిస్ వెళ్లనుంది.



ఉత్తమ వార్తా చిత్రం పోటీల గోడ పత్రికను డిప్యూటీ సీఎం భట్టి ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఏటా నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ఉత్తమ వార్తా చిత్రం పోటీల గోడ పత్రికను హైదరాబాద్‌లో బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి, కొత్త సవాళ్లను స్వీకరించడానికి ప్రేరణగా నిలుస్తాయని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్. హరి మాట్లాడుతూ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని 30 ఏండ్లుగా ప్రతి ఏటా ఆగస్టులో ఉత్తమ వార్తా చిత్రం పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 200 మంది దాకా ఫొటో జర్నలిస్టులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశముందన్నారు. 2024 – 2025 గానూ ఉత్తమ వార్తా చిత్రం పోటీల విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.8వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేల పారితోషికంతో పాటు మెమెంటోలు, సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పారు. ఇవే కాకుండా 25 మంది ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు కన్సోలేషన్ బహుమతుల కింద రూ.2 వేల చొప్పున నగదు పురస్కారం అందజేస్తామన్నారు. ఆసక్తి గల ఫొటోజర్నలిస్టులు మూడు 8 ఇన్‌టూ 12 సైజు కలర్, బ్లాక్అండ్‌వైట్ ఫొటోలను ఆగస్టు పదో తేదీలోపు బషీర్‌బాగ్ లోని దేశోద్ధారక భవన్‌లోని టీఎస్‌పీజేఏ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌పీజేఏ రాష్ట్ర నాయకులు నగర గోపాల్, అలీముద్దీన్, హరిప్రేమ్, ఆనంద్ ధర్మాన, వి.రజనీకాంత్, సుమన్ రెడ్డి, శివ కుమార్, అశోకుడు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ జీవో 567ను సవరించాలి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రైతులకు ప్రయోజనం జరిగేలా జీవో 567ను సవరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. "రేషన్‌కార్డులో ఉన్న వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వలన.. కుటుంబం నుంచి వేరుపడిన వారికి రుణమాఫీ వర్తించదు. ఆదార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్ కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. పాసు పుస్తకాల కోసం ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రేషన్‌కార్డులకు కూడా లక్షల్లో దరఖాస్తు చేసుకున్నారు' అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి.సాగర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రుణం తీసుకున్న సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్ (స్వయం సహాయక బృందాలు) జాయింట్ లయబిలిటీ గ్రూప్స్, రైతు మిత్ర గ్రూప్స్, కౌలుదారులకు ఇచ్చిన లోన్ ఎలిజిబిలిటీ కార్డు ఉన్న వారికి రుణమాఫీ వర్తించదని పేర్కొన్నారనీ, వాస్తవానికి ఈ నాలుగు గ్రూపుల్లోని వారు దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుపేదలని వారు వివరించారు. గతంలో కరువు, వరదల వల్ల నష్టపోయిన రైతుల రుణాలను బ్యాంకులు రీ షెడ్యూల్ చేశాయనీ, వీటికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. "గత పదేండ్లుగా బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం వల్ల రైతులకు వడ్డీలు పెరిగాయి. అలాంటి రైతుల రుణం రెండు లక్షలకు పైగా ఉన్నది. పీఎం కిసాన్ డేటాకు రుణమాఫీని జోడించడం వల్ల చాలా మంది రైతులు రుణమాఫీ అర్హత కోల్పోతారు.

20న ఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏ భేటీకి మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

జాతీయ డ్యామ్ భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) సమావేశం ఈనెల 20న ఢిల్లీలో జరగనుంది. ఈ భేటీకి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యంపై ఇప్పటికే ఎన్‌డీఎస్‌ఏ నిపుణల కమిటీ రెండు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. అలాగే రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ చైర్మెన్‌గా న్యాయ విచారణ సైతం జరుగుతున్నది. కాళేశ్వరం బ్యారేజీలకు వర్షాకాలం నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ, ముమ్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయనే సంగతి ఎన్‌డీఎస్‌ఏ తేల్చాల్సి ఉంది. దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టుపై గతంలో భారీ అంచనాలు ఉన్న సంగతి తెలిసిందే. కాగా ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మరమ్మతులు చేసినా ప్రాజెక్టు మనగలుగుతుందనే నమ్మకం లేదని ఎన్‌డీఎస్‌ఏ నిపుణులు చెప్పిన విషయం తెలిసిందే. ఈనెల 20న ఢిల్లీలో జరిగే సమావేశంలో కాళేశ్వరంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా చర్చిస్తారనే ప్రచారం జలసౌధలో జరుగుతున్నది. ఈనేపథ్యంలో ప్రాజెక్టుకు చెందిన సమగ్ర వివరాలతో మంత్రి ఢిల్లీ వెళుతున్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886